Mana Telangana

హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 218
28, ఆదివారం
జనవరి, 2018

ఆదివారం మన తెలంగాణ

www.manatelangana.news

అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



కాబూల్‌లో ఆత్మాహుతి దాడి
- 95 మంది మృతి

11

డబ్బుల్లేవ్..సర్దుకోండి!

యాసంగికి సాగు పెట్టుబడి సాయం సగమే?

- వానాకాలంలో అందరికీ
- తదుపరి సీజన్‌లో పంట వేసిన భూములకే - పథకం నగదు అవసరాల ప్రతిపాదన వెల్లడిస్తున్న రహస్యం



మన తెలంగాణ/ హైదరాబాద్: వ్యవసాయ పెట్టుబడి పథకం పంచ పాండవులు మంచం కోళ్ల సామెతను తలపించేలా కనిపిస్తోంది. మొదట్లో పంట వేసినా, వేయకపోయినా అన్ని రకాల భూములకు రెండు సీజన్‌లకు ఎకరాకు రూ. 4 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు ఒక్కొక్క మెట్టు దిగుతూ మినహాయింపుల కోసం అన్వేషిస్తున్నట్లు స్పష్టమౌతోంది. ఈ పథకానికి అవసరమైన సొమ్ముకు సంబంధించిన ప్రతిపాదనల్లో వ్యవసాయ శాఖ అధికారులు రూ. 9,727 కోట్లుగా చూపించడంలో ఈ విషయం బోధపడుతున్నది. వానాకాలం పంట సీజన్‌లోనే మొత్తం 1.62 కోట్ల ఎకరాలకు నగదు సాయం అందించాలని, యాసంగికి కేవలం పంట సాగు జరిగే భూములకే దానిని పరిమితం చేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం ముందుగా ప్రకటించినట్లుగా 1.62 కోట్ల ఎకరాల భూమికి ఎకరాకు రూ.4000 చొప్పున చెల్లించాలంటే రూ.12 వేల కోట్లు అవసరం అవుతోంది. దీనిని రూ. 9,727 కోట్లకే కుదించాలంటే యాసంగిలో పంట వేయని భూములను మినహాయించాల్సి వస్తోంది. ఇందుకు కారణం ప్రభుత్వం వద్ద తగినంత డబ్బు లేకపోవడమేనని బోధపడుతున్నది. వానా కాలంలో 1.62 కోట్ల ఎకరాలకు, యాసంగికి వచ్చే సరికి 81.06 లక్షల ఎకరాలకు రూ.4 వేలు ఇచ్చేలా వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. దీంతో వానాకాలంలో మొత్తం సాగు యోగ్యమైన భూములకు, యాసంగిలో సగం భూములకే రూ.4వేల చొప్పున పంపిణీ చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఇలా ఒక సీజన్‌కు సాగు భూములన్నింటికీ, మరో సీజన్‌లో సగం భూములకు పెట్టుబడి ఎలా ఇవ్వాలనే అంశంపై అధికారులు గందరగోళానికి గురవుతున్నారు. మరోవైపు ఎకరాకు రూ. 4 వేలు పథకంపై ప్రభుత్వం వైపు నుంచి రోజుకో ప్రతిపాదన వస్తుండటంతో రైతులు అయోమయానికి

తరువాయి 6లో



చకచకా

జెఎసి పార్టీ ఏర్పాటుకు సిద్ధమవుతున్న రంగం

మన తెలంగాణ/ హైదరాబాద్: రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రక్రియను తెలంగాణ జెఎసి మరింత వేగవంతం చేసింది. పార్టీ పేరు, విధి విధానాలు, ఎజెండా, జెండా తదితర అంశాలపై జోరుగా అంతర్గత సమావేశాలు సాగుతున్నాయి. త్వరలో రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తామని ప్రకటించిన జెఎసి చైర్మన్ కోదండరామ్, ఆ దిశగా వ్యూహరచనలు చేస్తున్నారు. వచ్చే నెలలో రాజకీయపరమైన నిర్ణయం వెలువడుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో జెఎసికి ఎవరు నాయకత్వం వహిస్తారనే అంశంపై కూడా చర్చ మొదలైంది. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 4న జరిగే విస్తృత స్థాయి సమావేశానికి జెఎసి ప్రతినిధులందరూ హాజరుకావాలని ఇప్పటికే ఆదేశాలు వెళ్లాయి. కాగా, ఈ సమావేశంలో రైతు, నిరుద్యోగ సమస్యలతో పాటు రాజకీయ అంశంపై కూడా

తరువాయి 6లో



ధనాధన్

ఐపిఎల్ వేలంలో విదేశీయులతో పోటీపడిన భారతీయ క్రికెటర్లు

ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ బెన్‌స్టోక్స్‌కు రూ.12.5 కోట్ల అత్యధిక పాట

మనీష్ పాండే, లోకేశ్ రాహుల్ ఒక్కొక్కరికి రూ.11 కోట్లు

అఫ్గాన్ రషీద్ ఖాన్‌కు రూ.9 కోట్లు

12లో

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2018 సీజన్ కోసం శనివారం నిర్వహించిన వేలం పాటలో భారత క్రికెటర్ల పంట పండింది. విదేశీ క్రికెటర్లతో పోటీ పడి భారత క్రికెటర్లు భారీ ధర పలికారు. ఈ వేలం పాటలో ఊహించినట్టుగానే ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ అత్యధిక ధర పలికాడు. అతన్ని రాజస్థాన్ రాయల్స్ 12.5 కోట్ల రూపాయలు వెచ్చించి సొంతం చేసుకుంది. భారత క్రికెటర్లు మనీష్ పాండేను రూ.11 కోట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్, లోకేష్ రాహుల్‌ను అంతే మొత్తానికి కింగ్స్ లెవన్ పంజాబ్ కొనుగోలు చేసింది. అఫ్గాన్ యువ సంచలనం రషీద్ ఖాన్‌ను రికార్డు స్థాయిలో తొమ్మిది కోట్ల రూపాయలను వెచ్చించి సన్‌రైజర్స్ సొంతం చేసుకుంది. భారత క్రికెటర్లు దినేష్ కార్తీక్, అశ్విన్, కేదార్ జాదవ్, నవ్‌దీప్ సైనీ తదితరులు కూడా వేలం పాటలో కళ్లు చెదిరే ధరను దక్కించుకున్నారు. కాగా, టి–20లో ఎదురులేని శక్తిగా పేరున్న క్రిస్ గేల్, గుప్టిల్, ఆమ్లా, పార్థివ్, జోరూట్ తదితరులకు నిరాశే మిగిలింది.

హత్యారాజకీయం

- నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను చంపించింది మీరంటే మీరని కాంగ్రెస్, టిఆర్‌ఎస్‌ల ఆరోపణల యుద్ధం
- రెండు పార్టీల నేతలతో ఉన్న నిందితుల ఫొటోలు బయటపడడంతో దుమారం

మన తెలంగాణ/ నల్లగొండ : బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై కాంగ్రెస్, టిఆర్‌ఎస్ పార్టీల నేతలు పరస్పర నిందారోపణలు చేసుకుంటూ రక్తమరకలను అద్దుకుంటున్నారు. పార్టీలో చేరనందుకు నకిరేకల్ ఎంఎల్‌ఎ వేముల వీరేశం కనుసన్నల్లో ప్రభుత్వమే ఈ హత్య చేయించిందని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తుండగా, నల్లగొండ ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన అనుచరుని ఎదుగుదలను ఓర్వలేక హత్య పథకం రచించారని


తరువాయి 6లో



బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని డిజిపికి వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఎత్తిపోతల విద్యుత్ భారం

వచ్చే రెండేళ్లలో రూ.10 వేల కోట్లు దాటే అవకాశం



మన తెలంగాణ/ హైదరాబాద్: వచ్చే రెండేళ్లలో ఎత్తిపోతల పథకాల కరెంటు బిల్లు రూ.10 వేల కోట్లు దాటనుంది. ప్రస్తుతం రూ. 1000 కోట్లు దాటిన కరెంటు బిల్లు రెండేళ్లలోనే పది రెట్లు పెరగనుంది. వచ్చే ఏడాది ఈ బిల్లు రూ.5,000 కోట్లకు చేరుతోంది. ప్రభుత్వ ఎత్తిపోతల పథకాలు కీలక

తరువాయి 6లో

కుంచెపోటు



ఎంతనన్ను వేలంలో కొన్నా, మరీ ఇట్లా తీసుకెళ్లడం బాగోలేదు సార్..!

విభేదాలు సహజం

ఐక్యత కోసం కృషి చేయాలి : మోడీ



న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యంలో భేదాభిప్రాయాలనేవి సహజమని, అయితే ఐక్యత కోసం కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం అన్నారు. ఎన్‌సిసి కేడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, శకటాల కళాకారులతో ఆయన మాటామంతీ జరుపుతూ సామాజిక మార్పునకు కృషి చేయాలని, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. దేశాన్ని బలోపేతం, అభివృద్ధి చెందేలా చేయాలంటే ఐక్యత కోసం పాటు పడాలన్నారు. 2019 నాటికి మహాత్మా గాంధీ స్వప్నమైన స్వచ్ఛ భారత్‌ను సాధించాలని కూడా ఆయన కోరారు. స్వతంత్ర భారత దేశంలో ఇతరుల ప్రాణాలు రక్షించడం కోసం 33 వేల మంది పోలీసులు తమ ప్రాణాలు బలి చేశారన్నది కొందరికే తెలుసునని చెప్పారు.

మన కూరగాయల పథకం అమలునకు మార్గదర్శకాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : రైతులు తాము పండించిన కూరగాయలను, పండ్లను నేరుగా మార్కెట్ చేసుకునే సౌకర్యం మన కూరగాయల పథకం ద్వారా ప్రభుత్వం కల్పించింది. బోయిన్ పల్లి మార్కెట్‌లో కూరగాయలకు ఏ మోడల్ ధర అమలు అవుతోందో అదే ధరకు రైతులకు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు వ్యవసాయ, మార్కెటింగ్ కార్యదర్శి సి. పార్థసారథి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముందుగా కూరగాయల ఉత్పత్తి అధికంగా ఉన్న ఈ పథకాన్ని మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లలో ప్రారంభించారు. త్వరలోనే రాష్ట్రం మొత్తం విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. కూరగాయల పథకానికి నోడల్ ఏజెన్సీగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖను నియమించారు. మన కూరగాయలు మూడు దశలలో అమలు కానుంది. 5 గ్రామాలకు చెందిన రైతుల దగ్గర నుంచి ఒక్క రోజులో దాదాపు 1 మెట్రిక్ టన్ను కూరగాయలను సేకరించి కలెక్షన్ సెంటర్లకు పంపుతారు. ప్రభుత్వం నిర్మించిన కార్యాలయంలో ఎంపిక చేసిన చానెల్ ఆధ్వర్యంలో గ్రేడింగ్ చేసిన తరువాత రిటైల్ అవుట్‌లెట్స్‌కి పంపి, వినియోగదారులకు అందుబాటులోకి తీసుకోస్తారు. మన కూరగాయల పథకానికి సంబంధించి రైతులకు, వినియోగదారులకు మధ్య వారధిగా(ఛానెల్) వ్యవహరించాలనుకునే వారిని ప్రభుత్వం టెండర్ ద్వారా ఎంపిక చేయనుంది.

ఆ సెక్షన్లతో పోలీసులకు పట్టపగ్గాలుండవ్

మన తెలంగాణ/హైదరాబాద్: పరుషపదజాలంతో దూషించారనే నెపంతో ఐపిసి 506, 507 సెక్షన్ల కింద (కాగ్నిజబుల్) నేరంగా గుర్తించి, న్యాయస్థానం విచారణ లేకుండానే కేసులు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడకుండా గొంతు నొక్కేందుకు ఉద్దేశించిందని విమర్శించారు. ఇప్పటికే పోలీసులు విచ్చలవిడిగా ఉద్యమాలను అణచడానికి అక్రమ కేసులు పెట్టి జైళ్ళ పాలు చేస్తున్నారని, 506, 507 సెక్షన్లను కాగ్నిజబుల్‌గా చేస్తే పోలీసులకు పట్ట పగ్గాలుండవని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు కూడా ప్రతిపక్షాలు ''పరుషపదజాలం'' ఉపయోగించారనే నెపంతో కేసులు పెట్టే అవకాశముంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 506,507 సెక్షన్లను కోర్టు అనుమతితో కేసు నమోదు చేసే విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మేడారం జాతరకు 16 ప్రత్యేక రైళ్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రయాణికుల అదనపు రద్దీ దృష్ట్యా 'మేడారం సమ్మక్క – సారలమ్మ' జాతరకు సికింద్రాబాద్, హైదరాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రాంతాల నుంచి ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రకటించింది. సికింద్రాబాద్ – వరంగల్ – హైదరాబాద్‌ల మధ్య ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో ప్రత్యే క రైలు (నెం.07014) సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు బయలుదేరి 3:40 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో వరంగల్ – హైదరాబాద్ ప్రత్యేక రైలు (నెం.07015) వరంగల్ నుంచి సాయంత్రం 5:45 గంటలకు బయలుదేరి రాత్రి 9:30 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. అదే విధంగా ఈ నెల 31న కాజీపేట్ – సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రత్యేక రైలు (07019) కాజీపేట్ నుంచి రాత్రి 7 గంటలకు బయలుదేరి రాత్రి 11 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సిర్పూర్ కాగజ్‌నగర్–కాజీపేట్ ప్రత్యేక రైలు (నెం. 07020) ఫిబ్రవరి 4వ తేదీన సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి ఉదయం 5:30 గంటలకు బయలుదేరి 9 గంటలకు కాజీపేట్‌కు చేరుకుంటుంది. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో సిర్పూర్ కాగజ్‌నగర్ – ఖమ్మం ప్రత్యేక రైలు (నెం. 07017) ఉదయం 5:30 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బయలుదేరి 11:15 గంటలకు ఖ్మం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఖమ్మం – సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రత్యేక రైలు (నెం.07018) ఖమ్మం నుంచి సాయంత్రం 4:45 గంటలకు బయలుదేరి రాత్రి 11 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్ చేరుకుంటుందని ఎస్‌సిఆర్ సిపిఆర్ఓ ఎం.ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో వివరించారు.

పెరుగుతున్న చలి తీవ్రత




మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే రెండు రోజులు చలి గాలుల తీవ్రత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముఖ్యంగా ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లా ల్లో చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. గత 24 గంటల్లో ఆదిలాబాద్ రికార్డు స్థాయిలో 5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇదేవిధంగా మెదక్, రామగుండంలలో 11 డిగ్రీలు, భద్రాచలం, హన్మకొండలో 13, హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్‌లలో 14 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా మినహా దాదాపుగా రాష్ట్రమంతటా సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. భద్రాచలం, రామగుండం, హన్మకొండ, ఖమ్మం, రామగుండంలలో సాధారణం కంటే ఏకంగా 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి. మెదక్‌లో 4 డిగ్రీల మేర తగ్గి చలి తీవ్రత పెరిగింది.

29న 'ఐపిఎల్ దిష్టిబొమ్మ' దహనం

మన తెలంగాణ / హైదరాబాద్: క్రీడా వ్యాపారాన్ని ప్రోత్సహిస్తూ అంగట్లో సంతల్లా క్రీడాకారులను కొని వ్యాపార ప్రయోజనాలను ఆర్జిస్తున్న ఐపిఎల్ తీరుకు నిరసనగా ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా 'ఐపిఎల్ దిష్టిబొమ్మ'లను దహనం చేయనున్నట్లు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధినేని కరుణ కుమార్, ప్రధానకార్యదర్శి ఎం. అనిల్‌కుమార్ తెలిపారు. దేశంలో క్రీడలు వ్యాపారవేత్తల చేతుల్లోకి వెళ్లడంతో వారి వ్యాపార ప్రయోజనాలకు వాడుకుంటున్నారని వారు ప్రకటనలో విమర్శించారు. క్రీడలు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మెరుగుపర్చే విధంగా, దేశభక్తిని, యువతలో మానసిక ఉల్లాసానికి, శారీరక ధృఢత్వాన్ని పెంపొందించే విధంగా ఉండాలన్నారు.

హే'కృష్ణా'తొందరెందుకు?

- **నెలాఖరున పదవీ విరమణ చేయనున్న బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ**
- **పెండింగ్ పన్నులన్నింటికీ చకచకా మాన్యువల్స్ తయారీ!**
- **వెంటనే నివేదికలు సమర్పించాలని కమిటీలపై ఒత్తిడి**



మన తెలంగాణ/హైదరాబాద్: కృష్ణా బోర్డు చైర్మన్ శ్రీవాస్తవ ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేస్తుండడంతో ఇంతకాలం పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ చకచకా చేయాలని పట్టుబడుతున్నారు. వర్కింగ్ మాన్యువల్ తయారీలో ఇంతకాలం కాలయాపన చేసిన బోర్డు ఛైర్మన్ పదవీ విరమణకు ఒక్క రోజు ముందే ఖరారు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా రెండు రాష్ట్రాల ఫిర్యాదుల మేరకు కృష్ణాబోర్డు నియమించిన మూడు కమిటీలు వెంటనే నివేదికలు సమర్పించే దిశగా ఒత్తిడి పెంచుతున్నారు. మరో వైపు మైనర్ ఇరిగేషన్ లెక్కలపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీతో సమావేశం జరపాలని నిర్ణయించారు. ఈ నెల 30న కృష్ణా బోర్డు సమావేశం ఖరారు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకుసమాచారమిచ్చారు. వర్కింగ్ మాన్యువల్‌పై తుది నిర్ణయం తీసుకొని, కేంద్రానికి పంపిద్దామని ప్రతిపాదించారు. ఇదే సమావేశంలో రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీతో ఒప్పందంపై కూడా నిర్ణయం తీసుకోనున్నారు.

బోర్డులో ఆంధ్ర ఆధిపత్యం : కృష్ణా బోర్డులో ఆంధ్రా ఆధిపత్యం పెరుగుతోంది. 24 మంది ఉద్యోగులు ఉన్న కృష్ణా బోర్డులో 17 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. ఐదుగురు మాత్రమే తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు. మిగిలిన ఇద్దరు కేంద్ర జల సంఘం నుంచి వచ్చిన ఇతర రాష్ట్రాలకు చెందినవారు.

అమరావతికి కదలండి :
మరో వైపు అమరావతిలో కృష్ణా బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్రం నుంచి బోర్డుకు లేఖ వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒత్తిడి మేరకే అమరావతి దిశగా బోర్డు కార్యాలయం కదులుతోందని సమాచారం. ఇప్పటికే కార్యాలయ ఏర్పాటుకు సంబంధించిన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడం, భవనం ఎంపిక పూర్తయినట్లు తెలిసింది. అయితే రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం కృష్ణా బోర్డు కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో, గోదావరి బోర్డు కార్యాలయం తెలంగాణలో ఏర్పాటు చేయాల్సి ఉంది. కృష్ణా నీటిలో సమస్యలు పెరగడంతో అమరావతిలో ఉండడమే సేఫ్ అనే యోచనతో బోర్డు తరలింపునకు ఏపి ప్రభుత్వం కేంద్రం వైపు నుంచి ఒత్తిడి పెంచుతోంది.

మైనార్టీలకు ఉచిత విద్య

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆస్ట్రేలియాలో మైనార్టీలకు ఉచితంగా విద్యను అందించేందుకు మెల్‌బోర్న్‌లో ఉన్న విక్టోరియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విఐటి) ముందుకు వచ్చింది. ఈ మేరకు విఐటి సిఇఓ అర్జున్ సూరపనేని, ప్రతినిధి నిశిధర్‌రెడ్డిలు రాష్ట్ర హోం, కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డిని శనివారం సచివాలయంలో కలిసి చర్చించారు. ఇటీవల మంత్రి ఆస్ట్రేలియా పర్యటించినప్పుడు విఐటిని సందర్శించి తెలంగాణ విద్యార్థులకు ఏదైనా ప్రయోజనం చేకూర్చాలని కోరారు. ఇందుకు స్పందించిన విఐటి సిఇఓ ప్రస్తుతం డిగ్రీ, పిజి స్థాయిలో మైనార్టీలకు ఉచితంగా విద్యనందించాలని నిర్ణయించామని, ఇందు కోసం ఒక్కొక్కరికి రూ.25 లక్షలు అవుతుందని వివరించారు. విఐటికి ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీలలో శాఖలు ఉన్నాయని, త్వరలో దుబాయ్‌లో శాఖను ప్రారంభిం చనున్నట్లు అర్జున్ తెలిపారు. నాయిని స్పందించి ''అంజుమన్'' ముస్లిం మైనార్టీ సంస్థ నిర్వాహకులను సంప్రదించి అర్హతలు, ఆసక్తి ఉన్న విద్యార్థులను సూచించాలని కోరారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.శ్రీనివాస్‌రెడ్డి, 'అంజుమన్' సంస్థ అధ్యక్షులు అక్తర్ అలీ, కార్యదర్శి అబ్దుల్ వాహెబ్ మంత్రితో చర్చలు జరిపారు.

'స్మార్ట్‌సిటీ' పనులపై కేంద్రం ప్రత్యేక దృష్టి

- **సమీక్షించిన సమీర్‌శర్మ**

మన తెలంగాణ/హైదరాబాద్: స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ పనులపై కేంద్ర పటణాభివృద్ధి శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. స్మార్ట్‌సిటీగా ఎంపికైన కరీంనగర్, గ్రేటర్ వరంగల్ కమిషనరేట్ పరిధిలో కేంద్ర మార్గదర్శకాల అమలు, క్షేత్రస్థాయిలో పనుల పరిస్థితులపై ఆ శాఖ సమీక్షలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని పురపాలక,పరిపాలన శాఖ కార్యాలయంలో శనివారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి సమీర్‌శర్మ వరంగల్ స్మార్ట్‌సిటీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, పురపాలక శాఖ సంచాలకులు డాక్టర్ టి.కె. శ్రీదేవి, వరంగల్ మేయర్ ఎన్.నరేందర్, కమిషనర్ శృతి ఓజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'స్మార్ట్' రహదారులు,భద్రకాళి లేక్, హెరిటేజ్‌వాక్, స్మార్ట్ లైబ్రరీ, వెయ్యిస్తంభాలు, పద్మాక్షి ఆలయం,పనులను అక్కడి అధికారులను సమీర్‌శర్మ అడిగి తెలుసుకున్నారు. మొదటి దశలో భాగంగా రహదారుల టెండర్ ప్రక్రియ ముగిసిందని అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. రెండవ దశ రహదారులను వచ్చే నెల రెండు,మూడవ వారంలో టెండర్ ప్రక్రియను ముగించాలని సూచించారు. నిర్ణీత కాలపరిమితిలోపు పనులను చేపట్టాలని ఆయన వరంగల్ అధికార బృందాన్ని ఆదేశించారు.

ప్రత్యక్షంగానే 'పంచాయతీ'

- **సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు, కార్యదర్శి తమ్మినేని డిమాండ్**



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం నుంచి రూ.15 వేల కోట్ల ఎగుమతులు తగ్గిపోయాయని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం నుంచి దాదాపు రూ.1.15 లక్షల కోట్ల పారిశ్రామిక, సరుకుల ఎగుమతులు జరగగా ప్రస్తుతం రూ.1 లక్ష కోట్లకు పడిపోయిందని ఆయన వవరించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి ఎంబి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాఘవులు మాట్లాడారు. టిఆర్ఎస్ చెబుతున్న బంగారు తెలంగాణ కావాలంటే జహీరాబాద్, జడ్చర్ల, దామరచర్ల, భువనగిరిలో కేంద్ర ప్రభుత్వం నుంచి డ్రై పోర్టుల మంజూరు, రైల్వే మార్గాలు, ప్రాజెక్టులతో పాటు ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సిఎం కెసిఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్రంపై వత్తిడి తీసుకురావాలన్నారు. ఎంఎంటిఎస్‌ను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని కోరారు. ద్రవ్యలోటు సాకుతో ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజా సంక్షేమ పథకాలకు సబ్సిడీల కోత విధించి, సంస్కరణలను మరింత వేగవంతం చేసే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. తమ్మినేని వీరభద్రం రైతులకు ప్రభుత్వ అందించనున్న రూ.4 వేలను కౌలు రైతులకు కూడా ఇవ్వాలని, ఈ అంశాలపై చర్చించేందుకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీ ఎన్నికలను గతంలో మాదిరిగానే ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎంఆర్ఓ, ఆర్‌డిఓలు నిర్వహించే మెజిస్ట్రేట్ కోర్టులను రద్దు చేసి కేవలం కలెక్టర్లకే నిర్ణయాధికారాలు ఇవ్వడం సరైంది కాదని, వాటిని యధాతథంగా కొనసాగించాలన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నష్టాన్ని కూడా ప్రశ్నించలేని దుస్థితిలో సిఎం కెసిఆర్ ఉన్నారని ఆయన విమర్శించారు. కొత్త జిల్లాల ఏర్పాటు మొదలు చాలా అంశాల్లో సిఎం తొందరపాటు నిర్ణయాలు తుగ్లక్ చర్యల్లా తయారయ్యాయని వ్యాఖ్యానించారు. నల్లగొండలో జరిగే పార్టీ మహాసభల్లో వచ్చే మూడేళ్లకు అవసరమైన రాజకీయ వ్యూహాలను రూపొందించనున్నట్లు వెల్లడించారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్) విషయంలో సిపిఐ జాతీయ సమితి వైఖరికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి చెప్పారని ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు.

ప్రజలతో చర్చించాకే..!

- **పంచాయత్‌రాజ్ కొత్త చట్టం తేవాలి**
- **పచ్చని పల్లెల్లో చిచ్చు పెట్టే ప్రయత్నాలు**
- **దళిత బహుజన ఫ్రంట్ డిమాండ్**

మనతెలంగాణ / హైదరాబాద్ : విధివిధానాలు రూపొందించి మంత్రివర్గ ముసాయిదాను ప్రజల ముందుంచి చర్చించాకే పంచాయతీరాజ్ కొత్త చట్టాన్ని తీసుకురావాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) డిమాండ్ చేసింది. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పంచాయతీరాజ్ కొత్త చట్టంపై డిబిఎఫ్ ఆధ్యర్యంలో రౌండ్ టేబ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిబిఎఫ్ నాయకులు శంకర్, టిఆర్ఎస్ఎస్ఎస్ నాయకులు చార్లెస్ వెస్లీ, చంద్రన్న, టివివియు నాయకులు ఎం.వెంకన్న, టిబిసికెయు నాయకులు కెసిసి ప్రసాద్‌లతో పాటు పలు సంఘాల నాయకులు ప్రసంగించారు.కొత్త చట్టం డ్రాఫ్ట్ ముఖ్యమంత్రి వద్ద ఉన్నదని, దానిలోని విషయాలను ఎవరికి తెలియనీయకుండా అత్యంత రహస్యంగా కొత్త పంచాయతీరాజ్ చట్టం తెస్తున్నారని వారు ఆరోపించారు. సర్పంచ్‌లను పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నుకునే విధానాన్ని తీసుకువస్తే చేస్తే ప్రశాంతంగా ఉన్న పచ్చని పల్లెల్లో చిచ్చు రగులు కుంటుందన్నారు. ఇప్పటికే మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నికను పరోక్ష పద్ధతిలో ఉండడంతో గ్రామాల్లో ఏ విధంగా రాజకీయ కక్షలు, గ్రూపులు రగులుకున్నాయో చూశామన్నారు. అంతే కాకుండా సర్పంచిగా పూర్తికాలం అధికారం ఉంటుందో లేదో తెలియదని, ఇలా అధికారంపై అనుమానంతో అభివృద్ధిపై దృష్టి సారించలేరన్నారు. దీంతో ఇప్పటికే అంతో ఇంతో జరుగుతున్న గ్రామాభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందన్నారు. పదవి కాపాడుకోవడం కోసం వార్డు సభ్యులను ప్రసన్నం చేసుకోవడం, బెదిరించడాలు, క్యాంపులు, కిడ్నాప్‌లు వంటి అవాంఛనీయ సంఘటనలు పల్లెల్లో చూడాల్సివస్తుందని వారు హెచ్చరించారు. రెండు రోజుల క్రితం ఆకస్మికంగా మరణించిన దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మొగులయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ కోసం పోరాడిన వారిని అణిచివేసేందుకే కెసిఆర్ అధికారంలోకి వచ్చారా? అన్నట్లు పరిస్థితులు ఉన్నాయని, ఎవరు నిరసన తెలిపిన జైళ్ళలో పడేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నియంతృత్వ టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు తెలంగాణ సమాజమంతా కాంగ్రెస్ పార్టీతో చేతులు కలపాలని కోరారు. సిద్ధిపేటకు చెందిన టిజెఎసి నాయకులు సింబుల భూపతిరెడ్డి, పలువురు కార్యకర్తలు శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సభలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఉత్తమ్ పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యార్థి సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తేనే సంపూర్ణ విద్య

- **ప్రముఖ శాస్త్రవేత్త ఎస్. కరుణానిధి**

మనతెలంగాణ/హైదరాబాద్ : కేవలం విద్యకే ప్రాధాన్యత ఇవ్వకుండా క్రీడలు, ఆటలకు తగిన సమయం కేటాయించి విద్యార్థి సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తేనే సంపూర్ణ విద్య అనిపించుకుంటుందని ప్రముఖ శాస్త్రవేత్త, కంట్రోల్ సిస్టమ్స్ లేబరేటరీ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కరుణానిధి అన్నారు. సంస్కృతి–2018 పేరుతో జూబ్లీహిల్స్‌లోని నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు శనివారం శ్రీనగర్‌కాలనీలోని శ్రీ సత్య సాయి నిగమాగమంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎస్.కరుణానిధి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పాఠ్యాంశాలను బట్టీ పట్టించడం కాకుండా ఆసక్తికరంగా బోధిస్తే విద్యార్థుల్లో సృజనాత్మకత వెల్లివిరుస్తుందన్నారు. మరో అతిథి డాక్టర్ విజయ నిర్మల మాట్లాడుతూ, మార్కుల విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర విద్యార్థులతో పోల్చకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఇతరులతో పోల్చడం ద్వారా పిల్లలపై అనవసరంగా ఒత్తిడిని పెంచినట్లవుతుందని తెలిపారు. పిల్లల్లోని ఆసక్తిని గమనించి, సృజనాత్మకతను వెలికితీసే విధంగా నేటి విద్యావిధానం ఉందన్నారు. ప్రముఖ సినీ నటుడు రఘు కారుమంచి మాట్లాడుతూ, తమ పిల్లకు ఏమి కావాలో తెలుసుకుని, వారి ఆసక్తులను గమనించి, ఆయా రంగాల వైపు ప్రోత్సహించవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ సందర్భంగా చదువులో, క్రీడల్లో రాణించిన విద్యార్థులను బహుమతులు ప్రదానం చేశారు. నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ వి.వి.ఎల్ శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డీన్ ఆంజనేయులు, డీన్ రోహిణి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

కాకతీయ, కాళేశ్వరంపై అంతర్జాతీయ ప్రశంసలు





మన తెలంగాణ/హైదరాబాద్: మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణంపై అంతర్జాతీయ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇరిగేషన్ రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, చేపట్టిన పథకాలపై ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎస్‌కె జోషి శనివారం జలసౌధలో విదేశీ ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అడ్మినిస్ట్రేటివ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) ఆధ్వర్యంలో 19 దేశాలకు చెందిన ప్రతినిధులు రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అధ్యయనం కోసం నాలుగు వారాల పర్యటనకు హైదరాబాద్ వచ్చారు. ఇందులో భాగంగా ఇరిగేషన్ రంగంలో ప్రగతిని ఎస్‌కె జోషి సోదాహరణంగా వివరించారు. రాష్ట్ర ఆవిర్భానికి ముందు 80 వేల వరకు చెరువులు, కుంటలు ఉండగా, పట్టణీకరణ, ఇతరత్రా కారణాలతో దాదాపు సగం కనుమరుగయ్యాయని జోషి చెప్పారు. గొలుసుకట్టు చెరువులతో పాటు మొత్తం చిన్న నీటి వనరులను పరిరక్షించేందుకు, వాటిని పునరుద్ధరణకు, పునర్నిర్మించడానికి గాను చేపట్టిన మిషన్ కాకతీయ పథకం చేపట్టామని, దశల వారీగా 46 వేల చెరువుల పునరుద్ధరణ చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి చెరువును నిండు కుండలా మార్చే ప్రయత్నం చేస్తున్నామని, దీంతో అద్భుత ఫలితాలు వస్తున్నాయని, గ్రామీణ ఆర్థిక, సామాజిక స్థితిగతులలో అనూహ్య మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, లైవ్‌లో పనులు పర్యవేక్షిస్తున్న తీరుపైనా జోషి వారికి వివరించారు. శ్రీలంక, ఇథియోపియా, దక్షిణాఫ్రికా తదితర దేశాల ప్రతినిధులు మిషన్ కాకతీయ, కాళేశ్వరంతో పాటు పాలమూరు రంగారెడ్డి తదితర ఇతర ప్రాజెక్టులపైనా తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కాడా కమిషనర్ డాక్టర్ మల్సూర్, మైనర్ ఇరిగేషన్ సిఇలు సురేష్, శ్యాంసుందర్, ఆస్కి ప్రోగ్రాం డైరెక్టర్లు డాక్టర్ పి.సుభాషిణి, రాజ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానివి హత్యారాజకీయాలు



మన తెలంగాణ/నీలగిరి : ఇటీవల కాలంలో దారుణ హత్యకు గురైన బొడ్డుపల్లి శ్రీను కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ శనివారం పరామర్శించారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ హత్యా రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తాను నల్లగొండకు రావడంతోనే శ్రీనివాస్ హత్య విషయం తెలవడంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానన్నారు. శ్రీనివాస్‌ను హత్య చేసిన తరువాత చైర్‌పర్సన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే పోలీసులు ప్రస్తావించిన తీరు అవమానకరంగా ఉందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నూకల నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



శ్రీనివాస్ హత్యపై న్యాయ విచారణ జరపాలి : కర్నె ప్రభాకర్

మన తెలంగాణ / హైదరాబాద్ : నల్లగొండ చైర్‌పర్సన్ భర్త బొద్దుపల్లి శ్రీనివాస్ హత్యపై న్యాయ విచారణ జరపాలని టిఆర్ఎస్ శాసనసభాపక్షం కోరింది. టిఆర్ఎస్ఎల్పి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్, ఎంఎల్‌ఎ గ్యాదరి కిషోర్‌లు మాట్లాడారు. నల్లగొండలో బొద్దుపల్లి శ్రీనివాస్ హత్యకు టిఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని కర్నె అన్నారు. నిజాలు నిగ్గు తేల్చేందుకు ఏ విచారణ సంస్థ తో విచారణ జరిపినా తమకు అభ్యంతరం లేదన్నారు. శ్రీనివాస్ హత్యకు నల్లగొండ జిల్లా మంత్రికి, ఎంఎల్‌ఎ వీరేశం ,చివరకు సిఎం కెసిఆర్ బాధ్యత వహించాలని కాంగ్రెస్ నేతలు కోరడం పిచ్చిత నానికి నిదర్శనమన్నారు. శ్రీనివాస్ గత సంవత్సర కాలంగా ఎవరెవరితో ఫోన్ లో మాట్లాడారో కాల్ లిస్ట్ బైట పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంఎల్‌ఎ వీరేశం ఫోన్ కాల్ లిస్ట్ బైట పెట్టాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ ఎంఎల్‌ఎ కోమటి రెడ్డి వెంకట రెడ్డి ఫోన్ కాల్స్ లిస్ట్ కూడా బయట పెట్టమన్నాలన్నారు. వీరేశం ఫోన్ కాల్ లిస్ట్ బయట పెట్టేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కోమటి రెడ్డి వెంకట రెడ్డికి హతుడు శ్రీనివాస్ అనంగు శిష్యుడని,ఫోటో లే విచారణకు ప్రామాణికమైతే నిందితులందరూ కోమటి రెడ్డి తో ఫోటో లు దిగారని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను వారు మీడియా సమావేశంలో ప్రదర్శించారు.



ఎంఎల్ఏల గృహ సముదాయం నిర్మాణం సకాలంలో పూర్తి

- ఆలస్యమైతే కాంట్రాక్టర్‌పై చర్యలు
- నిర్మాణ పనులను పరిశీలించిన స్పీకర్

మన తెలంగాణ /హైదరాబాద్: హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో నూతనంగా నిర్మిస్తున్న శాసనసభ్యుల నివాస గృహ సముదాయం (ఎంఎల్ఎ క్వార్టర్స్) ఫిబ్రవరిలో ప్రారంభోత్సవానికి సిద్ధం కానుంది. నిర్మాణ పనులు ఆలస్యంగా చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఎంఎల్ఎ క్వార్టర్స్ నిర్మాణ పనులను శాసన మండలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ ఎస్. మధుసూదనా చారి, డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి, పలువురు ఎంఎల్‌సిలు, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు, ఇతర అధికారులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఎంఎల్ఏ క్వార్టర్స్ నిర్మాణాన్ని రూ.132.73 కోట్ల అంచనా వ్యయంతో ప్రాంభించగా ఇప్పటివరకు రూ.118.15 కోట్లను ఖర్చు చేశామని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా చెప్పారు. మొత్తం 120 ఎంఎల్ఎ క్వార్టర్లను నిర్మించతలపెట్టగా ఇప్పటివరకు 70 క్వార్టర్లు పూర్తయ్యాయని, మిగిలిన 50 క్వార్టర్లు ఫిబ్రవరిలో పూర్తి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ భవన సముదాయం ప్రాంగణంలో 120 సర్వెంట్ క్వార్టర్లు, మరో 36 స్టాఫ్ క్వార్టర్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. పన్నెండు అంతస్థుల ఈ భవనాలలో 1 నుంచి 7 అంతస్థులలో 70 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి కాగా మంచినీటి సరఫరా, మురుగునీటి కనెక్షన్ల పని జరుగుతున్నదని, 8, 9వ అంతస్థులలో మొత్తం 20 ఫ్లాట్ల పనులు దాదాపు పూర్తయ్యాయని, క్లీనింగ్, సానిటరీ పనులు పురోగతిలో ఉన్నాయని, 10, 11, 12 అంతస్థుల్లో మొత్తం 30 ఫ్లాట్ల పనులు చివరి దశలో ఉన్నాయని మంత్రి వివరించారు.

వానాకాలం నాటికి కల్వకుర్తి ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి



మన తెలంగాణ/హైదరాబాద్: కల్వకుర్తి ప్రాజెక్టు కింద పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వచ్చే వానాకాలం నాటికి పూర్తిచేయాలని మంత్రి టి.హరీశ్‌రావు ఆదేశించారు. జలసౌధలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంఎల్ఏ మర్రి జనార్ధన్‌రెడ్డి ఇటీవల జరిపిన జలవి జయ యాత్ర సందర్భంగా వచ్చిన విజ్ఞప్తులను మంత్రి పరిశీలించారు. దాదాపు 60కి పైగా విజ్ఞప్తులు రాగా, వాటిపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు ఇంజనీర్లను ఆదేశించారు. 2016–17లో 280 చెరువులు కల్వకుర్తి ప్రాజెక్టుతో నింపగా, ఈ ఏడాది 350 చెరువులు నింపినట్లు అధికారులు మంత్రికి వివరించారు. కల్వకుర్తి కింద మొత్తం ఆయకట్టు 4.25 లక్షల ఎకరాలు కాగా, గత ఏడాది 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని, ఈ యాసంగిలో 2 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరా చేసినట్లు ఇరిగేషన్ అధికారులు చెప్పారు. 29, 30 ప్యాకేజీలలో మిగిలిపోయిన డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులు వచ్చే వానాకాలం నాటికి పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. ఒప్పందం ప్రకారం గడువు లోపు ఈ పనులు చేయని పక్షంలో నిబంధనల ప్రకారం సంబంధిత ఏజెన్సీని తొలగించి, ఇతరులకు ఇవ్వాలని సూచించారు. కల్వకుర్తి మెయిన్ కెనాల్ సహా డిస్ట్రిబ్యూటరీల కింద మిగిలిన పనులన్నీ ఖరీఫ్ నాటికి పూర్తిచేయాల్సిందేనని మంత్రి గడువు విధించారు. ఈ సమీక్షా సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంఎల్ఏ మర్రి జనార్థన్ రెడ్డి, మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజనీర్ ఖగేందర్‌రావు, ఎస్‌ఇ భద్రయ్య, జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో సమస్యలు పరిష్కారం

మన తెలంగాణ/హైదరాబాద్ : గ్లోబల్ టెక్నాలజీ సహాయంతో స్థానిక సమస్యలను పరిష్కరించుకోడానికి కృత్రిమ (ఆర్టిఫిసియల్) మేధస్సును ఉపయోగించుకోవాలని మంత్రి కెటి రామారావు అన్నారు. దవోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్లుఇఎఫ్) 2018 లో గ్లోబల్ టెక్నాలజీ, స్థానిక సమస్యల పరిష్కారం అంశంపై ఆయన ప్రసంగించారు. క్రమబద్ధీకరణ సమస్యలపై మొదట దృష్టిసారించాలని, అర్థవంతమైన డాటాను ఉత్పత్తి చేయడం వల్ల కృత్రిమ మేధస్సు ప్రయోజనాలు కల్గుతాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం 2016లో ఓపెన్ డాటా పాలసీని ప్రారంభించిందని మంత్రి తెలిపారు. ఇపుడు ప్రజల కోసం 50 డాటా సెట్లు తెరవబడి ఉన్నాయన్నారు. ఓపెన్ డాటా పాలసీ పారదర్శకత కోసమే గాకుండా నాణ్యమైన డాటా సేకరణ ఉపయోగపడేలా చేయడానికి దోహదపడుతుందన్నారు. దీని వల్ల సమస్యల పరిష్కారాలు లభిస్తాయన్నారు. సాంస్కృతిక, ప్రాంతీయ, భాషా వ్యత్యాసాలను ఎలా తెలుసుకోవాలనే దానిపై దృష్టిసారించాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ప్రజల స్థానిక నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. గ్లోబల్ సంస్థలు స్థానికంగా పనిచేయడం ప్రజలకు సహకరిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన ఈ సందర్భంగా వివరించారు.

రహదారి కోసం 5.31ఎకరాల స్థలం

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఇన్నోవా అలా య్ స్టీల్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన 5.31ఎకరాల స్థలాన్ని పంచాయత్‌రాజ్ శాఖకు బదలాయిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలోని పాషమై లారం పరిధిలోని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సెక్షన్147 పంచాయత్‌రాజ్ ఆక్ట్,1994 ప్రకారం ఈ స్థలాన్ని ప్రజల అవసరాల కోసం బదలాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అందరి అవసరాల కోసం రహదారి నిర్మించడానికి ఈ స్థలాన్ని తీసుకున్నారు.

‘ఉన్నత’ ప్రణాళికలు

- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యావిధానం
- దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలతో ఉన్నత విద్యామండలి దార్శనిక పత్రం



మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ స్థాయి ప్రమాణాలతోపోటీపడే విధంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, కోర్సుల్లో మార్పులు తీసుకువచ్చేలా విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉన్నత విద్యామండలి నిర్ధేశించింది. జాతీయ , అంతర్జాతీయ సంస్థలు, పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకుని విద్యార్థులకు ప్లేస్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించేలా కృషి చేయాలి. ఇందుకోసం 2018 నుంచి 2020 వరకు స్వల్ప కాలిక ప్రణాళికను, ఆ తర్వాత నాలుగేళ్ళ కాలానికి దీర్ఘకాలిక ప్రణాళికల దార్శనిక పత్రాన్ని ఉన్నత విద్యామండలి రూపొందించింది.

దీర్ఘకాలిక లక్ష్యాలు :

- సైన్స్, టెక్నాలజి, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ కోర్సులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించుకోవాలి. నిధులు కేటాయించాలి. విద్యా ప్రమాణాల నిరంతర పరిశీలనకు ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యార్థులు ఉద్యోగాలు పొందే వారిగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చే విధంగా తీర్చిదిద్దాలి.
- రాష్ట్రంలో రుద్యోగ సమస్యను తగ్గించేందుకు వృత్తి విద్యను బలోపేతం చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ఒకేషనల్, డిప్లొమా కోర్సులను రూపొందించాలి. రోడ్ మ్యాప్‌ను రూపొందించి అమలుచేయాలి.
- విద్యార్థులు స్వతహాగా సంపాదించుకుంటూనే చదువుకునే విధానాలు అభివృద్ధి చేయాలి.
- ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం(సిబిసిఎస్) విధానాన్ని బలోపేతం చేయాలి
- కోర్సులలో గ్రూపులతోపాటు వ్యక్తిగతంగా ప్రాజెక్ట్ వర్క్స్ రూపొందించాలి.
- జాతీయ ప్రణాళికలకు అనుగుణంగా సంస్కరణలు తీసుకురావాలి.ఇన్నోవేషన్‌హబ్‌లనుఏర్పాటు చేయాలి
- గ్రామీణ ప్రాంతాలను, పట్టణాలను హైదరాబాద్‌కు అనుసంధానం చేయాలి.

స్వల్పకాలిక ప్రణాళిక

- విద్యార్థులందరికీ సమాన అవకాశాలు, ఉపాధి అవకాశాలు లభించేలా విద్యాసంస్థలు దృష్టి పెట్టాలి.
- అన్ని వర్సిటీలు వెబ్‌సైట్లలో సిలబస్, సమాచారాన్ని పొందుపరచాలి. అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందించుకోవాలి.
- విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచడానికి ఈ ఏడాదే ఉన్నత విద్యా మండలి క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(క్యూఐపి)ని ఆవిష్కరించనుంది.
- విద్యాసంస్థల్లో అధ్యాపకులకు కొంతమంది విద్యార్థులను కేటాయించి వారికి ప్రతిభ, అభివృద్ధికి పర్యవేక్షించే విధంగా మెంటార్ సపోర్ట్ సిస్టం (ఎంఎస్ఎస్)ను ప్రవేశపెట్టాలి.
- విద్యార్థులు తప్పనిసరిగా పరిశ్రమలు సందర్శించేలా చర్యలు తీసుకోవాలి.
- కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సిఎస్ఆర్)పై దృష్టి సారించాలి.
- విద్యాసంస్థలు,కళాశాలల్లోఇంకుబేటర్స్ ప్రారంభించాలి.

ఇసుక లారీలతో ఇక్కట్లు

- ఎడతెరిపిలేకుండా వస్తున్న లారీలు
- పట్టించుకోని అధికారులు
- జాతరకు మిగిలింది రెండు రోజులే

మన తెలంగాణ/వరంగల్‌బ్యూరో: మేడారం మహాజాతరకు మరో రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉంది. జాతరకు వేలాదిగా వాహనాలు వస్తున్నాయి. సందెట్లో సడేమియా అన్నట్లుగా ఇసుక లారీలు జాతరకు భక్తులకు ఇబ్బందికరంగా మారాయి. ఇసుక లారీలను అరికట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది. మేడారం జాతరకు రాష్ట్ర నలు మూలల నుంచి వాహనాలలో భక్తులు వస్తున్నారు. ఇసుక లారీలతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గడిచిన వారం రోజులలో మూడు నాలుగు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. నిత్యం హైదరాబాద్ నుంచి ఇసుక లారీలు వందల సంఖ్యలో వస్తున్నాయి. 24 గంటలు ఇసుక లారీల రాస్తా నడుస్తూనే ఉంది. జాతరకు వచ్చే అధికారులు సైతం లారీలతో ఇబ్బందులు పడుతున్నప్పటికి వాటిని నిలిపివేయడంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.గత నెల రోజుల నుంచి జాతరకు భక్తుల రాక సాగుతూనే ఉంది. జాతర సమయం దగ్గర పడుతున్నకొద్ది భక్తుల రద్దీబాగా పెరుగుతోంది. వాహనాల సంఖ్య వేలల్లో వస్తున్నాయి. వాటిలోనే ఇసుక లారీల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. లారీలు మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయి నా వాటిని అదుపు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించే పోలీసులు సైతం చూసిచూడనట్టుగానే ఇసుక లారీలను వదిలివేయడం వల్ల జాతరకు వచ్చే భక్తులతోపాటు సాధారణ ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మేడారం జాతర ముగిసే వరకు ఇసుక లారీలను పూర్తిగా నిలిపివేయాలని భక్తులు కోరుతున్నారు. ఇటివల రవాణశాఖ మంత్రి వచ్చిన సందర్భంగా కూడా ఈవిషయాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గతంలో పగలు ఇసుక లారీలను నడపకుండా రాత్రి 9 గంటల తరువాత నడిచే విధంగా నిబంధనలు విధించారు. పగలు లారీలను నడపవద్దని కఠిన నిబంధనలు విధించినప్పటికి వాటిని బేఖాతురు చేస్తూ ఇసుక లారీలను నడుపుతున్నారు. జాతరకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రాత్రి వేళల్లోనే బయలుదేరి వస్తున్నారు. ఇసుక లారీలు రాత్రి వేళల్లో నాలుగైదు లైట్లు వేసుకొని వస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనదారులకు కనీసం రోడ్డు సక్రమంగా కనిపించని పరిస్థితి ఏర్పడుతుంది. దీనితోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతర ముగిసే వరకు ఇసుక లారీల రవాణను పూర్తిగా నిలిపివేయాలని భక్తులు కోరుతున్నారు.



జాతరను విజయవంతం చేయాలి

- మేడారంలో పర్యటించిన స్పీకర్

మన తెలంగాణ/భూపాలపల్లిప్రతినిధి: ఆసియా ఖండంలోనే కుంభమేళా మేడారం మహా జాతరను జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర శాసన సభా స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం జాతరలో స్పీకర్ వనదేవతలను తనివి తీరా దర్శించకొని ఎత్తు బంగారాన్ని సమర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీతో కలిసి మేడారంలో పర్యటించారు. ఆదివాసీల సంస్కృతికి ప్రతిబింబించేలా నిర్మించిన మ్యూజియంను, హరిత హోటల్‌ను పరిశీలించారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలను జాతరలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను, స్నాన ఘట్టాలను పరిశీలించి మొక్కులు చెల్లించడానికి వచ్చే భక్తులకు కల్పించిన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈనెల 31 నుండి ఫిబ్రవరి 3వరకు జరిగే మేడారం మహా జాతర ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించి సెక్టోరియల్ అధికారులతో మాట్లాడారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ మరో నాలుగు రోజుల్లో కోటి మందితో మేడారం మహా నగరం ఇక్కడ ఏర్పాటు కాబోతుందనీ, కోటి మంది ఒకే సారి వచ్చివెళ్లడం ఒక మహత్యం అని ఇది అమ్మవారి మహత్యంతో సాధ్యమౌతుందని అన్నారు. పౌర సమాచార శాఖ ఆధ్వర్యంలో మేడారం మహా జాతరలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను స్పీకర్ ప్రారంభిం చారు. కుంభమేళా మేడారం మహాజాతరకు జాతీయ హోదా కల్పించేలా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి జాతీయ హోదా గుర్తింపు వచ్చే విధంగా వార్తా , ప్రచారాలు అందించాలని అన్నారు. అనంతరం ఎండ్ల బండ్లలో ఈ నెల 31న కుటుంబ సమేతంగా తల్లుల దర్శనానికి మళ్లీ వస్తానని స్పీకర్ వెల్లడించారు. ఇంచార్జ్ కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా ఎస్పీ ఆర్.భాస్కరన్, మేడారం జాతర కమిటీ చైర్మెన్ కాకా లింగయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంకుషారంలో స్పీకర్ పల్లెప్రగతి నిద్ర : జయశంకర్ జిల్లా భూపాలపల్లి నియోజకవర్గంలోని టేకుమట్ల మండలం అంకుషాపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఎస్టీ కమ్యూనిటీ భవనం హాల్‌ను ప్రారంభించి శనివారం స్పీకర్ మధుసూదనా చారి పల్లె ప్రగతి చేశారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు గ్రామస్తులు డప్పుచప్పుల్లు, కోలాటాలతో నృత్యాలు చేస్తూ , బాణాసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు.



ప్రారంభమైన ఐసిసిబి సదస్సు

- ఆకట్టుకున్న నోబెల్ అవార్డు గ్రహీత మార్టిన్ చాల్ఫీ ప్రసంగం
- హాజరైన 30 దేశాల ప్రతినిధులు

మనతెలంగాణ/హైదరాబాద్:ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కణ జీవశాస్త్ర సదస్సు–2018 (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ సెల్ బయాలజీ–ఐసిసిబి) అట్టహాసంగాప్రారంభమైంది.సెంటర్‌ఫర్‌సె ల్యూలార్ అండ్ మాలిక్యులార్ బయాలజి(సిసిఎంబి) ఆధ్వర్యంలో షామీర్‌పేటలోని లియోనియా రిసార్ట్‌లో శనివారం ప్రారంభమైన ఈ సదస్సును ఈ నెల 31వ తేదీ వరకు జరుగనుంది. జీవ వైజ్ఞానిక శాస్త్రంలో మూడు అగ్రగామి సంస్థలైన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ సెల్ బయాలజి(ఐఎఫ్‌సిబి), ఏషియన్ పసిఫిక్ ఆర్గనైజర్ ఫర్ సెల్ బయాలజి(ఎపిఒసిబి), ఇండియన్ సొసైటీ ఫర్ సెల్ బయాలజి (ఐఎస్‌సిబి)లు తొలిసారిగా ఈ సదస్సులో భాగస్వామ్యమయ్యాయి. ఐఎఫ్‌సిబి అధ్యక్షులు నొబుటకా హిరోకవా, ఎపిఒసిబి అధ్యక్షులు సత్యజిత్ మేయర్, ఐఎస్‌సిబి జగత్ కె రాయ్, సిసిఎంబి డైరెక్టర్ ఆర్.కె.మిశ్రాలు ప్రారంభోపాన్యాసం చేశారు. ఈ సదస్సు భారతీయ, అంతర్జాతీయ పరిశోధకుల మధ్య సహాయ సహకారాలు ప్రోత్సహించి పెంపొందిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

మార్టిట్ చాల్ఫీ సైన్స్ లెక్చర్‌తో ప్రారంభం : అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన నోబుల్ బహుమతి గ్రహీత మార్టిన్ చాల్ఫీ ఉపన్యాసంతో ఐసిసిబి మొదటి సెషన్ ప్రారంభమైంది. ఈ సెషన్‌లో కణాలను అన్వేషించే నూతన విధానాలు, వాటి ఉపయోగాలపై ఆయన వివరించారు. గ్రీన్ ఫ్లోరోసెంట్ ప్రొటీన్(జిఎఫ్‌పి) అనుపరమాణువు కణ జీవశాస్త్ర రంగంలో చోటు చేసుకున్న పురోగతిపై ఆయన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత సెషన్‌లో కణాల్లో వ్యాధి అభివృద్ధికి కారకాలు, వ్యాధి చికిత్సకు దోహపడే నూతన మార్గాలను చర్చించారు. వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు శాస్త్రీయ పరిశోధనలు వేగంగా దోహదపడటం లక్ష్యంగా శాస్త్రవేత్తలు, వైద్యుల మధ్య సమావేశం జరిగింది. యువ పరిశోధకులను ఉద్దేశించి జరిపిన ప్రత్యేక సెషన్‌లో జీవశాస్త్రంలో పరిశోధన విలువలు, ఉపాధి అవకాశాలపై చర్చించారు.

హాజరైన 30 దేశాల ప్రతినిధులు : ఐసిసిబి సదస్సుకు దేశ విదేశాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. మనదేశంతో పాటు 30 ఇతర దేశాల నుంచి సుమారు 1200 మంది కణ జీవశాస్త్ర పరిశోధకులు, విద్యార్థులు సదస్సుకు వచ్చారు.

దేశంలోనే తొలిసారి : ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ సెల్ బయాలజి సదస్సు దేశంలోనే తొలిసారి నిర్వహిస్తున్నారు. నాలుగేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ సదస్సుకు దక్కించుకునేందుకు ఎన్నో దేశాలు పోటీపడినా, తొలిసారిగా భారత్‌కు అవకాశం లభించింది. గత మూడు దశాబ్దాలుగా కణ జీవశాస్త్ర రంగ పరిశోధనల్లో భారత్ చేస్తున్న కృషి కారణంగా సదస్సుకు నిర్వహణకు అవకాశం లభించిందని నిర్వాహకులు తెలిపారు. కణ జీవశాస్త్రంలో కొత్త ఆవిష్కరణల నుంచి ఔషద ఉత్పత్తుల అభివృద్ధికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో జరుగుతున్న ఈ సదస్సులో మూలకణాలు, కణజాల నిర్మాణం, క్రయో ఎలక్ట్రాన్ మైక్రోస్కోపిక్ పద్దతులు, ఆరోగ్య, వ్యాధి నిర్ధారక పరీక్షల్లో కణ జీవశాస్త్ర ఉపయోగాలు తదితర అంశాలు చర్చించనున్నారు.



తెలంగాణ ఫోటోజర్నలిస్టు అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్

సదర్‌మట్ బ్యారేజి నిర్మాణ అంచనాలకు సవరణ

మన తెలంగాణ/హైదరాబాద్: సదర్‌మట్ బ్యారేజి నిర్మాణ అంచనాలు సవరించారు. రూ.520.390 కోట్ల సవరణ అంచనాలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. గతంలో రూ.516.233 కోట్లతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. గోదావరి నదిపై శ్రీరాంసాగర్‌కు దిగువన నిర్మల్ జిల్లా మామడ మండలం పొనకల్ గ్రామంలో సదర్‌మట్ బ్యారేజిని నిర్మిస్తున్నారు. 1.58 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో బ్యారేజి నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఇఎన్‌సిని ఆదేశిస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శైలేంద్ర కుమార్ జోషి ఉత్తర్వులు జారీచేశారు.

“మానవుని ప్రతిభా పాటవాలు, సూర్య కిరణాల్లా విస్తరిస్తాయి. అవి కేంద్రీకృతమైతే ప్రకాశిస్తాయి.
– స్వామి వివేకానంద”



సంపాదకీయం

భారత్–ఆసియన్ మమేకత

పది ఆగ్నేయాసియా దేశాలతో కూడిన ఆసియన్‌తో భారత్ సంబంధాల అభివృద్ధి ఆకాంక్ష కొత్త మొగ్గతొడిగింది. ఆసియన్ దేశాల(ఇండోనేషియా, సింగపూర్, ఫిలిప్పీన్స్, మలేసియా, బ్రూని, థాయిలాండ్, కంబోడియా, వియత్నాం, లావోస్, మయన్మార్) రాజ్య/ప్రభుత్వ అధినేతలతో ఢిల్లీలో భారత ప్రభుత్వం నిర్వహించిన శిఖరాగ్రసభ బహుళపక్ష, ద్వైపాక్షిక సంబంధాల్లో మందకొడితనాన్ని తొలగించే అవకాశం కల్పించింది. భద్రత, వాణిజ్యం, ఆర్థిక సహకారం, ప్రాంతీయ సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఆర్‌సిఇపి), హిందూ మహా, దక్షిణ చైనా సముద్రాల్లో నౌకాయాన స్వేచ్ఛ ప్రధానంగా చర్చకు వచ్చాయి. ఢిల్లీ డిక్లరేషన్ ఈ అంశాలను వక్కాణించింది. ఆసియన్ దేశాలతో రవాణా సంబంధాలను వేగవంతం చేయటం మన ఈశాన్య భారత్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం చేస్తుంది. వాణిజ్యం రీత్యానేగాక వ్యూహాత్మకంగా కూడా ఆ ప్రాంతం భారత్‌కు ముఖ్యమైంది. అయితే కారణాలేమైతేనేం, భౌగోళిత సామీప్యతగల ఆ ప్రాంతంతో భారత్ సంబంధాల వృద్ధి హంసపాదులతో సాగుతుండగా, చైనా సంబంధాలు వేగం పుంజుకున్నాయి. ఉదాహరణకు, 2014–15లో భారత్–ఆసియన్ వాణిజ్య విలువ 76.53 బిలియన్ డాలర్లు కాగా చైనా–ఆసియన్ వాణిజ్య విలువ 452.2 బిలియన్ డాలర్లు. దక్షిణ కొరియా, జపాన్, ఆస్ట్రేలియా వాణిజ్య విలువ కూడా మనదేశం కన్నా హెచ్చుగా ఉంది. అలాగే ఆసియన్ దేశాల్లో భారత్ పెట్టుబడులు 2015–16లో 22.4కోట్ల డాలర్లు కాగా, అదే కాలంలో చైనా పెట్టుబడులు 300కోట్ల డాలర్లకు పైమాటే. చైనా–భారత్ వాణిజ్యంలో కూడా చైనా ఎంతో మిగులుతో ఉంది.

ఆసియన్‌తో వాణిజ్య అభివృద్ధికి భారత్–మయన్మార్–థాయిలాండ్ జాతీయ రహదారి, మయన్మార్‌తో కలడన్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు, బంగ్లాదేశ్ గుండా బ్యాంకాక్–యాంగూన్–ఢిల్లీ రైలు లేక రహదారి నిర్మాణం వంటి మౌలికవసతుల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయటానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. దక్షిణ చైనా సముద్రంపై చైనా క్లెయిం, దాని ఒక బెల్ట్ – ఒక రోడ్ చొరవ, ఈ ప్రాంతంనుండి అమెరికా తప్పుకోవటం వంటి పరిణామాల్లో భారత్ ఎంతో చాకచక్యంగా వ్యవహరించాల్సి ఉంటుంది. హిందూ మహాసముద్రంపై ఆధిపత్యం విషయంలో చైనా–భారత్ మధ్య నౌకాయాన వైరం ఉంది. దక్షిణ చైనా సముద్రం విషయంలో నౌకాయాన స్వేచ్ఛలో భారత్‌కు ప్రయోజనం ఉంది.

చైనాను కలుపుకుని మొత్తంగా దక్షిణాసియా అభివృద్ధికి దోహదం చేయటమా లేక చైనాను మినహాయించటమా అన్న డోలాయమానం భారత ప్రభుత్వంలో ఉంది. ఈ సందర్భంగా భారత్–ఆసియన్ అధినేతల ఢిల్లీ డిక్లరేషన్ ప్రస్తావనార్హం. సమగ్రమైన, పరస్పర లాభదాయకమైన 'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం' (ఆర్‌సిఇపి) ఒప్పందాన్ని 2018లో కుదుర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆ డిక్లరేషన్ కోరింది. ఇది ఒక రకంగా స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం. ఆసియన్, భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, చైనా, జపాన్ ఇందులో భాగస్వాములు. దీనిపై 2012లో ప్రారంభమైన చర్చలు నిలిచి పోయాయి. చైనా వస్తువులకు మనదేశంలో నిర్నిబంధ మార్కెట్ లభిస్తుందన్న భారత్ ఆందోళన, భారత్ నుంచి ఐటి వగైరా సర్వీసులు, శ్రామికులను అనుమతించటానికి ఆసియన్ వ్యతిరేకత ఇందుకు ప్రధాన కారణాలు. మౌలిక వసతుల అభివృద్ధి, మెరుగైన భద్రతా సంబంధాలు, ఆర్థిక, సామాజిక–సాంస్కృతిక సంబంధాలు, రవాణా సంబంధాల మెరుగుదలను ఆ డిక్లరేషన్ వక్కాణించింది.

రిసెప్‌కు ఆసియన్ పట్టుబట్టటం భారత అధికారులకు ఇబ్బందికరమైనా సూత్రప్రాయంగా అంగీకరించక తప్పలేదు. ఈ ఒప్పందం వల్ల ప్రపంచ జనాభాలో సగం, జిడిపిలో మూడవవంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంతో సమన్వయీకృత ఆసియా మార్కెట్ ఏర్పడుతుందని సింగపూర్ పట్టుబట్టింది. దక్షిణాసియాలో భారత్ కీలక పాత్ర పోషించాలంటే చైనాతో వైరం, పోటీ కాకుండా స్నేహ, సహకార పంథా అనుసరణీయం. అయితే అది బిజెపికి రాజకీయంగా ఇచ్చగించక పోవచ్చు. ఏది ఏమైనా, ఏదో పశ్చిమ రాజ్యం అభీష్టం ప్రకారం భారత్ తనకు తానుగా వ్యవహరిస్తోందన్న విశ్వాసం కల్పించటం భారత్–ఆసియన్ సంబంధాల్లో కీలకం కానుంది. తన 'యాక్ట్ ఈస్ట్' విధానానికి ఆసియన్‌ను మూలస్తంభంగా భారత్ చూస్తున్నది. వ్యూహాలు అందుకు దోహదకారిగా ఉండాలి.

యుపిలో కదిలిన తుట్టె!


చూపు

ముజఫర్ నగర్ అల్లర్లకు సంబంధించి బిజెపి నాయకులపై గల కేసులను ఉపసంహరించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. జాట్ యువకులపై ఉన్న కేసులు కూడా ఎత్తివేయాలని ఖాప్ నాయకుల నుంచి వెంటనే డిమాండ్ వచ్చింది. బిజెపి సంకల్పం తేనెతుట్టెను కదిల్చినట్టయింది. బిజెపి లోక్‌సభ ఎంపి సంజీవ్ బలియాన్ ఆ అల్లర్లలో నిందితుడుగా ఉండడంతో ఆ కేసు ఎత్తివేయవలసిందిగా ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. దీనితో బిజెపి నాయకులందరిపై ఆ కేసుల ఎత్తివేతకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తన ఉద్దేశాన్ని ఆదిత్యనాథ్ ప్రభుత్వం స్పష్టం చేసింది కూడా. 2013 నాటి ముజఫర్‌నగర్ అల్లర్లు ముస్లింలపై గురిపెట్టి చేసినవి. ఆ ఘటనలకు సంబంధించి అనేకమంది సీనియర్ బిజెపి నాయకులపై కేసులు దాఖలయ్యాయి. వాటన్నింటిని ఉపసంహరించాలన్నది ఆదిత్యనాథ్ పట్టుదల. ఆ అల్లర్లలో 63మంది దాకా మరణించగా మరి 50,000మంది గాయపడ్డారు.

ఈ సంకల్పం న్యాయం సూత్రాలకు పరమ విరుద్ధం. ప్రభుత్వం నుంచి ముజఫర్ నగర్ జిల్లా మేజిస్ట్రేట్‌కు, పోలీసు సూపరింటెండెంట్‌లకు ఆ మేరకు లేఖ అందింది. బిజెపి నాయకులపై దాఖలైన కేసుల ఉపసంహరణ అవకాశాలపై వారి అభిప్రాయాలను ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఆ లేఖలో ప్రభుత్వం కోరింది. ఉత్తరప్రదేశ్ న్యాయశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజ్‌సింగ్ జనవరి 5న బిజెపి నాయకులపై పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలపాలని డిఎంలకు, ఎస్‌పిలకు ఆ లేఖ రాశారు. ఆ లేఖలో నిందితుల పేర్లు లేకుండా కేసుల నెంబర్లు పేర్కొన్నారు. 13 పాయింట్లపై అధికారుల వివరణను సింగ్ కోరారు. ఆ కేసులలో ప్రమేయం ఉన్న వ్యక్తులు వారిపై అంతవరకు జరిగిన ప్రాసిక్యూషన్ వివరాలు, కేసుల ఉపసంహరణ విజ్ఞప్తి వెనుక వాదన ఆ లేఖలో పేర్కొన్నారు. న్యాయశాఖనుంచి అటువంటి లేఖ అందుకున్నట్లు ముజఫర్‌నగర్‌జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్ త్యాగి మీడియాకు ధృవపరిచారు. కేసుల ఉపసంహరణపై సంబంధిత న్యాయాధికారులతో చర్చించాకే స్పందన తెలుపు తామని కూడా త్యాగి అన్నారు.

ఎంపి బలియాన్ హిందూ మూకలను అల్లర్లకు రెచ్చగొట్టినట్లు కేసు దాఖలైంది. ఆయన పట్టుబట్టాకే ఆదిత్యనాథ్ కేసుల ఉపసంహరణ వివాదాన్ని తలకెత్తుకున్నారు. అంతకు రెండు వారాల క్రితం బలియాన్ ముజఫర్‌నగర్ కోర్టుకు లొంగిపోయారు. ఆయనపై బెయిల్‌కు ఆస్కారంలేని వారంట్ దాఖలవడంతో లొంగిపోక తప్పలేదు. ఆ వారంట్ కూడా కోర్టుకు హాజరు కానందుకు దాఖలైనదే. బిజెపి ప్రభుత్వ సంకల్పంతో లబ్ధిపొందేది ఆ పార్టీ నాయకులే. వారిలో బలియాన్ ముఖ్యులు. ఇంకా బిజ్నోర్ ఎంపి భర్తేంద్ సింగ్, ఆదిత్యనాథ్ మంత్రివర్గంలో సభ్యులు, టాణా భవాన్ ఎంఎల్ఎ సురేష్ రాణా, బుధానా ఎంఎల్ఎ ఉమేష్ మాలిక్, పార్టీ నాయకురాలు సాధ్వీ ప్రాచీ కేసుల ఉపసంహరణతో ఊపిరి పీల్చుకుంటారు. అల్లర్లకు ముందు 2013ఆగస్టు 30న నగ్లా మందౌర్ బహిరంగ సభలో వారంతా రెచ్చగొడుతూ ప్రసంగించినట్లు కేసులు దాఖలయ్యాయి.

ఆ తరువాత ఆ అల్లర్ల పర్యవసానంగా ముస్లింలు, హిందువులు కూడా అనేక బహిరంగసభలు జరిపారు. తమపై రాజకీయ దురుద్దేశంతో కేసులు పెట్టారని బిజెపి నాయకులు అడ్డువచ్చారు. అప్పట్లో అధికారంలో గల సమాజ్‌వాది పార్టీ కక్ష సాధింపు ధోరణిలో తమని




ఇరికించిందన్నది వారి వాదన. అవే ఆరోపణలతో ముస్లిం నాయకులపై కూడా కేసులు పెట్టడం జరిగింది. ఆ కేసులనుండి బిజెపి నాయకులకు ఊరట లభించే అవకాశం ఉందని వార్త వ్యాపించడంతో బలియాన్ విలేకరులగోష్టి పెట్టి రాష్ట్ర న్యాయశాఖామంత్రిని ఆ మేరకు కోరడంవల్ల ఉపసంహరణ జరుగుతున్నట్లు చెప్పారు. ఆ అల్లర్ల సందర్భంగా ఎస్‌పి ప్రభుత్వం చాలామందిపై నిరాధారమైన కేసులు పెట్టిందని కూడా ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని రాష్ట్ర న్యాయ శాఖామంత్రి బ్రిజేష్ పాఠక్ దృష్టికి తెస్తూ తాను లేఖరాసినట్లు చెప్పారు. తాజాగా దర్యాప్తు జరిపించి, ఆరోపణలు నిజం కాదని తేలితే కేసులను ఉపసంహరించాలని ఆ లేఖలో మంత్రిని కోరినట్లు బలియాన్ తెలిపారు.

ఈ కేసులపై ఈ మధ్య విచారణ చాలా మందకొడిగా సాగుతోంది. చాలామంది కేసులకు హాజరుకాకుండా తప్పించుకుంటున్నారు. దీనితో ముజఫర్ నగర్ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ మధుగుప్తా వారిపై బెయిల్‌కు ఆస్కారంలేని వారంట్లను జారీ చేశారు. ప్రస్తుతం ఈ కేసులు అభియోగాల నమోదు దశను చేరుకున్నాయి. కానీ అనేక మంది జాట్ యువకులు ఈ సరికే ఈ కేసులలో జైలుకు వెళ్లారు. ఆదిత్యనాథ్ ప్రభుత్వం బలమైన శాంతిభద్రతల సమస్యను సృష్టించింది. మత కలహాలలో ప్రమేయానికిగాను కేసులు దాఖలైన బిజెపి నాయకులు స్వేచ్ఛగా విముక్తి పొందితే జాట్‌ల ఖాప్ పంచాయతులు ఈనెల 21న సమావేశమై జాట్ యువకులపై హత్య, రేప్, హింసాకాండ కేసులను కూడా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం బిజెపి నాయకులకు అనుకూలంగానే కదిలే పక్షంలో జాట్ యువకులను కూడా పట్టించుకోవాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. సమాజంలో ఆధిక్యత గల జాట్ వర్గానికి చెందిన యువకులు ఆ అల్లర్లలో ప్రమేయం కల్పించుకున్నట్లు కేసులు దాఖలయ్యాయి. సార్వత్రిక ఎన్నికల ముందు ప్రజలను మతపరంగా చీల్చి ఓట్లు దండుకోవడం కోసం రాజకీయ పార్టీలు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టిన అల్లర్లు అవి అని బలియాన్ ఖాప్ ముఖ్య నాయకుడు నరేష్ తికాయత్ ఆరోపించారు. ఆదిత్యనాథ్ ప్రభుత్వం తమ పార్టీ నాయకులపై కేసులు ఉపసంహరించబూనడం అతని కపటత్వానికి నిదర్శనమని కూడా తికాయత్ విమర్శించారు. ముజఫర్ నగర్, తామ్లీలోని అన్ని ఖాప్‌ల నాయకులు సమావేశమై ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ తన పార్టీ వారికి కల్పిస్తున్న ఊరటను వందలాదిమంది జాట్ యువకులకు కూడా కల్పించాలని ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేశారు. ఆ యువకులందరూ ప్రస్తుతం జైళ్లలో ఉన్నారు. లేనిపక్షంలో తాము ఊరుకోబోమని కూడా జాట్ నాయకులు హెచ్చరిస్తున్నారు. ఆ డిమాండ్‌పై ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాన్ని ఒక 'మహా పంచాయత్'తో ప్రారంభిస్తామని కూడా తికాయత్ ప్రకటించారు. భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు కూడా అయిన తికాయత్ రైతులోకంలో పేరున్నవారు. ముజఫర్‌నగర్ ముస్లిం ప్రజలు ప్రభుత్వ సంకల్పం పట్ల నిరాశ వ్యక్తం చేశారు. వారిలో అల్లర్ల బాధితులు కూడా ఉన్నారు. బిజెపి నాయకులపై కేసుల ఉపసంహరణ ప్రతిపాదన విరమించకపోతే నల్లబ్యాడ్జీలు ధరించి వీధులకెక్కుతామని వారు కూడా హెచ్చరిస్తున్నారు. ఆ విధంగా సిఎం ప్రతిపాదన శాంతి భద్రతల సమస్యకు నాంది పలికిన వింత పరిస్థితి యుపిలో నెలకొంది.

✻ పి.ఎస్.ఎస్

కోరేగావ్ యుద్ధం – సుభాష్ బోస్



డానీ
సమాజ విశ్లేషకులు
9010757776

చరిత్ర రచనలో మనుస్మృతి బలంగా పనిచేస్తున్నదంటే అది గత కాలానికి సంబంధించిన విషయం అనుకోవాల్సిన పని లేదు; వర్తమానంలో నడుస్తున్న చరిత్ర సహితం మనుస్మృతి మార్గంలోనే నమోదు అవుతున్నది.

శూద్రులు వేదాలు విన్నా, చదివినా కఠినంగా శిక్షించాలని సాంప్రదాయ మనువాదులు అనేవారు. దళితులు భీమాకోరేగావ్ యుద్ధ చరిత్ర చదవకూడదని ఆధునిక మనువాదులు అంటున్నారు. భీమాకోరేగావ్ యుద్ధంలో మహర్లు, చమార్లు, మాంగ్లు, మాతంగులు ఒక్క మాటలో దళితులు/అప్పటి అస్పృశ్యులు ఆయుధాలు పట్టి మరాఠా సైన్యాన్ని తరిమి తరిమి కొట్టిన వీరోచిత పోరాటాన్ని గురించి తలచినా, మాట్లాడినా, ఆ యుద్ధ స్మారక స్థూపం దగ్గర గుమిగూడి విజయోత్సవాలు జరుపుకున్నా జైళ్ళలో పడేస్తామనీ, రాజద్రోహం కేసులు పెడతామని నయా మనువాదులు హెచ్చరిస్తున్నారు. తమ పూర్వీకుల చరిత్ర తెలుసుకుంటున్నందుకు అప్పర్ ప్రైమరీ స్కూలు పిల్లలపై సహితం కేసులు పెట్టి జైళ్ళకు పంపిస్తున్నారు.

బ్రిటీష్ యుద్ధ విజయాలను గుర్తుచేసే స్థూపాలు దేశంలో అనేకం వున్నాయి. ఢిల్లీలోని సుప్రసిద్ధ ఇండియా గేట్ మొదటి ప్రపంచయుద్ధంలో ఇంగ్లండ్ విజయానికి గుర్తుగా నిర్మించిందే. 1897నాటి సారాఘరీ యుద్ధ విజయోత్సవాలని భారత సైన్యంలోని సిక్కు రెజిమెంట్ ఇప్పటికీ ప్రతి ఏటా ఘనంగా జరుపుకుంటుంది. దానికోసం పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 12ను శెలవుదినంగా ప్రకటించింది. సిక్కు బెటాలియన్ ఆ యుద్ధంలో ఖైబర్ ఫక్తూన్ ఖావా ప్రాంతపు ఆఫ్ఘన్ 'ముస్లిం'లను ఓడించింది. కనుక అది ఉత్సవంగా జరుపుకోదగిన సందర్భం!. కోరేగావ్‌లో చివరి హిందూ రాజ్యాన్ని కూల్చేశారు కనుక అది విషాదదినం! ఇది నయా మనువాదులు చేస్తున్న తర్కం. యుద్ధంలో ముస్లింల ను ఓడిస్తే అది జాతీయవాదం!. బ్రాహ్మణులనో, రాజపుత్రులనో ఓడిస్తే అది రాజద్రోహం! జాతి వ్యతిరేకవాదం! నిజానికి ఇవి హిందూత్వ బ్రాహ్మణీయ కొలమానాలు తప్ప మరేమీకావు. భారత ఉపఖండంలో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆక్రమణ రాబర్ట్ క్లయివ్ నాయకత్వంలో సాగిన 1757 నాటి ప్లాసీ యుద్ధంతో మొదలయింది. అది ఫ్రాన్సిస్ రాడన్ హేస్టింగ్స్ (వారెన్ హేస్టింగ్స్ కాదు) నాయకత్వంలో సాగిన 1818 నాటి కోరేగావ్ యుద్ధంతో పూర్తయింది. ఈస్ట్ ఇండియా కంపెనీ రాకుండా 'వుండివుంటే' పీష్వా రెండవ బాజీరావో, ఆయన దత్త పుత్రుడు ధోందు పంత్ (నానా సాహెబ్) ఢిల్లీ చక్రవర్తిగా మారి భారతదేశాన్ని ఏలి వుండేవారని ఇప్పటికీ బాధపడుతున్న వాళ్ళు లేకపోలేదు.

కోరేగావ్ యుద్ధంలో బాజీరావు యుద్ధ భూమిని వదిలి పారిపోయినవైనం గురించీ, ఈస్ట్ ఇండియా కంపెనీ కాళ్ళమీద పడి తన ప్రాణాల్ని కాపాడుకుని భరణానికి రాజీపడిన దైన్యం గురించి ఈ తరం వాళ్లకు తెలియకూడదని ఏలిన వారి తాపత్రయం. ఒకవైపు, రెండు శతాబ్దాల క్రితం అంతరించిన హిందూ రాజ్యాన్ని 2014లో నరేంద్ర మోదీ పునరుద్ధరించారని మనువాదులు ఉత్సవాలు జరుపుకుంటున్న రోజుల్లో పీష్వారాజ్యం కూల్చివేతను దళితులు పండుగ చేసుకుంటామంటే ఏలినవారికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

కోరేగావ్ యుద్ధం ఈస్ట్ ఇండియా కంపెనీకి కన్నా దళితులకు గొప్ప విజయమని బి.ఆర్.అంబేడ్కర్ భావించారు. 1927 జనవరి 1న స్వయంగా ఆయన భీమా కోరెగావ్ యుద్ధ విజయ స్థూపం దగ్గరికి వెళ్ళి దళిత అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అప్పటి నుండి బ్రిటీష్ విజయస్థూపం దళిత విజయస్థూపంగా మారిపోయింది.

గొప్ప గమ్యం గమనాన్ని నైతికంగా సమర్ధిస్తుంది అనే (Consequentialism)నీతిని కోరేగావ్ యుద్ధం ముందుకు తెచ్చింది. ఇది తరువాతి కాలంలో అంబేడ్కర్‌ను చాలా ప్రభావితం చేసింది. ఆయన ప్రతి సందర్భంలోనూ గమనం కన్నా గమ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. నేనా? దేశమా? అనే సందర్భం వస్తే నేను దేశాన్ని ఎంచుకుంటాను. దేశమా? అస్పృశ్యుల విముక్తా? అనే సందర్భం వస్తే నేను అస్పృశ్యుల విముక్తినే ఎంచుకుంటాను అని నిర్మొహమాటంగా చెప్పేవారు. భారత దేశానికి స్వాతంత్ర్యంకన్నా అస్పృశ్యుల విముక్తే తనకు ముఖ్యమని నిర్ద్వంద్వంగా ప్రకటించిన సందర్భాలున్నాయి. అస్పృశ్యులు అగ్రకులాల మీద పోరాడాలిగానీ బ్రిటీష్ ప్రభుత్వం మీద కాదనేవారు. ఒకవేళ బ్రిటీష్ ప్రభుత్వం అగ్రకులాల పక్షం వహిస్తే అప్పుడు ఆ ప్రభుత్వం మీద కూడా పోరాడాలి అనేవారు.

ఆక్రమణ దారులకు సహకరించిన వాళ్ళను రాజద్రోహులు అనాలిగానీ అదేదో మహత్తర కార్యం అయినట్టు భుజాలకు ఎక్కించుకుని ఊరేగడం ఏమిటి? అని ప్రశ్నించేవారు ఇప్పుడు బ్రాహ్మణీయవాదుల నుండి మార్క్సిస్టుల వరకు చాలామంది వున్నారు. ఇలాంటి విమర్శకులకు అంబేడ్కర్ చాలాకాలం క్రితమే సమాధానం ఇచ్చివున్నారు.

బ్రిటీష్ వాళ్ళు భారతదేశంలో అగ్రకులాలతో యుద్ధం చేస్తున్నపుడు అస్పృశ్యులు బ్రిటీష్ పక్షం వహించడమే సరైనదని అంబేడ్కర్ అభిప్రాయం. రాజద్రోహమా కాదా? అనే విషయాన్ని పక్కన పెడదాం. అస్పృశ్యులు అలా వ్యవహరించడం అత్యంత సహజం. స్వదేశీయులు తమపై సాగిస్తున్న తీవ్ర అణిచివేత నుండి విముక్తి లభిస్తుందనే ఆశతో కొన్ని సమూహాలు ఆక్రమణదారులకు మద్దతు పలికిన సందర్భాలు భారతదేశ చరిత్ర నిండా అనేకం వున్నాయి అనేవారు.

బ్రిటీష్ పరిపాలన వచ్చిన తరువాతనే భారత ఉపఖండంలో దళితుల విముక్తికి బీజాలు పడ్డాయని ఆయన భావించేవారు. బ్రిటీష్ ప్రభుత్వానికి అస్పృశ్యుల మద్దతును ఆయన ఎప్పుడూ కప్పిపుచ్చాలనుకోలేదు. తొలియుద్ధం మొదలు చివరియుద్ధం వరకు ఈస్ట్ ఇండియా కంపెనీకి విజయాలను సమకూర్చడమేగాక బ్రిటీష్ పాలన నిలదొక్కుకోవడానికి సహకరించింది కూడా భారత సమాజపు అస్పృశ్యులే అని 1930ల నాటి రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా బ్రిటన్ ప్రధానికి అంబేడ్కర్ గుర్తు చేశారు.

చాలామంది ఇప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా మరచిపోతున్నట్టున్నారుగానీ, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో గాంధీజీ నాయకత్వంలోని కాంగ్రెస్ బ్రిటీష్ పాలకులకు మద్దతు పలకగ పోగా క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఆరంభించింది. ఆ సమయంలో వినాయక్ దామోదర సావర్కర్, శ్యామా ప్రసాద ముఖర్జీల నాయకత్వంలోని హిందూమహాసభ క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించడమేగాక బ్రిటీష్ ప్రభుత్వానికి మద్దతు పలికింది. బ్రిటీష్ సైన్యంలో చేరవలసిందిగా హిందూ సమాజానికి పిలుపునిచ్చింది. హిందూ మహాసభ అంటే ఇప్పటి భారతీయ జనతా పార్టీకి తల్లి అయిన భారతీయ జనసంఘ్‌కు మాతృసంస్థ.

భీమాకోరేగావ్ యుద్ధపు ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా చెలరేగిన వివాదం, అల్లర్లు, చావులు, కేసుల పర్వం ముగియక ముందే సుభాష్ చంద్రబోస్ రెండవ ప్రపంచ యుద్ధంలో నిర్వర్తించిన పాత్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన పుట్టిన రోజైన జనవరి 23ను జాతీయ శెలవు దినంగా ప్రకటించాలని ప్రధానిని కోరుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జనవరి 20న ట్వీట్ చేశారు.

బోస్‌ను చాలామంది మహానాయకునిగా భావించి నేతాజీగా పేర్కొంటుంటారు. గాంధీజీతో విబేధాల కారణంగా బోస్ 1940లో భారతదేశం వదిలి జర్మనీ వెళ్ళారు. ప్రపంచ నియంత హిట్లర్‌ను కలవడానికి 1942 మే వరకు పడిగాపులు పడి ఒక్కసారి మాత్రమే దర్శనం చేసుకున్నారు. కలిసినప్పుడు కూడా ఆ నియంత బోస్ మీద ఏ మాత్రం ఆసక్తిని చూపెట్టలేదు. రెండవ ప్రపంచ యుద్ధంలో అక్షరాజ్యాల ఆసియా భాగస్వామి అయిన జపాను కలవమన్నారు. జపాన్ సహాయంతో జర్మనీ, ఇటలీల ఆశీస్సులతో జపాన్ ఆక్రమిత అండమాన్, నికోబర్, సింగపూర్ దీవుల్లో భారత జాతీయ సైన్యం(ఐఎన్ఏ)ను నిర్మించారు బోస్. ఐఎన్ఏ ఆగ్నేయాసియాలో బ్రిటీష్ సేనలతో తలపడింది. కానీ అప్పుడు బ్రిటీష్ సేనల్లో వున్న కాల్బలం కూడా భారతీయులే!. బోస్ చేసిన వరుస చారిత్రక తప్పిదాలతో ఆయన అంచనాలన్నీ తప్పి వైఫల్యాల పరంపర కొనసాగింది. ఇటలీ, జర్మనీ ఓడిపోయి, ముస్సోలినీ, హిట్లర్ చనిపోయారు. జపాన్ ఓటమి అంచుకు చేరుకుంది. అమెరికా హిరోషీమా నాగసాకీలపై అణుబాంబులు వేసింది. మిత్రరాజ్యాలతోపాటూ బ్రిటన్ ఆ యుద్ధంలో గెలిచింది. అప్పుడాయన రష్యా సహాయం కోరడానికి మంచూరియా బయలుదేరి విమాన ప్రమాదానికి గురయ్యారు.

రెండవ ప్రపంచయుద్ధంలో బోస్ నిర్వర్తించిన 'దారితప్పిన' గందరగోళ పాత్రకన్నా భీమాకోరేగావ్‌లో అస్పృశ్యులు నిర్వర్తించిన పాత్ర అనేక విధాలా మహత్తరమైనది. వాళ్ళు మనువాద పీష్వా రాజ్యాన్ని కూల్చేయడంలో తమ చారిత్రక బాధ్యతను నిర్వర్తించారు.

చరిత్రకారులు సాధారణంగా తాము మహత్తరమైనవని భావించిన సంఘటనల్నే తమ రచనల్లో నమోదు చేస్తుంటారు. వాళ్లకు తెలిసినా తెలియకపోయినా వాళ్ళు పరవశంతో రాసే ఆ సంఘటనలన్నీ సాధారణంగా వాళ్ల వర్ణ/కుల ఔన్నత్యాన్ని చాటేవే అయ్యుంటాయి. ఫలితంగా చరిత్రకారుల స్వీయ వర్ణ/కుల ఔన్నత్యమే మొత్తం దేశ ప్రజల ఔన్నత్యంగా మన మెదళ్లలో స్థిరపడిపోతుంది. ఇప్పటివరకు మనకు తెలిసిన లిఖిత చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే అని కార్ల్ మారక్స్ అన్నాడు. భారతదేశంలో దానికి చిన్న సవరణ చేయాలి. లిఖిత చరిత్ర అంతా అగ్రవర్ణాల/కులాల ఔన్నత్యాన్ని చాటిచెప్పే చరిత్రే అనాలి! అంచేత చరిత్ర పాఠాలు చదివే సమయంలో ఏం రాశారు? అనే దానికన్నా ఎవరు రాశారు? అనేది కూడా చాలా ముఖ్యమైన పార్శ్వం.

జాతీయోద్యమంలో మహాత్మా గాంధీజీ ఏ తేదీన ఏ కార్యక్రమాన్ని నిర్వహించారో దాదాపు అందరికీ కంఠతా వుంటుంది. కానీ, మహాత్మా ఫూలే, అంబేడ్కర్, ఈవీ రామస్వామి నాయకర్, సయ్యద్ అహ్మద్ ఖాన్, మూడవ ఆగా ఖాన్ ఏ రోజున ఏ సంఘ సంస్కరణ కార్యక్రమాన్ని చేపట్టారో ఎవరికీ తెలియకుండా పోతుంది. ఇటీవలి కాలం వరకు వీళ్లలో అనేక మంది పేర్లు సహితం జనసామాన్యానికి తెలీవు అంటే అతిశయోక్తికాదు. అయితే ఈ అపచారం ఎక్కువకాలం సాగదు.

తరతరాలుగా అణగారిన వర్గాలుగా వుంటున్న సమూహాలు తిరగబడి సమాజానికి కొత్త చరిత్రను రాయడం మొదలెట్టినపుడు వాళ్ళు గత చరిత్రనూ సరిదిద్దుతారు.
మమ్మల్ని ఎక్కడెక్కడ అణిచివేశారో మీరు చెప్పుకునేవారు!
మిమ్మల్ని ఎక్కడెక్కడ ఓడించామో ఇప్పుడు మేము చెపుతాం!

ఎడిటర్‌కు లేఖలు

స్ఫూర్తి ప్రదాతలు

ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు భారత అంధ క్రికెటర్లు. తాము చిన్న చూపు చూడబడేవారు కాదు; గౌరవానికి అర్హులు అని నిరూపించారు. ప్రపంచకప్ ఫైనల్‌లో దాయాదులు పాకిస్థాన్‌పై చిరస్మరణీయమైన విజయం సాధించి రెండవ సారి ప్రపంచకప్‌ను సాధించి, భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు చేకూర్చిపెట్టారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని దివ్యాంగులు న్యూనతా భావానికి గురి కాకుండా ఆయా రంగాల్లో అద్భుతాలు సాధించాలి. ప్రపంచకప్ సాధించిన ఈ భారత అంధక్రికెటర్లకు ప్రభుత్వం కానుకగా మెరుగైన ఆర్థిక సహాయం చేయాలి. వారికి మరింత ప్రోత్సాహాన్ని కల్పించాలి. దివ్యాంగులు ఆడే అన్ని రకాల ఆటలకు భారతప్రభుత్వం ప్రోత్సాహాన్ని కల్పించాలి. వీరిని చూచి మిగతా క్రీడాకారులు స్ఫూర్తిని పొందాలి. ప్రపంచకప్ సాధించిన క్రికెటర్లకు అభినందనలు.

ప్రతిభను వరించిన అవార్డు : మహేంద్రసింగ్ ధోని భారత్ క్రికెట్‌కు చేసిన సేవలు ఎనలేనివి. వికెట్ కీపర్‌గా అద్భుతంగా రాణిస్తూనే, బ్యాట్స్‌మన్‌గా ఎన్నో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను క్లిష్ట సమయాల్లో గెలిపించాడు. కెప్టెన్‌గా తోటి ఆటగాళ్లలో స్ఫూర్తిని నింపుతూ భారత్‌కు అత్యధిక విజయాలను సాధించిపెట్టాడు. 2011ప్రపంచ కప్‌లో భారత్‌కు ట్రోఫీని అందించిన ఈ సారథిని ఎవరూ మరిచిపోలేరు. ధోనీ ప్రతిభకు, అంకిత భావానికీ పద్మభూషణ్ అవార్డు తగినది. ఒక బ్యాట్స్‌మన్‌గా, వికెట్ కీపర్‌గా భారత్‌కు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు తెచ్చిపెట్టాలి. తదుపరి ప్రపంచకప్‌లో సీనియర్ ఆటగానిగా జూనియర్లలో స్ఫూర్తిని నింపుతూ భారత్‌కు కప్‌ని తెచ్చిపెట్టాలి.

– సరికొండ శ్రీనివాసరాజు

సర్పంచ్ అభ్యర్థికి విద్యార్హతలు ఉండాలి

పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో సర్పంచ్‌ల్లో అవిశ్వాస తీర్మానం పెట్టి తీసేసే అవకాశం సభ్యులకుండటం, ఇకనుంచి సర్పంచ్‌లు అవినీతి అక్రమాలకు పాల్పడినా, గ్రామ అభివృద్ధికి సహకరించకపోయినా వార్డుల సభ్యులతో కలిసి పనిచేయకపోయినా, గ్రామంలో అపరిశుభ్రంగా కనిపించినా, అవిశ్వాస తీర్మానం ద్వారా తీసేసేలా చట్టం రావడం పట్ల యావత్తు ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరోక్ష ఎన్నికలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. కొత్త పంచాయతీ రాజ్ చట్టంలో పరోక్షంగా గ్రామస్థాయిలో అన్ని అధికారాలు సర్పంచ్‌లకు ఇవ్వడం ద్వారా, ప్రభుత్వ నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు చేరడం ఇలాంటి చట్టం తీసుకువస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్లప్పుడూ కృతజ్ఞతా భావంతో ఉంటామంటున్నారు. గ్రామాల్లో యువతకు కూడా ప్రాధాన్యం ఇస్తే, మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో సర్పంచ్‌లకే అన్ని అధికారాలు, అన్ని ప్రభుత్వ శాఖలపై గ్రామంలో పెత్తనం చెలాయించే అధికారం ఉండటం నిజంగా హర్షించదగ్గ విషయం.

గతంలో సర్పంచ్ ఒక ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి పనిచేసే పరిస్థితి ఉండేది. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో వార్డు సభ్యులను సర్పంచ్‌లుగా పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నుకోవడం బానే ఉంది కానీ, విద్యార్హతలు గ్రాడ్యుయేట్ లేదా పదవ తరగతి చదువుకున్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుతం సమాజంలో చదువు లేకుండా పరిపాలించడం సాధ్యంకాని విషయం. విద్యార్హతలు ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తే బాగుంటుంది.


– గుండమల్ల సతీష్‌కుమార్

బైపార్టయిట్ సెటిల్‌మెంట్ వర్తింపచేయాలి?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ పే రివిజన్ బేసిక్‌ను ఉద్యోగులతోపాటు అటు రిటైర్డ్ పెన్షనర్‌లకు వర్తింపచేస్తారు. కానీ ప్రతీ బైపార్టయిట్ సెటిల్‌మెంట్‌లో బేసిక్‌ను బ్యాంకు ఉద్యోగులకే వర్తిపచేస్తారు; పెన్షనర్‌లను పక్కకు పెడతారు. దీనివలన, రిటైర్ అయినప్పుడు ఎక్కడ బేసిక్ ఫిక్స్ చేస్తారో అది నేటికీ మారదు. కేవలం ప్రతి ఆరు నెలలకు అంటే ఫిబ్రవరి, ఆగష్టులో వర్కింగ్ క్లాస్ ఇండెక్స్ ప్రకారం కరువుభత్యం పెరిగితే పెంచుతారు, తరిగితే తగ్గిస్తారు. దీనివలన సుమారు 15 సంవత్సరాల క్రితం రిటైర్ అయిన బ్రాంచ్ మేనేజర్ పెన్షన్ నిన్న మొన్న రిటైరైన సబ్ స్టాఫ్ కంటే తక్కువ వస్తోంది. బ్యాంకు సర్వీస్‌లో ఉన్న ఉద్యోగుల మాదిరిలాగే ప్రతి ఐదు సంవత్సరాలకి జరిగే బైపార్టయిట్ సెటిల్‌మెంట్ ప్రకారం రిటైర్డ్ పెన్షనర్‌లకు వర్తింప చెయ్యాలి, ఇందుకు గుర్తించబడిన బ్యాంకు యూనియన్స్ కలసి, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్, ఫైనాన్స్ మినిస్ట్రీపై వత్తిడి పెంచాలి.

రాబోయే 11 బైపార్టయిట్ సెటిల్‌మెంట్‌లో తప్పక వర్తింప చెయ్యాలి. ఇందుకు ఆర్థికమంత్రి, ప్రధాన మంత్రి, సుప్రీం న్యాయస్థానం జోక్యం చేసుకోవాలి.

– సి. వి. ఆర్. కృష్ణ, హైదరాబాద్





"ఏ బడ్జెట్ అయినా బడా వ్యాపార వర్గాలకు తెలియకుండా బయటికి రాదు. బడ్జెట్ అంటే కోట్లాది రూపాయలు వెచ్చించి పార్లమెంట్‌లో అడుగు పెట్టిన వారు, పార్టీలకు భారీ విరాళాలిచ్చినవారు అయిదేళ్లలో తాము రాబట్టు కోవలసిన మొత్తాన్ని ఏడాదికోసారి లెక్కలు చూసుకోవడమే."

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
మనపేజీ
మనందరిపేజీ
www.manatelangana.news
హైదరాబాద్ | ఆదివారం | 28 జనవరి | 2018

ప్రజలను పరిహసించే బడ్జెట్‌లు

ఆధార్ కార్డు పరిధి గురించి జూన్ 2017లో సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు –1985లో ఒడిషాలోని ఓ కరువు ప్రాంత సందర్శన సందర్భంగా ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రభుత్వ కేటాయింపుల్లో పేదలకు చేరేది 15 శాతం మాత్రమే అన్న విషయం ప్రస్తావనకు వచ్చింది. అందుకే ఇన్నేళ్లకు కూడా పేద ధనిక వ్యత్యాసం తగ్గకపోగా పెరుగుతూనే ఉందని ఓ న్యాయమూర్తి అన్నారు. 2015 బడ్జెట్ చర్చలో కాంగ్రెస్ నేత జైరాం రమేష్ మాట్లాడుతూ బిజెపికి ఎన్నికల్లో సహాయపడిన ధనిక, వ్యాపార వర్గాల రుణం తీర్చుకొంటోంది, ఇది 'ధన్ వాపసీ' ప్రణాళిక అన్నారు. బిజెపి అయినా కాంగ్రెస్ అయినా ఈ బాటను తప్పేందుకు అవకాశాలు కనబడవు. ఓట్ల కోసం సంక్షేమ పథకాలు ఎన్నికల ఖర్చుల కోసం వ్యాపారులకు మినహాయింపుల మధ్య బడ్జెట్ ఓ గారడీ అవుతోంది.


జేమ్స్ విల్సన్


షణ్ముగన్ చెట్టి

పదేళ్ల కిందటి మాట కావచ్చు. ఆ ఏడాది బడ్జెట్‌లో కలర్ టీవీలపై సుంకం బాగా తగ్గించారు. నలుపు, తెలుపు, చిన్న టీవీల నుంచి చాలా మంది పెద్ద సైజు కలర్ టీవీలకు మారుతారు అనగానే ఫ్యాక్టరీ గోడౌన్లలో రాసులుగా పడి ఉన్న కలర్ టీవీలు బయటకు రావడానికి పారిశ్రామికవేత్తల కోరిక మేరకు జరిగిన నిర్ణయమిది అని ఒకాయన అన్నాడు. ఏ బడ్జెట్ అయినా బడా వ్యాపార వర్గాలకు తెలియకుండా బయటికి రాదు. బడ్జెట్ అంటే కోట్లాది రూపాయలు వెచ్చించి పార్లమెంట్‌లో అడుగు పెట్టిన వారు, పార్టీలకు భారీ విరాళాలిచ్చినవారు అయిదేళ్లలో తాము రాబట్టు కోవలసిన మొత్తాన్ని ఏడాదికోసారి లెక్కలు చూసుకోవడమే అని మరింత పెద్ద బాంబు వేశాడాయన. ఆధార్ కార్డు పరిధి గురించి జూన్ 2017లో సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు –1985లో ఒడిషాలోని ఓ కరువు ప్రాంత సందర్శన సందర్భంగా ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రభుత్వ కేటాయింపుల్లో పేదలకు చేరేది 15 శాతం మాత్రమే అన్న విషయం ప్రస్తావనకు వచ్చింది. అందుకే ఇన్నేళ్లకు కూడా పేద ధనిక వ్యత్యాసం తగ్గకపోగా పెరుగుతూనే ఉందని ఓ న్యాయమూర్తి అన్నారు. 2015 బడ్జెట్ చర్చలో కాంగ్రెస్ నేత జైరాం రమేష్ మాట్లాడుతూ బిజెపికి ఎన్నికల్లో సహాయపడిన ధనిక, వ్యాపార వర్గాల రుణం తీర్చుకొంటోంది, ఇది 'ధన్ వాపసీ' ప్రణాళిక అన్నారు. బిజెపి అయినా కాంగ్రెస్ అయినా ఈ బాటను తప్పేందుకు అవకాశాలు కనబడవు. ఓట్ల కోసం సంక్షేమ పథకాలు ఎన్నికల ఖర్చుల కోసం వ్యాపారులకు మినహాయింపుల మధ్య బడ్జెట్ ఓ గారడీ అవుతోంది. 2019 సాధారణ ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న చివరి బడ్జెట్‌లో మీ ప్రభుత్వం జనాకర్షకంగా మారుతుందా అన్న ప్రశ్నకు ప్రధాని నరేంద్ర మోడీ 'సామాన్యులు ఉచిత పథకాలు కోరుకోరు. వారు వరాలు కోరుతున్నారనుకోవడం భ్రమ, నిజాయితీతో కూడిన పాలనే వారికిష్టం' అని కొత్త మాట మాట్లాడారు. సామాన్యులను మాటలతో మాయ చేయొచ్చుగాని పారిశ్రామిక వర్గాలను ప్రసన్నం చేసుకోవడం అత్యవసరమని ప్రధాని ఆలోచన కావచ్చు. అసోచెమ్, ఫిక్కీ, సిఐఐ లాంటి సంఘాల ప్రశంసలే బిజెపికి దీవెనలు.

బడ్జెట్ తయారీ ఓ భారీ ప్రక్రియ. దానికి నిపుణుల తోడ్పాటు ఎంతో అవసరం. అందుకే దేశంలో ప్రధాన మంత్రి తర్వాత జనం గుర్తుంచుకునేది ఆర్థిక మంత్రినే.

ప్రస్తుత ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ సుప్రీంకోర్టు న్యాయవాది, అనుభవజ్ఞులు. మోడీ మంత్రివర్గంలో అందరి కన్న ధనికుడైన జైట్లీ చేతిలో ఆర్థిక శాఖతోపాటు కార్పొరేట్ వ్యవహారాలు, సమాచార ప్రసార శాఖలు కూడా ఉన్నాయి. విపి సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు అడిషనల్ సొలిసిటర్ జనరల్‌గా పని చేసిన జైట్లీ రాజకీయాల్లో చేరి 1998–2004 కాలంలో వాజపేయి మంత్రివర్గంలో వాణిజ్య మంత్రిగా, న్యాయ శాఖ మంత్రిగా ఉన్నారు. ఖరీదైన కార్ల సేకరణ ఆయన కిష్టం. బడ్జెట్ తయారీ ఏర్పాట్లు సెప్టెంబర్ నుండే మొదలవుతాయి. విద్య, వైద్య, రక్షణ తదితర శాఖలకు అవసరమైన బడ్జెట్ అంచనాలు, క్రితం సంవత్సరపు కేటాయింపుల వివరాలు ఆర్థిక శాఖ సేకరిస్తుంది. బడ్జెట్ ప్రతులను పార్లమెంట్ ప్రాంగణంలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రిస్తారు. ముద్రణ మొదలు పెట్టే ముందు హల్వా పండుగను చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. మంచి పని ఆరంభించే ముందు నోరు తీపి చేసుకోవడమనేది సాంప్రదాయంలో భాగం.

మన దేశంలో స్వాతంత్ర్యం కన్నా ముందు నుంచే, బడ్జెట్ విధానం ఉంది. 1869 ఫిబ్రవరి 18న జేమ్స్ విల్సన్ మొదటి సారిగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈయన ఇండియన్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉంటూ భారత వైస్రాయ్‌కి సలహాదారుడిగా వ్యవహరించేవారు. ఈయనను ఉన్నత ప్రమాణాలు గల ఆర్థికవేత్తగా కారల్‌మార్క్స్ మెచ్చుకున్నట్లు చెబుతారు. 1947లో ఇక్కడ భారతదేశపు బడ్జెట్ తయారీ ప్రక్రియ సాగుతున్న దశలో బ్రిటిష్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. అప్పుడు అక్కడి బడ్జెట్ రూపకర్త బ్రిటిష్ ఖజానా చాన్సలర్ హంగ్‌డాల్టన్‌ను ఒక జర్నలిస్టు కలిశాడు. ఆయన పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం కోసం పార్లమెంట్‌లోకి ప్రవేశిస్తున్నప్పుడు ఒక జర్నలిస్టు కలుసుకున్నాడు. తన బడ్జెట్‌లో ప్రతిపాదించబోయే పన్నుల మార్పులను కొన్నింటిని ఆ జర్నలిస్టుకి డాల్టన్ చెప్పాడు. ఆ వివరాలు బడ్జెట్ ప్రతిపాదన కంటే ముందే బయటి ప్రపంచానికి వెల్లడైపోయాయి. దాంతో డాల్టన్ రాజీనామా చేయవలసి వచ్చింది. బడ్జెట్ పత్రాలు ఎంత రహస్యమైనవో చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

1947 నవంబర్ 26న స్వతంత్ర భారతంలో ఆనాటి ఆర్థిక మంత్రి ఆర్‌కె షణ్ముఖం శెట్టి బడ్జెట్‌ను ఆరంభించారు. 2016–17 ఆర్థిక సంవత్సరం దాకా ఉన్న ఫిబ్రవరి చివరి రోజున బడ్జెట్ పెట్టే సంప్రదాయం పోయి 2017 నుండి ఫిబ్రవరి మొదటి తేదీకి మారింది. ఇంతకాలం సాయంత్రం 5 గంటలకు మొదలై నడి రాత్రి దాకా సాగే బడ్జెట్ ప్రక్రియ సమయం కూడా మారింది. ఇప్పుడు ఉదయం పదకొండుకు బడ్జెట్ కార్యక్రమం మొదలవుతుంది. బడ్జెట్ సమర్పణకు ముందు రోజు (ఈసారి జనవరి 29న) రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. దేశ ఆర్థిక పరిస్థితిని బట్టి బడ్జెట్ రూపం మారిపోతుంది. మనది ఎప్పుడూ లోటు బడ్జెటే అయినా మిగులు బడ్జెట్లు సమర్పించే దేశాలు కూడా ఉన్నాయి. చమురు ఉత్పత్తి దేశాలు అనగా ఖతర్, కువైట్, బ్రూనే, ఒమన్‌లలో ఎంత ఖర్చు చేసినా పన్నుల రూపంలో వచ్చిన సొమ్ము మిగిలే ఉంటుంది. వీటితో పాటు హాంకాంగ్, సింగపూర్, నేపాల్, మకావు లాంటి చిన్న దేశాలతోపాటు బ్రెజిల్, డెన్మార్క్, స్వీడన్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, ఫిన్‌లాండ్ దేశాల్లో కూడా మిగులు బడ్జెట్లు ఉన్నాయి. ప్రపంచంలో లోటు బడ్జెట్ దేశాలే అత్యధికంగా ఉన్నాయి. అమెరికా, చైనా, జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఈ బాపతువే. అయితే అత్యధికలోటు బడ్జెట్ గల దేశాల్లో మన దేశం ముందు వరుసలో ఉంటుంది. గతేడాది 23 శాతం లోటుతో మన బడ్జెట్ తయారయింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 112 ప్రకారం 1951లో గణతంత్ర భారతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రణాళిక సంఘ నియామకం జరిగింది. ఇప్పుడు దాని స్థానంలో నీతి ఆయోగ్ వచ్చింది. 1992– 93 సంవత్సరపు బడ్జెట్ దేశ దిశను మార్చేసింది. పి.వి. నరసింహా రావు పాలనలో మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన ఆనాటి బడ్జెట్ ప్రపంచీకరణకు ద్వారాలు తీసింది. విదేశీ పెట్టుబడులకు స్వాగతం పలుకుతూ దిగుమతి సుంకాన్ని 300 శాతం నుంచి 50 శాతానికి తగ్గించారు. 2017–18 బడ్జెట్‌కున్న చారిత్రకు విశేషమేమిటంటే అంతవరకు సుమారు 92 ఏళ్లుగా విడిగా ప్రవేశపెడుతున్న రైల్వే బడ్జెట్ సాధారణ బడ్జెట్‌లో విలీనమైంది. దీంతో రైల్వే మంత్రి ప్రభావం కూడా తగ్గిపోయింది. గతేడాది రాబడిలో ఆదాయపు పన్ను 14 శాతం, కార్పొరేట్ పన్ను 19 శాతం, కస్టమ్స్ నుండి 9 శాతం, ఎక్సైజ్ పన్ను 12 శాతం, సర్వీస్ టాక్స్ 9 శాతం భాగం పంచుకోగా 21 శాతం అప్పులతో బడ్జెట్ తయారైంది. 2016–17లో 39 శాతం ఉన్న కార్పొరేట్ టాక్స్ 30 శాతంకి మారి క్రమంగా సర్వీస్ టాక్స్ పెరిగిపోతోంది. జన సామాన్యం నుంచి సేవా పన్నులు అడ్డంగా వసూలు చేసి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఈ రకంగా ధారపోస్తోంది. 2009 నుండి 2012 వరకు పెరిగిన సబ్సిడీలు 2016–17 నుండి తగ్గు ముఖం పట్టాయి. కేటాయింపు 18.23 నుండి 12.66 శాతంకు జారింది.


అరుణ్ జైట్లీ (ఫైల్)

జులై 2017 నుంచి జిఎస్‌టిని అమలు చేస్తున్నారు. దీని ప్రభావం ఈ సంవత్సరం బడ్జెట్‌లో తెలియనుంది. జిఎస్‌టి వసూళ్లు జులై 2017లో రూ.95వేల కోట్లు, ఆగస్టులో రూ.91వేల కోట్లు, అక్టోబర్‌లో రూ.83వేల కోట్లు, నవంబర్‌లో రూ.80.05 కోట్లకు తగ్గింది.



ప్రభుత్వం ఉద్యోగ కల్పన, వృద్ధిరేటు పెరుగుదలపై దృష్టిసారించాలని ద్రవ్యలోటు నిర్వహణను వాయిదా వేసినా లోటు పెరిగినా ప్రమాదం లేదని నిపుణులు భావిస్తున్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయం, గ్రామీణ జనాభా, యువత, పేదల ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, రక్షణ, మౌలిక సదుపాయాలు ప్రధానంగా ముందుంటాయి. 2018–19లో రైతులకు 11 లక్షల కోట్ల మేర రుణాలు అందించే లక్ష్యం నిర్దేశించే అవకాశం ఉంది. గతేడాది కన్నా లక్ష కోట్లు ఎక్కువ. 2022 నాటికి దేశంలో రైతుల ఆదాయం రెట్టింపు కావాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మార్కెటింగ్ సంస్కరణలు, కనీస మద్దతు ధర కూడా ఈసారి కీలకాంశాలే. రుణ మాఫీ కన్నా సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ మాఫీని ప్రకటించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపే అవకాశం ఉంది. మార్చి 2018 నాటికి 100 శాతం గ్రామీణ విద్యుద్దీకరణకు హామీ ఇచ్చినా ఇంకా 4 కోట్ల ఇళ్లకు కరెంటు అందలేదని సర్వేలు చెబుతున్నాయి. రెండేళ్లలో కోటి పేద కుటుంబాలను దారిద్ర్య రేఖ ఎగువకు తెస్తామన్న బడ్జెట్ భరోసాకు దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక వేదికనే సమాధానమిచ్చింది. మన దేశంలో గతేడాది సృష్టించిన సంపదలో 73 అత్యధిక ధనవంతులైన 1 శాతం జనాభా తెలిపింది. గర్భిణీలకు రూ. 6000/– ఆర్థిక సహాయంలో ఉన్న కొన్ని నిబంధనల వల్ల ఇది అందరికీ అందే అవకాశం లేదు. ప్రభుత్వ దవాఖానాలో ప్రసూతి కావడంతో పాటు మొదటి శిశువుకే ఇది వర్తింపజేయడం వల్ల కేవలం 43 శాతం తల్లులకే ఈ సదుపాయం అందుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ ప్రయోజనం అందుకున్నవారి శాతం ఇంకా తక్కువగా ఉంది. ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం ప్రకారం 2017–18 సంవత్సరంలో బ్యాంకులు చిన్న తరహా వ్యాపారులకు, పారిశ్రామిక వేత్తలకు రూ. 50,000 నుండి 10 లక్షల దాకా రుణం వితరణ కోసం లక్ష్యం 2.44 లక్షల కోట్లుగా బడ్జెట్ నిర్ణయించింది. అయితే ఇప్పటి వరకు ఈ పథకం కింద అందిన రుణాలు 1.50 లక్షల కోట్లు మాత్రమేనని ముద్ర యోజన సమాచారంలో ఉంది.గత బడ్జెట్‌లో ఉపాధి కల్పన కోసం రూ. 17273 కోట్లు కేటాయించారు. అయితే దేశ వ్యాప్తంగా నిరుద్యోగిత స్వల్పంగా పెరిగిందని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ కోటి ఉద్యోగాల హామీ ఇచ్చారు. ఈ మధ్య ఈ విషయంలో ఓ పత్రిక అడిగిన ప్రశ్నకు మోడీ వింతైన సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది కాలంలో ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్‌లో 70 లక్షల కొత్త ఖాతాలు తెరవబడ్డాయి. వారంతా 18 నుండి 25 ఏళ్ల వయసువాళ్లే. అది కొత్త ఉద్యోగ కల్పన కాదా అని ప్రధాని ఎదురు ప్రశ్నించారు. 2017–18 బడ్జెట్‌లో ఆదాయం పన్ను మొదటి స్లాబు 10 శాతం నుండి 5 శాతం తగ్గించడంలో ఉద్యోగులకు నికరంగా ఏడాదికి రూ. 12500/ పన్ను తగ్గింది. ఈ సారి ఆదాయం పరిధిని రూ. 3 లక్షలకు పెంచుతారని వారు ఆశగా ఉన్నారు. చిన్న మధ్య తరహా వ్యాపార సంస్థలు (ఎమ్ఎస్ఎమ్ఇ) రూ. 50 కోట్ల లోపు పెట్టుబడి లావాదేవీలున్న వాటికి కార్పొరేట్ పన్ను తగ్గించాలని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు కోరుతున్నారు. రక్షణ శాఖకు కేటాయింపు ఎప్పుడూ పైపైకే. క్రితం బడ్జెట్‌లో రూ. 274114 కోట్లు ఇవ్వగా ఈసారి మరింత పెంచక తప్పదు. పోయినేడు ఆరు రాష్ట్రాల ఎన్నికల దృష్ట్యా షెడ్యూలు కులాలు, తెగలకు బడ్జెట్ కేటాయింపు 30 శాతం వరకు పెరిగింది. షెడ్యూలు కులాలకు 2016–17లో రూ. 38833 కోట్లు కేటాయించగా 2017–18లో రూ. 52393 కోట్లు ఇవ్వడమైంది. అదే రకంగా షెడ్యూల్ తెగలకు 35 శాతం పెంపు జరిగింది. ఈసారి ఆ పెంపు ఏస్థాయిలో ఉంటుందో చూడాలి. ఇన్‌కమ్‌టాక్స్ సెక్షన్ 80 సి పరిధిలో చదువుకునే ఇద్దరు పిల్లలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు మినహాయింపు పొందవచ్చు. అయితే ట్యూషన్ ఫీజు నెలకు ఒక్కరికి రూ. 100, హాస్టల్‌లో ఉంటే నెలకు రూ. 300, పరిమితి ఉంది. ఈ రోజుల్లో ఎంత ప్రియమైందో చెప్పనవసరం లేదు. కావున ఈ పరిమితులను పది రెట్లు పెంచినా తప్పు లేదు. మ్యూచువల్ ఫండ్స్ వైపు మదుపుదారులు చకచకా అడుగులు వేస్తున్నారు. సెన్సెక్స్ పరుగులు తీస్తోంది. బడ్జెట్‌పై ఆశలు, ప్రభుత్వ నిర్ణయాలు, విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాలు, భారత వృద్ధి రేటు పై ఐఎమ్ఎఫ్ అంచనాలు వెరసి సెన్సెక్స్ సూచీ పైపైకి సాగుతోంది. మే 2014లో 25000 దగ్గరున్న సెన్సెక్స్ ఇప్పుడు 36000 దాటింది. అంటే 44 శాతం వృద్ధి పొందింది. మోడీ అధికారానికి వచ్చినప్పటి నుంచి మదుపర్ల సంపద రెట్టింపయిందనవచ్చు. అయితే ఈ మురిపెం బడ్జెట్ తర్వాత కూడా కొనసాగుతుందా వేచి చూడాల్సిందే. బిఎస్ఇలో నమోదైన కంపెనీల విలువ రూ. 156 లక్షల కోట్లు. ఈ భారీ మొత్తం మోడీ మాటలకు చేతలకు భేదమేస్తే ఎటు ఒరిగిపోతుందో అన్న భయం ఇన్వెస్టర్లలో లేకపోలేదు. ఇది వాపు కాదు బలుపని నిరూపించుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మదుపర్ల సొమ్మునే కాకుండా రైతుల ఆదాయాన్ని కూడా త్వరలో రెట్టింపు చేస్తే దేశ వ్యాప్తంగా మేలు జరుగుతుంది. బడ్జెట్ నలుగురు అంధ సోదరుల ముందున్న ఏనుగు లాంటిది. ఆదాయ పన్ను పరిమితి పెంచితే ఉద్యోగులు సంతోషిస్తారు. పన్నులు తగ్గిస్తే పరిశ్రమలు సంబరపడతాయి. వ్యవసాయానికి వెసులుబాటు ఇస్తే రైతు పొంగిపోతాడు. ఏది చేసినా ప్రతిపక్షాలు మాత్రం పాస్ మార్కులేయవు. అయితే దేశ పౌరుల జీవితాల్లో ప్రామాణికమైన మార్పే బడ్జెట్ అసలైన ప్రయోజనం.


బి.నర్సన్
9440128169

హజ్‌పై ఓటు బ్యాంకు వేటు

'2022 లోగా విడతల వారీగా హజ్ సబ్సిడీని రద్దుచేయండి' అన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని కేంద్ర సర్కారు నాలుగేళ్ల ముందే అమలులోకి తెచ్చింది. ఎన్నో వివాదాల పరిష్కారంలో కోర్టు సూచనలను సైతం పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ఈ సబ్సిడీ విషయంలో మాత్రం కోర్టు ఆదేశాలను ఆగమేఘాల మీద శిరసావహించింది. సబ్సిడీని రద్దుచేసింది. 2018 హజ్ యాత్రకు ముస్లిములు దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేసుకున్నారు. ఎంపిక ప్రక్రియ కోసం వేచి చూస్తున్న తరుణంలో సబ్సిడీ రద్దు నిర్ణయం వెలువడింది. సబ్సిడీ ద్వారా వచ్చే ఆదాయాన్ని ముస్లిమ్ మహిళల అభ్యున్నతి కోసం ఖర్చుపెడతామని ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల మంత్రి చెప్పారు. కానీ ఎప్పుడు ఎలా ఖర్చు చేస్తారో మాత్రం చెప్పలేదు. ముస్లిమ్ ఉలమాలు, ముస్లిం సంఘాలు సబ్సిడీని ఎప్పుడూ ఆశించలేదు. ముందు నుంచీ ఈ సబ్సిడీని రద్దు చేయాలనే కోరుతూ వచ్చారు. దీనివల్ల హజ్ యాత్రికులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. సబ్సిడీ ఎత్తివేసిన తరువాత ఎయిర్ ఇండియా ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఎయిర్ ఇండియా మనుగడ సాగేదెలా అనే సందేహాలు తెరపైకి వచ్చాయి. జనవరి 10న ఎయిర్ ఇండియాలో 49శాతం ఎఫ్.డి.ఐ. కు అనుమతినిచ్చింది. జనవరి 16న హజ్ సబ్సిడీని ఎత్తివేసింది. అంటే ఎయిర్ ఇండియా నిర్వహణ, పోషణ ఏర్పాట్లు ముందుగానే చేసుకుందని స్పష్టమవుతుంది. హజ్ యాత్ర ఎయిర్ ఇండియా నుంచి తప్పించి చౌకధరకు వెళ్లే టెండర్ ను పిలవాలన్నది



ముస్లిముల ప్రతిపాదన. క్రికెట్ మ్యాచ్ ప్రసారం చేసేందుకు దూరదర్శన్ ఛానల్ ను కాదని వేరే చానళ్లకు టెండర్ పిలిచే ఆనవాయితీ ఉంది. రెట్టింపు చార్జీలు వసూలు చేసే ఎయిర్ ఇండియాకు బదులు టెండర్ ప్రక్రియ ద్వారా అతి తక్కువ విమాన ఛార్జీలు వడ్డించే సంస్థకు టెండర్ పిలవాలి.

హజ్ యాత్రకు విమాన ప్రయాణ ఖర్చులను ప్రభుత్వం తగ్గించేబదులు ఏటా పెంచుకుంటూ పోతోంది. మోదీ సర్కారు ఈ చార్జీలను రెట్టింపు చేసేసింది. తక్కువ ఖర్చుతో నౌకల ద్వారా హజ్ యాత్ర అందుబాటులోకి తెచ్చామని ప్రకటిస్తున్నప్పటికీ దీనివల్ల కొన్ని కంపెనీలకే లబ్ధి చేకూరుతుందనే తప్ప యాత్రికులకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. మతపరమైన యాత్రలకు సబ్సిడీలను ఇవ్వబోమని ప్రకటించిన సర్కారు కేవలం ముస్లిముల హజ్ యాత్ర సబ్సిడీనే ఎందుకు రద్దుచేసినట్లని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ లేవనెత్తారు. మిగతా మత వర్గాల ఆధ్యాత్మిక యాత్రలకు ఇచ్చే సబ్సిడీలను కూడా రద్దు చేయాలన్న డిమాండు చేశారు. హిందూ మత యాత్రలు, ఉత్సవాల్లో కోట్లాది డబ్బును కుమ్మరిస్తోంది. మానస సరోవర యాత్ర, కుంభమేళా తదితర పుణ్యక్షేత్రాల యాత్రలకు ప్రభుత్వ ఆదాయం నుంచి ఎలా ఖర్చుపెడుతోందని ఎవరూ ప్రశ్నించకపోవడం మత వివక్ష కాదా?. హజ్ యాత్రకు కొన్ని నెలల ముందే కోట్లాది రూపాయలు అడ్వాన్సుగా బ్యాంకుల్లో జమచేయబడతాయి. ఈ జమ చేసిన డబ్బుతో ప్రభుత్వం, దాని అనుబంధ సంస్థలు లబ్ధిపొందుతాయి. ఇలా హజ్ సబ్సిడీతో ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు లాభపడిన విషయం ప్రజలకు తెలియకుండా ముస్లిములేదో లాభపడుతున్నారని గగ్గోలు పెట్టి ప్రజల్లో అపప్రదను సృష్టించారు. ప్రయాణ చార్జీలను తగ్గించడమో లేక, సబ్సిడీ చేసిన మొత్తాన్ని అకౌంట్ నెంబర్లలో జమ చేస్తే దాన్ని సబ్సిడీ అంటారు. కానీ అలా ఎప్పుడూ జరగలేదు. కానీ దానికి భిన్నంగా ఎయిర్ ఇండియా ప్రయాణ చార్జీలను అమాంతం పెంచేస్తుంది. సాధారణ రోజుల్లో ఉన్న సౌదీ అరేబియాకు రానుబోను ప్రయాణ చార్జీలకు అదనంగా వసూలు చేస్తుంది. సబ్సిడీ పేరుతో అదనంగా వసూలు చేయగా వచ్చే మొత్తాన్ని ఎయిర్ ఇండియా సంస్థకు ఇచ్చేస్తుంది. ఇక్కడ లాభపడేదెవరో క్లియర్ గా స్పష్టమవుతుంది. రానుబోను ప్రయాణ చార్జీలను ఎంతోకొంత శాతం తగ్గిస్తే దాన్ని సబ్సిడీ అంటారు. తగ్గించకపోగా చార్జీలను అంతకంతకూ పెంచి ఆ పెంచిన పైకాన్ని ఎయిర్ ఇండియాకు ధారాధత్తం చేసి దాన్ని హజ్ సబ్సిడీ అని దానిపై రాజకీయాలు చేయడం, గగ్గోలు చేయడం విడ్డూరంగా ఉంది. హజ్ ప్రయాణానికి ఒక్కో ప్రయాణికుడి దగ్గరి నుంచి రూ.లక్షా 25వేలు వసూలు చేస్తోంది. ఆ వసూలు చేసే మొత్తం కూడా ప్రయాణానికి రెండు, మూడు నెలలు ముందే వసూలు చేస్తోంది. హజ్ యాత్రికులు ప్రేవేటు విమాన సంస్థలను ఆశ్రయించి ఇన్ని నెలల ముందే రిజర్వ్ చేసుకుంటే ఎంతో రాయితీతో ప్రయాణ సౌకర్యం కల్పిస్తాయి. ఎందుకంటే ప్రయాణానికి రెండు నెలల ముందే డబ్బు జమ చేస్తే ఆ డబ్బుతో వ్యాపారం చేస్తాయి. దీనికి భిన్నంగా అడ్వాన్సు డబ్బు జమ చేసినా రెట్టింపు ప్రయాణ చార్జీలతో ఎయిర్ ఇండియా యాత్రికులను దోచుకుంటోంది.ఉదాహరణకు ఎయిర్ ఇండియా ద్వారా ఢిల్లీ జిద్దా రానుబోను ప్రయాణ చార్జీలు రూ.36వేలు. అదే సౌదీ ఎయిర్ లైన్స్ చార్జీలు వీటికంటే చాలా చౌక. 20వేల హజ్ యాత్రికులు ఢిల్లీ నుంచి మక్కా కు వెళతారు. ఒక్కొక్కరి నుంచి రూ.75వేలు వసూలు చేస్తున్నారు. ఇక ఇందులో సబ్సిడీ మాటే లేదు. పైగా దీనిపై గగ్గోలు పెడుతున్నారు. ముస్లిములకు అందుతున్న సబ్సిడీని రద్దు చేసిన ఘనత తమకే దక్కుతుందని బీజేపీ ప్రగల్బాలు పలికి మెజారిటీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోంది.

– ముహమ్మద్ ముజాహిద్

బౌలింగ్ చేస్తూ మైదానంలోనే యువకుడి మృతి




మన తెలంగాణ/హైదరాబాద్/పంజాగుట్ట: క్రికెట్ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న ఓ యువకుడు అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 10లోని జహీరానగర్‌లో ఖైరతాబాద్ టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మన్నెగోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బంగారు తెలంగాణ ఎమ్‌జీఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగుతున్నాయి. నందినగర్‌కు రోడ్డు నెంబర్ 14కి చెందిన లాయిడ్ ఆంథోని (25) టోర్నీలో భాగంగా బౌలింగ్ చేస్తూ అకస్మాత్తుగా కుప్పకూలి పోయాడు. దీంతో క్రీడల నిర్వాహకులు, తోటి క్రికెటర్లు వెంటనే లాయిడ్‌ను ఓ ఆటోలో స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆంథోని మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తెలంగాణ అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షులు కె.వి.ప్రసాద్‌తో పాటు మరి కొంత మంది కలసి బంజారాహిల్స్ ఎసీపీ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు. యువకుని మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు ఎసీపిని కోరారు. లాయిడ్ ఆంథోని ఇటీవలనే ఉన్నత విద్యను పూర్తి చేసుకొని విదేశాలకు వెళ్ళేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం వారి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

జిల్లా సరిహద్దుల్లో మావోల బీభత్సం

- ఇన్‌ఫార్మర్ నెపంతో గొత్తికోయను నరికి చంపిన మవోయిస్టులు
- ఐదు లారీలు, రెండు ట్రాక్టర్‌లు, ఒక జెసిబి కాల్చివేత
- జయశంకర్ భూపాలపల్లిలో ఘటన, మావోల పేరుతో లేఖలు






మన తెలంగాణ/ మంగపేట: జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దు ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం భూపతిరావు పేటలోని ఇసుక క్వారీ సమీపంలో శుక్రవారం అర్థరాత్రి మవోయిస్టులు బీబత్సం సృషించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి..... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం భూపతిరావుపేటలో నివాసం ఉంటున్న వలస గొత్తి కోయ గత కొంత కాలంగా పోలీస్ ఇన్‌ఫార్మన్‌గా వ్యవహరిస్తున్నాడని మడవి జోగయ్య(42)ను అత్యంత దారుణంగా గొడ్డలితో నరికి హత్య చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన తెల్లం రమేష్‌పై కాల్పులు జరిపారు. అనంతరం గ్రామ సమీపంలోని ఇపు క్వారీ వద్దకు చేరుకుని రెండు ట్రాక్టర్‌లు, ఐదు లారీలు, ఒక జేసీబీని దహనం చేశారు అనంతరం మడవి జోగయ్య, రమేష్ లపేరుతో కరపత్రాన్ని వదిలి వెళ్ళారు.

తెల్లం రమేష్‌నే ఇన్‌ఫార్మర్ అయినందునే చంపాం

తెల్లం రమేష్‌ను పోలీస్ ఇన్‌ఫార్మర్ అయినందునే చంపామని సీపీఐ మావోయిస్ట్ మణగూరు ఏరియా పేరుతో కరపత్రాన్ని కరపత్రాన్ని విడిచారు. తెల్లం రమేష్ చత్తీస్‌ఘడ్ సుక్మాజిల్లాలో చందా గ్రామంలో రమేష్ గతంలో ప్రజా వ్యతిరేక విధానాలు చేట్టడం వల్ల తన గ్రామస్తుల మందే అతనిని శిక్షించామన్నారు. గ్రామంలో ప్రజలపై పెత్తనం చెలాయిస్తూ గ్రామస్తులను కొడుతూ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పనిచేశాడన్నారు. అనంతరం ప్రజల సమక్షంలో దేహ శుద్ధి చేస్తే అక్కడినుండి పారిపోయి వచ్చి పినపాక మండలం సుందర్ నగర్‌లో నివాసం ఉంటున్నాడని వివరించారు. ఇక్కడ సీపీఎం పార్టీలో చేరి పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడని అన్నారు. పార్టీ కార్యకర్తగా గిరిజన గూడేల్లోకి వెళ్లి గిరిజనులను పోలీస్ ఇన్‌ఫార్మర్‌లుగా మారుస్తు పార్టీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేస్తుండడంతో హతమార్చామని పేర్కొన్నారు. అనంతరం ఇసుక క్వారీ వద్ద మరో కరపత్రాన్ని వదలి వెళ్లారు కరపత్రాలలోని విషయాలు ఇలా ఉన్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై తల పెడుతున్న ఫాసిస్ట్ నిర్బంధాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 5న తెలంగాణ దండకారణ్యం బంద్‌ను పాటించాలని పిలుపునిచ్చారు. మావోయిస్టుపార్టీని నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో గ్రీన్ హంట్‌లో భాగంగా సమదాన్‌పహార్ 2 పేర్లతో పార్టీపై, ప్రజలపై కొనసాగిస్తున్న పాసిస్టు దాడికి వ్యతిరేకంగా తలపెట్టిన మంద్‌ను అన్ని వర్గాల ప్రజలు ప్రజాస్వామిక వాదులు వ్యాపారులువిద్యార్థులు ఉదోయగులు పూర్తి మద్దత్తును ఇస్తూ విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మవోయిస్టులు చేపట్టిన కార్యక్రమాలతో అటు భద్రాద్రి కొత్తగూడెం, ఇటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఒక్క సారిగా అలజడి మొదలైంది. ఇప్పటి వరకు స్థబ్దుగా ఉన్న గ్రామాలు భయందోళన మధ్యన .జీవనాన్ని సాగిస్తున్నాయి.

కాంగ్రెస్ అధికారంలో రావటం ఖాయం



మన తెలంగాణ/ కొండ మల్లెపల్లి : రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమని సీఎల్పీ నేత కుందురు జానారెడ్డి అన్నారు. శనివారం శ్రీశైలం నుంచి సాగర్ వెళ్తూ మండల కేంద్రంలో అగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరీ వేమన్‌రెడ్డి నివాసం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జానారెడ్డి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ పూటకోమాట గంటకో పథకంతో మాయ మాటలు చెబుతు తెలంగాణ ప్రజలకు మభ్య పెడుతూ కాలం గడుపుతున్నారని అన్నారు. మూడున్నరేళ్లుగా టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి,లక్ష ఉద్యోగాల హామీ అమలులో విఫలమయ్యారని ఆరోపించారు.తెలంగాణ వస్తే బంగారు తెలంగాణ చేస్తామని చెప్పిన కేసీఆర్ అప్పుల తెలంగాణగా మారుస్తూ నియంత పాలన సాగిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఈ రోజు తెలంగాణ రాష్ట్రం రూ.2 లక్షల కోట్లు అప్పులలో మునిగుందనిఅన్నారు.

పాతనోట్లను తరలిస్తున్న నలుగురు అరెస్టు

మన తెలంగాణ/హైదరాబాద్/ చార్మినార్ : కమీషన్‌కు కక్కుర్తిపడి రద్దయిన పాతనోట్లను తరలిస్తున్న నల్గురు వ్యక్తులను బహదూర్‌పురా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.53 కోట్ల రూపాయల పాత నోట్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం పురానీహవేలీ లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సత్యనారాయణ,అదనపు డీసీపీ గౌస్‌మొహినుద్దీన్, ఏసీపీ అంజయ్య, ఇన్‌స్పెక్టర్ ఖలీల్ పాషాలతో కలిసి వివరాలను వెల్లడించారు. ఎస్పైపి.మల్లయ్య బృందం బహదూర్‌పురా చౌరస్తాలో శుక్రవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా మారుతి ఇకో కారు (టీఎస్ 09ఇడబ్ల్యూ, 5853)లో నల్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి వాహనం స్పీడ్ పెంచారు. అనుమానంతో పోలీసులు వాహనాన్ని వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా పెద్ద ఎత్తున రద్దయిన రూ. వేయి, రూ.ఐదు వందల నోట్లు బయటపడ్డాయి. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా బెంగళూరు రాజాజీనగర్‌కు చెందిన వ్యాపారి పి.అమిత్ బగాడి (27), బేగంబజార్‌కు చెందిన ప్రైవేట్ పనిచేసే కె.మురారిలాల్ (57), శాలిబండకు చెందిన ఫోటోగ్రాఫర్ కాటారం రాజు (47), బేగం బజార్‌కు చెందిన వ్యాపారి విష్ణుబాటి (28)లుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియాను నియంత్రిస్తారా?

మన తెలంగాణ/ హైదరాబాద్ : ముఖ్యమంత్రి కెసిఆర్ సోషల్ మీడియాను నియంత్రించాలని చూస్తున్నారని, అందులో భాగంగా పోస్టింగ్‌లపై ఐపిసి 506,507 కింద నాన్ బెయిల్ కేసులు పెట్టాలని చూస్తున్నారని టిపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ దోసోజు శ్రవణ్ ఆరోపించారు.గ ఆంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియ సమావేశంలో మాట్లాడుతూ 506 ,507 సెక్షన్‌ల కింద కోర్టు అనుమతి లేకుండా కేసులు పెట్టే విధంగా కాగ్నిజబుల్ కేసులుగా మార్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. ఈ సెక్షన్ లను మార్చే హక్కు ప్రభుత్వాలకు లేదని గతంలో ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. తలమాసిన లీగల్ అడ్వైజర్ ఆలోచనలను సిఎం కెసిఆర్ ఫాలో అవుతున్నారని, మరోసారి న్యాయస్థానం చివాట్లు తప్పవని హెచ్చరించారు. ఈ సెక్షన్‌లలో మార్పు తీసుకురావాలనుకోవడం కెసిఆర్ దురహంకారం, అణిచివేతలకు నిదర్శనమని చెప్పారు. పేదోడికి సోషల్ మీడియా పాశుపతాస్త్రమని,దానిపై ఆంక్షలు విధించి పేదోడి గొంతు నొక్కాలని సిఎం చూస్తున్నారని దాసోజు ఆరోపించారు.

బాసర ఆలయ భూములపై విచారణ

మన తెలంగాణ/హైదరాబాద్ : బాసర జ్ఞాన సరస్వతి ఆలయానికి సంబంధించిన భూముల్లో అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. విచారణకు ముగ్గరు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ శివశంకర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. దేవాదాయ శాఖ విజిలెన్స్ సంయుక్త కమిషనర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్, సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను ఈ బృందంలో సభ్యులుగా నియమించారు. ముగ్గరు అధికారులు తక్షణమే దేవస్థానాన్ని సందర్శించి వచ్చిన ప్రతి ఆరోపణపైనా సమగ్ర విచారణ జరపాలని సూచించారు. ఆరోపణలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై కూడా తగు సిఫారసులు చేయాలని కోరారు. భూముల వ్యవహారంలో విచారణ బృందానికి సంబంధిత ఆర్డీఓ సహకరించేలా చూడాలని నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కమిషనర్ కోరారు. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని విచారణ బృందానికి సూచించారు.

నేడు పల్స్ పోలియో

మన తెలంగాణ/ హైదరాబాద్ : పోలియో రహిత సమాజ సుస్థిరతకు ఆదివారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా పల్స్‌పోలియోకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రశాషన్ నగర్ లో ఉదయం 9.00 గంటలకు పిల్లలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ పి సింగ్ పోలియో చుక్కలు వేసి ప్రారంభిస్తారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎంపిలు, ఎంఎల్ఏలు,ఇతర ప్రజాప్రతినిధులు వారి వారి సొంతనియోజకవర్గాలు, ప్రాంతాల్లో 5ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు.రాష్ట్ర వ్యాప్తంగా 36,55,204 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

డబ్బుల్లేవ్..సర్దుకోండి!

(మొదటిపేజీ తరువాయి)

గురవుతున్నారు. సాధారణంగా వానకాలంలో కోటి ఎకరాల వరకు సాగు విస్తీర్ణం నమోదుకు అవకాశం ఉంది.అలాగే వానలు అనుకూలిస్తే యాసంగిలో గరిష్ఠంగా50 లక్షల ఎకరాల వరకు సాగు నమోదుకు అస్కా రం ఉందని వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే ప్రభుత్వం పెట్టుబడి పథకానికి ఇచ్చే మార్గదర్శకాలు ముందుగా వానకాలం సీజన్‌కు ఇవ్వనున్నట్లు తెలిసింది. అన్నీ అనుకూలించి, యాసంగికి కూడా ఇచ్చే అవకాశం ఉంటే అప్పుడు మళ్లీ మార్గదర్శకాలు ఖరారు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'మన తెలంగాణ'కుచెప్పారు. రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందే వీలుగా ప్రభుత్వం పెట్టుబడి పథకం అమలును రచిస్తున్నదని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు.పెట్టుబడి పథ కం మార్గదర్శకాలపై సిఎం కె. చంద్రశేఖర్‌రావు స్వయంగా పర్యవేక్షిస్తున్న ందున ఆయనే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రైతు వేదికలకు రూ.458.85 కోట్లు : రైతులను సమన్వయం చేసి, సమావేశం ఏర్పాటు చేయడానికి, వ్యవసాయ శాఖ అధికారులకు కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో, వ్యవసాయ విస్తరణ అధికారి (ఎఇఒ) క్లస్టర్ పరిధిలో రైతు వేదికలను నిర్మించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.ఇందుకు మార్చిలో ప్రవేశపెట్టనున్న 2018–19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. మొత్తం 559 మండల కేంద్రాలో రైతు వేదికలకు రూ.167.70 కోట్లు, 1941 ఎఇఒ క్లస్టర్‌ల పరిధిలో రూ. 291.15 కోట్లు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వ్యవసాయ పెట్టుబడి నిధులతో కలిపి మొత్తంగా వ్యవసాయ బడ్జెట్ ప్రగతి పద్దు రూ. 13,410 కోట్లుగా ఉంటుందని అంచనా. విద్యుత్ సబ్సిడీ దాదాపు రూ. 6 వేల కోట్లు వరకు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌లోనే కేటాయించనున్నారు. ఫలితంగా మొత్తం వ్యవసాయ బడ్జెట్ రూ. 20 వేల కోట్లు చేరవచ్చునని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

కొత్త సిఎస్‌గా ఎస్‌కె జోషి

నెలాఖరులో పదవీ విరమణ చేయనున్న ఎస్‌పి సింగ్

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి డాక్టర్ శైలేంద్ర కుమార్ జోషి (ఎస్‌కె జోషి) నియమితులు కానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ కాలాన్ని మరో మూడు నెలలు పొడిగించాలని కోరుతూ గత డిసెంబ ర్ 24న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కేంద్రానికి లేఖ రాసింది.ఈ నేపథ్యంలో ఎస్.పి.సింగ్‌కు పదవీ కాలం పొడిగింపు పట్ల కేంద్ర ప్రభుత్వ వర్గాలు విముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు ఎస్‌పి సింగ్‌కు సమాచారం వచ్చింది. తెలంగాణ రాష్ట్రానికి రాజీవ్ శర్మ తొలి సిఎస్‌గా పనిచేయగా, ఆయనకు కొంత కాలం పొడిగింపు లభించింది. తర్వాత ప్రదీప్ చంద్రకు అవకాశం వచ్చింది. అయితే ఆయన కేవలం ఒక్క నెల మాత్రమే ఆ హోదాలో ఉన్నారు. ఆ తర్వాత మూడో సిఎస్‌గా ఎస్‌పి సింగ్‌ను ప్రభుత్వం నియమించింది. ఇప్పుడు నాలుగో సిఎస్‌గా ఎస్‌కె జోషి పేరు బలంగా పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. సాధారణంగా సిఎస్‌గా సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమిస్తారు. ఇప్పుడు సీనియర్ల జాబితాలో వరుసగా 1983 బ్యాచ్‌కు చెందిన బిపి ఆచార్య, బినయ్ కుమార్, రంజీవ్ ఆర్ ఆచార్య ఉన్నారు. ఆ తర్వాత 1984 బ్యాచ్‌కు చెందిన ఎస్‌కె జోషి, అజయ్ మిశ్రా తదితరులు ఉన్నారు. ఇందులో బిపి ఆచార్యకు 33 నెలలు, బినయ్‌కుమార్‌కు 28 నెలల సర్వీసు ఉంది. వీరిద్దరూ 2020లో పదవీ విరమణ చేస్తారు. రంజీవ్ ఆర్ ఆచార్యకు మాత్రం కేవలం 9 నెలల సర్వీసు మాత్రమే ఉంది. రంజీవ్ ఆర్ ఆచార్య 2018లోనే పదవీ విరమణ చేస్తారు. ఇక 1984 బ్యాచ్ అధికారుల్లో ఎస్‌కె జోషికి 2019 డిసెంబరు వరకు 23 నెలల సర్వీసు ఉంది. అజయ్ మిశ్రాకు 2020 జూలై 31 వరకు 30 నెలల సర్వీసు ఉంది. ఈ ఐదుగురిలో ముగ్గరి పేర్లతో కొత్త సిఎస్ ఎంపిక కోసం కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తుంది. అయితే కొత్త సిఎస్‌గా ఎక్కువగా శైలేంద్ర కుమార్ జోషికే ఎక్కువ మొగ్గు ఉన్నట్లు తెలిసింది.

ఎథిక్స్ పరీక్షకు 4,47,091 మంది హాజరు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన నైతికత, మానవ విలువలు పరీక్షకు 4,47,091 మంది హాజరయ్యారని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.మొత్తం 4,61,748 మంది అభ్యర్థులు రిజిష్టర్‌చేసుకోగా,14,657మందిగైర్హాజరయ్యారనిపేర్కొన్నారు.

ముందస్తు ప్రవేశాలు చేపట్టే కళాశాలలపై చర్యలు : 2018–19 విద్యా సంవత్సరానికి ప్రవేశాల షెడ్యూల్ విడుదలైన తర్వాతనే జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు చేపట్టాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్ స్పష్టం చేశారు. షెడ్యూల్ విడుదల కంటే ముందు చేపట్టే ప్రవేశాలు చెల్లుబాటు కావని, ముందుగా ప్రవేశాలు చేపట్టే కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కళాశాలల యాజమాన్యాలు నిర్వహించే హాస్టళ్లకు కూడా ఇంటర్ బోర్డ్ అనుమతి ఇస్తుందని తెలిపారు. బోర్డ్ నిబంధనల ప్రకారం సౌకర్యాలు ఉన్న హాస్టళ్లకే అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ముందుగా ప్రవేశాలు తీసుకోవద్దని సూచించారు. బోర్డ్ గుర్తింపుఇచ్చిన కళాశాలలు, హాస్టళ్లలోనే ప్రవేశాలు తీసుకోవాలని తెలిపారు.




హత్యారాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

టిఆర్ఎస్ నాయకులు ప్రతి విమర్శలు చేస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా నిందితులతో కలిసివున్న ఫొటోలను ఇరుపక్షాల వారు మీడియాకు ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో కీలకంగా మారిన శ్రీనివాస్ కేసును ఛేదించాల్సిన జిల్లా పోలీసులు మాత్రం ఇప్పటి వరకు ప్రేక్షక పాత్రకు మాత్రమే పరిమితమయ్యారు. పథకం ప్రకారం నల్లగొండ మున్సిఫల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త శ్రీనివాస్‌ను ఇంటి నుంచి రప్పించి బుధవారం అర్థరాత్రి బండరాళ్లతో కొట్టి చంపిన ఘటన ఉమ్మడి నల్లగొండ జిల్లాను కుదిపివేసింది. దీనివెనుక రాజకీయ కుట్ర వుందన్న నేపథ్యంలో ఈ హత్య సంఘటన మరింత కీలకంగా మారింది. శ్రీనివాస్ హత్య కేసులో నిందితులుగా భావిస్తున్న నల్లగొండకు చెందిన కత్తుల చక్రి, దుర్గయ్య, మాతంగి మోహన్, మెరుగు గోపి,చింతకుంట్ల రాంబాబు, మల్లేష్, శరత్‌లు శ్రీనివాస్ అనుచరులుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగారు. కొంత కాలం క్రితం శ్రీనివాస్‌తో కలిసి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. కోమటిరెడ్డితో వున్న సుదీర్ఘ అనుబంధంతో అనతి కాలంలోనే శ్రీనివాస్ తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. కాగా హత్యకేసులో వున్న నింధితులు ఇటు కోమటిరెడ్డితోను, అటు వేముల వీరేశంతోనూ చనువుగా వున్నట్లుగా ఫొటోలు దిగారు. దీంతో ఇరు పార్టీల వారు శ్రీనివాస్ హత్యకు కుట్ర పన్నింది మీరంటే మీరని దుమ్మెత్తి పోసుకుంటున్నారు. దీంతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ప్రశాంత వాతావరణం చెదిరిపోయింది. అత్యంత కీలకమైన కేసులో ఎటువంటి విభేధాలు తలెత్తకుండా శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన జిల్లా పోలీస్ యంత్రాంగం నాలుగు రోజులైనా కేసు మిస్టరీని చేధించక పోవడం గమనార్హం. నింధితులు అదే రోజు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. నిందితులు తమ అదుపులోనే వున్నా విచారణలో పోలీసుల జాప్యం వెనుక రాజకీయ వత్తిళ్లు వున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. కేసును పక్కదోవ పట్టించేందుకే భిన్న కథనాలను ప్రచారంలోకి తీసుకొస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. మున్సిఫల్ చైర్‌పర్సన్ భర్త కేసులోనే పోలీసుల ధర్యాప్తు తీరు ఇలా వుందంటే సామాన్యుల సంగతేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే పోలీసులు చిత్తశుద్ధితో దర్యాప్తు జరిపి అసలు దోషలను అరెస్టు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

హత్యపై సమగ్ర విచారణ జరపాలి

మన తెలంగాణ/ హైదరాబాద్ : నల్లగొండ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై సమగ్ర విచారణ జరపాలని డిజిపిని కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ మేరకు డిజిపి పి.మహేందర్‌రెడ్డిని శనివారం టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ బృందం కలిసింది. ఈ బృందంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మహ్మద్‌అలీ షబ్బీర్, కాంగ్రెస్ నేతలు వి.హెచ్, జె.గీతారెడ్డి,పొంగులేటిసుధాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగ య్య ఉన్నారు. శ్రీనివాస్ మృతిపై సమ గ్ర విచారణ జరపడంతో పాటు, బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నందున సిఎల్‌పి ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, మాజీ ఎంఎల్‌ఏ చిరుమర్తి లింగయ్యకు భద్రతను పెంచాలని డిజిపికి వారు విజ్ఞప్తి చేశారు.

అందుబాటులో పశువుల మందులకు చర్యలు

మన తెలంగాణ/హైదరాబాద్ : పశువైద్యశాలల్లో జీవాలకు అవసరమైన మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. సచివాలయంలో శనివారం పశుసంవర్థక, మత్స్యశాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాల ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సంచార పశువైద్యశాల సేవల కోసం 1962కు విపరతీమైన ఫోన్ కాల్స్ వస్తున్నాయని అందుకనుగుణంగా సిబ్బందిని పెంచాలన్నారు. 1962 పరిధిలోకి ప్రధాన పశువైద్యశాలలను అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గడ్డిసాగు పెంపకానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

చకచకా

(మొదటిపేజీ తరువాయి)

చర్చించనున్నారు. ఈ నెల 31 లోపు జిల్లా సదస్సులను పూర్తి చేసుకున్న తర్వాత విస్తృతస్థాయి సమావేశ ఎజెండా అంశాలను, భవిష్యత్‌కార్యాచరణ ఎలా ఉండాలనే విషయమై త్వరలోనే మరోసారి స్టీరింగ్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

పార్టీలోకి జెఎసి నుండి కొందరే : పార్టీ ఏర్పాటైన తరువాత జెఎసి నుండి కొంత మందిని మాత్రమే ఆ బాధ్యతల్లో తీసుకోనున్నట్లు తెలిసింది. తరువాత కూడా జెఎసిని యథాతథంగా కొనసాగించాలని భావిస్తుండడంతో ఎవరు పార్టీలోకి వెళ్తారు, ఎవరు జెఎసిలో ఉంటారనే అంశంపై విస్తృతస్థాయి సమావేశం తర్వాత ఒక స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందుకే ఈ సమావేశానికి జెఎసి శ్రేణులు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. రాజకీయ పరమైన అంశంపై చర్చించి తుది నిర్ణయం తీసుకునేందుకు దాదాపు ఇదే చివరి సమావేశం అవుతుందని జెఎసి నాయకులు చెబుతున్నారు.

టచ్‌లోకి వచ్చిన పాతమిత్రులు? :రాజకీయ పార్టీ విధివిధానాలు, నిర్మాణం, లక్ష్యాలు, ఏజెండా తదితర అంశాలపై కోదండరామ్ ఇది వరకే కొందరు సీనియర్ రాజకీయ నేతలు, మేధావులతో చర్చలు జరుపుతున్నారు. జెఎసి విస్తృత స్థాయి సమావేశం అనంతరం ఢిల్లీ పర్యటన పెట్టుకునే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే తెలంగాణ ఉద్యమ సమయంలో జెఎసితో కలిసి పనిచేసి, ప్రస్తుతం అధికార పార్టీలో వివిధ హోదాలలో ఉన్న వారు కూడా కోదండరామ్ పార్టీ పెడితే వస్తామనే సంకేతాలు ఇచ్చినట్టు సమాచారం. ఇటీవల పలు నియోజకవర్గాలలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నేతలు జెఎసిలోని కొందరు ముఖ్యనేతలతో చర్చించినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా కోదండరామ్ రాజకీయ రంగ ప్రవేశం చేస్తే ఆయన స్థానంలో జెఎసి కో–ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కన్వీనర్ కె.రఘు ఇద్దరిలో ఎవరినైనా ఒకరికి జెఎసి ఛైర్మన్ బాధ్యతలను అప్పగించాలనే అంశంపై కూడా చర్చ సాగుతోంది.

ఎత్తిపోతల విద్యుత్ భారం

(మొదటిపేజీ తరువాయి)

దశకు చేరడం, వచ్చే సంవత్సరం నుంచే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోస్తుండడంతో బిల్లు ఏకంగా 5 వేల కోట్లకు పెరుగుతుందని అధికారులు చెప్పారు. రాష్ట్ర రైతాంగానికి మేలు చేసేలా, బహుముఖ ప్రయోజనాలు ఆశిస్తూ చేపట్టిన ఎత్తిపోతల పథకాల కరెంటు చార్జీలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని తగ్గించాలని అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి, విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ పథకాల్లో లాభాలను చూసుకోవద్దంటూ కమిషన్‌ను ఇరిగేషన్ అధికారులు కోరారు. ఇదిలా ఉండగా ఎత్తిపోతల పథకాల వినియోగానికి సంబంధించి యూనిట్‌కు 6.40 చొప్పున ప్రస్తుతం వసూలు చేస్తున్నారు. అయితే డిస్కంలకు అవుతున్న ఖర్చుకు వసూలు చేస్తున్నతీరుకు సంబంధం లేదు. సమిష్టి ప్రజలు, రైతాంగానికి సంబంధించిన పథకాల్లో లాభాలకు చోటు ఉండవద్దు. 11 కెవి వోల్టేజ్‌లో ఒక్కో యూనిట్ సరఫరాకు డిస్కంలకు రూ.6.28 చొప్పున ఖర్చవుతుంది. 33 కెవి వోల్టేజిలో రూ.5.66, 132 కెవి వోల్టేజిలో రూ.5.12 చొప్పున వెచ్చిస్తున్నారు. కానీ లాభంతో కలుపుకొని అన్నింటికీ ఒకే రీతిలో రూ.6.40 చొప్పున ఇరిగేషన్ శాఖ నుంచి వసూలు చేస్తున్నారు. గతంలో పెద్ద పథకాలు లేకపోవడం, ఉన్నా నడవక పోవడం, ప్రాజెక్టులు పూర్తిచేయకపోవడం వంటి కారణాలతో పెద్దగా కరెంటు బిల్లు వచ్చేది కాదు. కానీ తెలంగాణ వచ్చాక పథకాలు త్వరితగతిన పూర్తిచేస్తుండడం, కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల వంటి భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడంతో భవిష్యత్తులో ఈ కరెంటు బిల్లు రూ.10 వేల కోట్లు దాటనుంది.

డిమాండ్ చార్జీలతో రూ.900 కోట్ల భారం : డిమాండ్ చార్జీలు, ఎనర్జీ చార్జీల పేరుతో ప్రతిపాదించడంతో ఇరిగేషన్ శాఖపై రూ.900 కోట్ల మేర అదనపు భారం పడుతుంది. గతంలో వినియోగించిన విద్యుత్‌కు మాత్రమే చార్జీలు వసూలు చేసేవారు. ఇప్పుడు దాన్ని డిమాండ్ చార్జీలు, ఎనర్జీ చార్జీలుగా విడదీసారు. దీంతో సగటున యూనిట్‌కు రూ.6.40 మరింత పెరుగుతుంది. అదనంగా 4 పైసల చొప్పున భారం పడుతోందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు.

ఇతర రాష్ట్రాల్లో ఎత్తిపోతల పథకాలకు ఉన్న టారిఫ్ (యూనిట్‌కు, రూ.లలో)

కేరళ	2.25
మహారాష్ట్ర	5.39 (గరిష్ఠంగా)
తమిళనాడు	6.35
కేరళ	2.80
ఆంధ్రప్రదేశ్	5.82
మధ్యప్రదేశ్	5.30
తెలంగాణ	6.40
పంజాబ్	5.06
హర్యానా	6.90
ఉత్తరప్రదేశ్	7.55 (సగటున)

రాష్ట్రంలో ప్రతిపాదిత, నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాలు, వాటికి కావాల్సిన కరెంటు (మెగావాట్లలో)

కృష్ణా బేసిన్‌లో	
కల్వకుర్తి ఎత్తిపోతల పథకం	450
భీమా ఎత్తిపోతల 1	48
భీమా ఎత్తిపోతల 2	48
నెట్టెంపాడు ఎత్తిపోతల	119
కోయిల్‌సాగర్ ఎత్తిపోతల	30
ఎఎంఆర్ ఎత్తిపోతల	84
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం	4720
ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం	32
తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం	21.50
గట్టు ఎత్తిపోతల పథకం	10.50
గోదావరి బేసిన్‌లో	
దేవాదుల ఎత్తిపోతల పథకం	476.46
ఎల్లంపల్లి ఎత్తిపోతల	135.78
జోగాపూర్ ఎత్తిపోతల	13.60
అలీసాగర్ ఎత్తిపోతల	24.60
గుత్ప ఎత్తిపోతల	17.63
చౌటుపల్లి హన్మంతరెడ్డి లిఫ్టు	5.19
కడెం లిఫ్టు	8.20
మంథని లిఫ్టు	8.40
ముక్తేశ్వర లిఫ్ట్ ఫేజ్ 2	7.05
కాళేశ్వరం ఎత్తిపోతల పథకం	4831.51
గౌరవెల్లి – తోటపల్లి లిఫ్టు	96
గౌరవెల్లి – గండిపల్లి లిఫ్టు	17.60
హాతిఘాట్ లిఫ్టు	64.90
రామప్ప పాకాల లిఫ్టు	16
సీతారామ ఎత్తిపోతల	650
ఫ్లడ్ ఫ్లో కెనాల్	156



టిఆర్‌ఎస్‌ను గద్దె దించేదాకా విడిచిపెట్టం : మురళీధర్‌రావు

మన తెలంగాణ/మానకొండూర్: రైతు సమస్యలను పరిష్కరించరించుకునే దిశగా భారతీయ జనతా పార్టీ రైతుల వెన్నంటే ఉండి పోరాటం చేస్తుందని, టిఆర్‌ఎస్‌ను గద్దె దించే వరకూ పోరాడుతామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు అన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రైతు పంచాయితీ బహిరంగ సభకు మురళీధర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిఎం కెసిఆర్ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, కాంగ్రెస్ కూడా తుడిచిపెట్టుకుపోయిందన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డి నాలుగేళ్లు కావస్తున్నా నియోజకవర్గానికి చుక్కా నీరు తీసుకురాలేదన్నారు. ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి భూములు లాక్కుంటున్న ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించకుండా రైతుల నోట్లో మట్టికొడుతోందని ఆరోపించారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఫసల్ భీమా యోజన పథకాన్ని తీసుకువస్తే రాష్ట్రంలో అమలుకానివ్వడం లేదు. సాయిల్ హెల్త్ కార్డును తీసుకువస్తే దాన్నీ అమలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్రం సబ్సిడీ ఇస్తున్న పథకాలన్నింటిపైనా ముఖ్యమంత్రి బొమ్మను వేసుకుని ప్రచార ఆర్భాటం చేసుకుంటున్నారన్నారు. దళిత, రైతు, కూలీల వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించుతామని పునరుద్ఘాటించారు.

ఎసిబికి చిక్కిన విద్యుత్ శాఖ లైన్‌మన్



మన తెలంగాణ/అబ్దుల్లాపూర్ మెట్: విద్యుత్ మీటర్ ఏర్పాటుకు లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ లైన్‌మన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. రంగారెడ్డి జిల్లా రెంజ్ ఎసిబి డిఎస్‌పి సూర్య నారాయణ వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరులో శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేసుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో విద్యుత్ పనుల నిమిత్తం రాము అనే వ్యక్తి కాంట్రాక్ట్ తీసుకున్నాడు. కాగా ఇంటి మీటర్ కోసం శ్రీనివాస్‌రెడ్డి పేరు మీద కాంట్రాక్టర్ రాము దరాఖాస్తు చేశాడు. మీ టర్ మంజూరు కాగా, పెద్ద అంబర్‌పేట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కుంట్లూరు రూట్ లైన్‌మన్ వెంకటేశ్ ఇంట్లో మీటర్ అమర్చేందుకు రూ.3 వేలు ఇస్తే నే మీటర్‌ను ఏర్పాటు చేస్తామని కాంట్రాక్టర్ రాముతో లైన్‌మన్ వెంకటేశ్ చెప్పాడు. దీంతో ఎసిబిని ఆశ్రయించారు. కాంట్రాక్టర్ రాము ఫిర్యాదు మేరకు ఎసిబి డిఎస్‌పి సూర్యనారాయణ, సిఐలు నవీన్, రఘు, జగన్‌మోహన్‌రెడ్డి బృందం రంగాంలోకి దిగారు. శనివారం కుంట్లూరు వార్డు కార్యాలయం వద్ద కాంట్రాక్టర్ రాము నుంచి లైన్‌మన్ వెంకటేశ్ రూ.3 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎసిబి డిసిపి సూర్యానారయణ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి

మన తెలంగాణ/కరీంనగర్ క్రైం: వైద్యుల నిర్లక్ష్యంగా ఓ పసికందు మృతి చెందిన సంఘటన కరీంనగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని 8 ఇంక్లైన్‌కు చెందిన ఓరుగంటి మహేశ్ తన భార్య శైలజ ప్రసవం నిమిత్తం శుక్రవారం గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు పరీక్షించి కరీంనగర్ మతాశిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. వారి సూచన మేరకు అదేరోజు రాత్రి 7 గంటల ప్రాంతంలో తన భార్యను కరీంనగర్‌కు తీసుకెళ్లి చేర్పించారు. ఆ సమయంలో ఆసుపత్రికి సంబంధించిన వైద్యులెవరూ లేరు. శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆసుపత్రికి వచ్చిన వైద్యులు శైలజను పరీక్షించి ప్రసవం చేయగా మృత శిశువు జన్మించిందని మహేశ్ కుటుంబానికి అప్పగించారు. ఇదిలా ఉండగా తన పాప మృతికి వైద్యులు నిర్లక్ష్యమే కారణమని మహేశ్ ఆరోపించగా, అదే సమయంలో ఆసుపత్రికి వచ్చిన ఎంఎల్‌ఎ గంగుల కమలాకర్‌ను కలిసి తన గోడు చెప్పుకున్నాడు. వైద్యులు అందుబాటులో ఉంటే పాప బతికి ఉండేదని కన్నీరుమన్నీరయ్యారు. వెంటనే స్పందించిన ఎంఎల్‌ఎ ఆస్పత్రి ఇన్‌చార్జి డా.అలీంను పిలిపించి జరిగిన సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అదేశించారు.

అంతర్రాష్ట్ర గొలుసు దొంగ అరెస్ట్

- **47 తులాల బంగారం, బైక్ స్వాధీనం**

మన తెలంగాణ/హైదరాబాద్/గచ్చిబౌలి: సైబరాబాద్ పరిధిలో వరుసగా గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర గొలుసు దొంగని కెపిహెచ్‌బిలోని లాడ్జిలో పోలీసులు అరెస్ట్ చేశారు. గచ్చిబౌలి కమిషనర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ కమిషనర్ సందీప్ శాండిల్యా వివరాలు వెల్లడించారు. సైబరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి కాలనీ, మియాపూర్, చందానగర్ పరిసరాల్లో వరుస గొలుసు దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న అమోల్ బాబా సాహెబ్ షిండేను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితుడి వద్ద నుంచి రూ.15 లక్షల విలువ చేసే 47 తులాల బంగారం, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మహారాష్ట్ర పర్భని జిల్లా, ఖానాపూర్ తాలూకా, యశ్వంత్ నగర్‌కు చెందిన అమోల్ బాబా సాహెబ్ షిండే అలియాస్ అమోల్ (24) పదో తరగతి వరకు చదువుకొని పర్భనిలో దొంగతనం చేసి జైల్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చిన తర్వాత పర్భని నుంచి ఔరంగాబాద్‌కు, అక్కడి నుంచి లాతూర్‌కు వచ్చి అక్కడా జైలు జీవితం గడిపారు. ఈ నేపథ్యంలో సంజయ్ హకాని యాదవ్‌తో పరిచయం ఏర్పడింది. వీరు హైదరాబాద్‌కు మకాం మార్చి కూకట్‌పల్లిలో నివాసం ఏర్పాటు చేసుకొని నిర్మానుష్య ప్రదేశాలను ఎంచుకొని ఒంటరి మహిళలను, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గొలుసు దొంగతనాలపై ఎక్కువ ఫిర్యాదులు రావడంతో సైబరాబాద్ పరిధిలో సిసి కెమెరాల రికార్డు పరిశీలించి నిందితుడిని గుర్తించినట్లు తెలిపారు. కెపిహెచ్‌బిలో లాడ్జిలో ఉన్నాడనే పక్కా సమాచారంతో అరెస్ట్ చేసి అతనిపై కేసు నమోదు చేసి పిడి యాక్ట్ నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డిసిపి విశ్వప్రసాద్, డిసిపి క్రైం జానకీ షర్మిల, కూకట్‌పల్లి ఎసిపి భుజంగరావు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ సుదీర్, కానిస్టేబుల్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జైళ్లశాఖలో అవినీతికి ఆస్కారం లేదు

- **జైళ్ల శాఖ డిఐజి బి.సైదయ్య**



మన తెలంగాణ/ హుజూర్‌నగర్: దేశంలోనే తెలంగాణ జైళ్ల శాఖ మంచి గుర్తింపును తెచ్చుకుందని హైదరాబాద్ రేంజ్ డిఐజి బి. సైదయ్య అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సబ్‌జైల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వికె సింగ్ ఆదేశాల మేరకు ఆరోపణలు, అనుమానాల కేసులపై ఎదుర్కొంటున్న ఖైదీలకు సంబంధించిన కేసుల్లో సబ్‌జైల్ అధికారులు పునరుద్ధరణ విచారణ జరిపి స్టేషన్ బేయిల్‌ను ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీల ఉపాధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 14 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండలలో కూడా పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక జైల్‌లో మహిళా హోంగార్డులు లేకపోవడంతో మహిళా ఖైదీలను తీసుకోవడం లేదని ఆయన తెలిపారు. వీలైనంత త్వరలో మహిళాలకు కూడా ఉపాధి కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. జైళ్ల శాఖలో అవినీతికి పాల్పడిన అధికారులపై అధారాలు చూపిస్తే రూ.10 వేల నజరానా అందిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఖైదీలకు 50 ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. హుజూర్‌నగర్ సబ్‌జైల్ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సూపరిండెంట్ రమేశ్ సిబ్బంది ఉన్నారు.

రాజకీయాల్లోకి రావడం ఖాయం..

- **జెఎసి చైర్మన్ ప్రొ. కోదండరాం**

మన తెలంగాణ/ఖమ్మం: రాజకీయాల్లోకి రావటం ఖాయమే అయినా ఇంకా వేదికను నిర్ణయించుకోలేదు. రైతాంగ సమస్యలు కార్యాచరణ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన జెఎసి చైర్మన్ ప్రొ.కోదండరాం 'మన తెలంగాణ'తో ముచ్చటించారు. రాష్ట్ర సాధనలో పోషించిన పాత్ర సంతృప్తినిచ్చినా ప్రస్తుత పరిస్థితులపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. ఉద్యమంతో ప్రజలు చైతన్యవంతులైనా, ఆశించిన ఫలితం దక్కడం లేదన్నారు. ప్రొ.జయశంకర్ చెప్పినట్లు పాలకులను అనుమానించక తప్పడం లేదన్నారు. ప్రస్తుత పాలకులు సమైక్యవాదులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏ లక్ష్యం కోసం ఏర్పడిందో ఆ లక్ష్యం నెరవేరే వరకూ తమ పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 4న జెఎసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నామని, ఈ సమావేశంలో సమస్యలపై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని కోదండరాం తెలిపారు.

మిద్దె తోటకూ బ్యాంకు రుణం

- **స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లోకి సేంద్రియ కూరగాయలు**
- **రానున్న సీజన్‌కు రుణ పరిమితులు నిర్ణయించిన ఎస్‌ఎల్‌టిసి**

మన తెలంగాణ/హైదరాబాద్: రానున్న వ్యవసాయ సీజన్ నుంచి పట్టణాల్లో మిద్దెతోటలు సాగు చేసే వారికి కూడా బ్యాంకులు పంట రుణం ఇవ్వనున్నాయి. సేంద్రియ కూరగాయల సాగుతో పాటు ఔషధ పంటలకు కూడా రుణం పొందే అవకాశం ఉంది. ఈ మేరకు అర్బన్ హార్టికల్చర్, సేంద్రియ సాగును ప్రోత్సాహించేందుకు ఉద్యాన శాఖ కోరిన ప్రతిపాదనలకు రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ (ఎస్‌ఎల్‌టిసి)ఆమోదం తెలిపింది. రానున్న సీజన్ (2018–19)కు సంబంధించి బ్యాంకులు మొత్తం 101 పంటలకు ఏయే పరిమితిలో రుణాలు ఇవ్వవచ్చో (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఎస్‌ఎల్‌టిసి నిర్ణయించింది. గత ఏడాది 81 పంటలు మాత్రమే ఉండగా ఈసారి కూరగాయలు, పండ్ల తోటలు, విత్తనోత్పత్తి పంటలకు, పప్పు పంటల సాగుకు సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అధికంగా పెరిగింది. సేంద్రియ కూరగాయలకు రూ. 37 వేల నుంచి రూ. 40 వేల మధ్య రుణం ఇవ్వాల్సి ఉంటుంది. అర్బన్ హార్టికల్చర్, మిద్దె తోటలు 750 చదరపు అడుగులలో సాగు చేసే వారికి మూడు దశలలో రుణం ఇచ్చే విధంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించారు. మొదట రూ. 9 వేల నుంచి 10వేల మధ్య, రెండో దశలో రూ. 18 వేల నుంచి 20వేల మధ్య, మూడోసారి రూ. 27 వేల నుంచి రూ. 30వేల మధ్యలో నిర్ణయించారు. రానున్న సీజన్‌లో ఔషధ మొక్కలైన అశ్వగంధ, నీలవేణు, కలబంద, తులసి వంటి సాగు కూడా బ్యాంకులు రుణం ఇవ్వాల్సి ఉంటుంది. వరి, జొన్న, మొక్కజొన్న, కందులు వంటి పంటలకు గత ఏడాదితో చూస్తే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కొంత పెరిగింది. శనగల సాగుకు సాగు నీటి వనరులు లేని ప్రాంతాల్లోనే రూ. 16 వేల నుంచి రూ. 18 వేల మధ్య నిర్ణయించారు. ఆయిల్ ఫామ్ సాగు పెంచేందుకు అనువుగా రూ. 32 వేల నుంచి రూ. 35 వేల మధ్య రుణం నిర్ణయించారు. ప్రస్తుతం రూ. 30–32 వేల మధ్య ఉంది. పత్తికి కూడా రానున్న సీజన్‌కు రూ.30 వేల నుంచి రూ. 35 వేల మధ్య , సోయాబీన్‌కు రూ. 16 వేల నుంచి రూ. 18 వేల మధ్య నిర్ణయించారు. అత్యధికంగా విత్తులు లేని ద్రాక్షల సాగుకు రూ. 1.20 లక్షల నుంచి రూ. 1.25 లక్షల మధ్య రుణం ఇవ్వనున్నారు.

వివిధ పంటల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్

పంట	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (2018–19)
వరి	30000–34000
వరి విత్తనోత్పత్తి	40000–42000
జొన్నలు	11000–18000
మొక్కజొన్న	25000–28000
కందులు	15000–18000
వేరుశనగ	21000–23000
పత్తి	30000–35000
పత్తి విత్తనోత్పత్తి	94000–126000
మల్బరీ	40000–50000
టమాట	30000–35000
అల్లం	55000–60000
వెల్లుల్లి	25000–28000
మామిడి	30000–35000
సపోటా	20000–25000
స్వీట్ ఆరెంజ్	40000–45000



పత్తి.. వరి విత్తనోత్పత్తికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్

వచ్చే సీజన్ నుంచి పత్తి, వరి విత్తనోత్పత్తి చేసే రైతులకు బ్యాంకులు పంట రుణం ఇవ్వాల్సి ఉంటుంది. వీటికి సాధారణ సాగు కంటే ఎక్కువగానే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించారు. పత్తి విత్తనోత్పత్తి చేసే వారికి రూ. 94 వేల నుంచి రూ. 1.26 లక్షల మధ్య ఉండగా, వరి విత్తనోత్పత్తికి రూ. 40 వేల నుంచి రూ. 42 వేల మధ్య ఉంది. మల్బరీ, పసుపు, టమాట, అల్లం, వెల్లుల్లి, పులిగోపి, ఉల్లిగడ్డ, క్యారెట్, పుచ్చపండు సాగుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎక్కువగా పెంచారు.

చి'వరి' ఆయకట్టుకూ నీరు



- **రైతుల ప్రయోజనాలు కాపాడుతాం**
- **ఆర్థిక శాఖ మంత్రి ఈటల**

మన తెలంగాణ/కరీంనగర్: కరీంనగర్ జిల్లా రైతుల ప్రయోజనాలు కాపాడాలనే ఉద్దేశంతో సిఎం కెసిఆర్ ప్రాజెక్టులకు సంబంధించిన నియమ, నిబంధనలను పక్కన పెట్టి మంజీరాపై ఉన్న సింగూరు నుంచి 15 టిఎంసిల నీటిని జిల్లాకు కేటాయించారని ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నీటి సరఫరాపై సభ్యుల ఆందోళనను పరిగణనలోకి తీసుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్, ఓదెల మండలాలకు చెందిన ప్రజాప్రతినిధుల ఆవేదనతో ఆయన ఏకీభవించారు. ఈ ఏడాది కూడా ఎగువన ఉన్న శ్రీరాంసాగర్, దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాంలకు నీరు రాలేదన్నారు. శ్రీరాంసాగర్‌కు 54 టిఎంసిల నీరొస్తే అందులో 45 టిఎంసిలు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. నీటి ఆవిరి, మిషన్ భగీరథ కేటాయింపులు పోను ప్రాజెక్టులో మరో 35 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. సింగూరు నుంచి విడుదల చేసిన 15 టిఎంసిల నీటిని మొదట నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌లోకి ఎత్తి పోసి, అక్కడి నుంచి పోచంపాడుకు మళ్లించడం జరిగిందన్నారు. వాస్తవం ఇలా ఉంటే అర్థం లేని, ఆలోచన లేని పార్టీలు ప్రజలను రెచ్చగొట్టి దాడులు చేయించడం, సరికాదన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో అనేక మార్లు సంప్రదింపులు జరిపిన ఫలితంగా డి 83 కాలువ ద్వారా శనివారం కమాన్‌పూర్ వరకు నీటిని తీసుకు వెళ్లగలిగామన్నారు. ఈ నెల 29 మధ్యాహ్నం 3 గంటలకు డి 86 కాలువకు నీరు వదిలి చివరి ఆయకట్టు వరకు నీటిని అందించే ఏర్పాటు చేస్తామన్నారు. జడ్‌పిటిసిలు, ఎంపిపిలకు 20 లక్షల చొప్పున, ఎంపిటిసిలకు 10 లక్షల చొప్పున ఎన్‌ఆర్‌జిఎస్ కింద నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. 14వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన రూ. 450 కోట్లను విడుదల చేశామని, ఈ నిధులు పొందేందుకు అర్హత ఉన్న వారందరికీ అవి త్వరలోనే అందుతాయన్నారు.

వంద రోజుల్లో చక్కెర కర్మాగారం తెరిపించాల్సిందే : రేవంత్‌రెడ్డి



మన తెలంగాణ/మెట్‌పల్లి: వంద రోజుల్లో చక్కర కర్మాగారాన్ని తెరిపించ కపోతే గ్రామాల్లో టిఆర్‌ఎస్ నాయకులను తిరగనివ్వమని కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 365 రోజులుగా కాంగ్రెస్ మాజీ ఎంఎల్‌ఎ కొమిరెడ్డి రాములు ఆధ్వర్యంలో మెట్‌పల్లి వెంకటరెడ్డి గార్డెన్‌లో రైతులు చేస్తున్న రిలే దీక్షలకు శనివారం రేవంత్‌రెడ్డి మద్దతు తెలిపారు. ముందుగా కొమిరెడ్డి నివాసం నుంచి భారీ మోటర్ సైకిల్ ర్యాలీ పట్టణ శివారులోని వెంకట్‌రెడ్డి గార్డెన్ వరకు సాగింది. ఈ సందర్భంగా చెరుకు రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ ఏర్పడినప్పటి నుంచి రైతులకు మాజీ ఎంఎల్‌ఎ కొమిరెడ్డి రాములు, జ్యోతక్కలు అండగా ఉండి పోరాటం చేశారని గుర్తుచేశారు. సిఎం కెసిఆర్ 100 రోజుల్లో చెరుకు ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. 100 రోజుల్లో ఫ్యాక్టరీని తెరిపించకుంటే 101 రోజున 30వేల మంది రైతులతో ఫ్యాక్టరీ ఎదుట బైఠాయించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి మాజీ ఎంఎల్‌ఎ విజయరమణరావు, మాజీ ఎంఎల్‌సి నర్సారెడ్డి, కొమిరెడ్డి కరం, రాజారాం యాదవ్, విజయ్ ఆజాద్, చెరుకు సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, కంది బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

వచ్చే ఎన్నికల్లో బిసిలకే రాజ్యాధికారం

మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్: బిసి భావజాలాన్ని వ్యాప్తి చేసి రాబోయే ఎన్నికల్లో రాజ్యాధికారం చేపట్టడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందితో బిసి సదస్సులు చేపట్టాలని నిర్ణయించినట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. జనాభాలో సగభాగం ఉన్న బిసిలలో ఓటు చైతన్యాన్ని తీసుకొచ్చి బిసిలంతా తమ అభ్యర్థికే ఓటు వేసే విధంగా అవగాహన సదస్సులు చేపట్టనున్నట్లు తెలిపారు. శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బిసి భవన్‌లో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని పార్టీలు బిసిలకు 50శాతం సీట్లు కేటాయిస్తూ బిసి డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని పాత జైల్‌ఖానాను జైళ్ల శాఖ మ్యూజియంగా మార్చిన విషయం తెలిసిందే. జైలు జీవితం ఎలా ఉంటుందోనని తెలుసుకోవాలనే వారికి కోసం జైళ్ల శాఖ డబ్బులు తీసుకొని ఒకటి, రెండ్రోజుల పాటు సాధారణ ఖైదీల్లా శిక్షను అమలు చేస్తోంది. ఇప్పటికే ఎంతోమంది ప్రముఖులు ఇలా జైలులో శిక్షను అనుభవించారు. ఇదిలా ఉంటే మలేషియాకు చెందిన కెన్(డెంటిస్ట్), కెల్విన్(రెస్టారెంట్ యజమాని) ఇంటర్నెట్‌లో జైలు మ్యూజియం వివరాలు తెలుసుకొని భారత్‌కు 5 రోజుల పర్యటనకు వచ్చారు. నేరుగా హైదరాబాద్ చేరుకొని అక్కడి నుంచి శనివారం సంగారెడ్డిలోని జైలు మ్యూజియం వచ్చి రెండ్రోజుల శిక్షను అనుభవిస్తామని నిబంధనలకు అంగీకరించారు. వీరికి జైలు సూపరింటెండెంట్ సంతోష్‌రాయ్ ఆధ్వర్యంలో సాధారణ ఖైదీల్లా దుస్తులు, భోజనం చేసే పాత్రలను అందజేశారు.

– మన తెలంగాణ/ సంగారెడ్డి టౌన్

మద్దతు స్వాహా!



మహారాష్ట్ర కందులు తెలంగాణ కొనుగోలు కేంద్రాలకు

- **వనపర్తి మార్కెట్ యార్డులో దళారులు, వ్యాపారుల హైటెక్ దందా**
- **నష్టపోతున్న జిల్లా రైతాంగం**

మన తెలంగాణ/వనపర్తి: వరుస కరువుతో అల్లాడిన రైతన్నకు ఈ ఏడాది కంది పంట కాస్త ఊరటనిచ్చింది. కంది రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే వనపర్తి జిల్లాలోనూ కూడా హాకా (హైద్రాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో పెబ్బేరు, మదనాపురం, వనపర్తి, మార్కెట్ యార్డుల్లో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ వాటిపై నిఘా లేకపోవడంతో రైతుల రూపంలో దళారులు, వ్యాపారులు ప్రభుత్వ మద్దతు ధరను స్వాహా చేస్తూ లక్షలు దండుకుంటున్నారు. మహారాష్ట్రలో కందుల ధర క్వింటాల్‌కు రూ.4500 వరకు పలుకుతోంది. రాష్ట్రంలో రూ.1000 ఎక్కువ పలకడంతో వ్యాపారుల కన్ను పడింది. ఇంకేముంది మహారాష్ట్ర నుంచి కందులను కొనుగోలు చేసి రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తూ లక్షలు వెనుకేసుకుంటున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన కందులకు ఇక్కడి రైతులకు చెందిన పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు సేకరించిన గంజ్ వ్యాపారస్తులు కందుల కొనుగోళ్ల కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లుగా నమోదు చేయించి నేరుగా హాకా గోదాంలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ఒక్కో క్వింటాల్‌కు రూ. 1000 నుంచి రూ. 1200 దాకా అక్రమంగా మద్దతు ధర ద్వారా సంపాదిస్తున్నారు. మహారాష్ట్ర నుండి వచ్చిన లారీలకు వే బ్రిడ్జిపై కాంటా చేయించి ఆ లెక్కకు సరిపడా ధ్రువపత్రాలను, వేబిల్లులను కందుల కొనుగోలు కేంద్రాల్లో సృష్టిస్తున్న వ్యాపారస్తులు నేరుగా హాకా గోదాంలకు మహారాష్ట్ర కందులను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా తరలించిన ఒక్కొ లారీ నుంచి వ్యాపారస్తులు రూ. 2 లక్షల నుంచి 2.5 లక్షల వరకు అక్రమంగా ప్రభుత్వ మద్దతు ధరను జేబులో వేసుకుంటున్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కూడా అధికారుల కళ్లు గప్పి వ్యాపారుల ఇలా హైటెక్ పద్ధతిన మోసం చేస్తున్నారు.



డిసెంబర్ 4 నుంచే కేంద్రాలు..

వనపర్తి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో డిసెంబర్ 4న వనపర్తి పిఎసిఎస్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జనవరి 25వ తేదీ నాటికి 9,749 బస్తాలకు గాను 4,874 క్వింటాళ్ల కందులను 401 మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని, రూ.2 కోట్ల 65 లక్షలు రైతులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసినట్లు సింగిల్ విండో అధికారులు చెబుతున్నప్పటికీ రైతుల ముసుగులో కొందరు వ్యాపారస్తులు కందులను విక్ర యించి భారీగా డబ్బు వెనకేసిన్నట్లు ఆరోపణలున్నాయి. ఇందులో కొందరికి అధికారుల మద్దతు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆశాభోంస్లేకు నేషనల్ యశ్‌చోప్రా మెమోరియల్ అవార్డు



టి.సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ 2013 నుండి నేషనల్ యశ్‌చోప్రా మెమోరియల్ అవార్డును సినీ ప్రముఖులకు అందజేస్తోంది. ఈసారి 2017కుగాను ఈ అవార్డును ప్రముఖ నేపథ్య గాయని, దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మవిభూషణ్ ఆశాభోంస్లేకు అందజేయబోతున్నారు. ముంబయ్‌లో సమావేశమైన టి.సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ జ్యూరీ సభ్యులు బోనీకపూర్, మధుర్ భండార్కర్, హనీ ఇరానీ, పద్మిని కొల్హాపురి, సుబ్బరామిరెడ్డిలు కలిసి ఆశాభోంస్లేను నేషనల్ యశ్‌చోప్రా మెమోరియల్ అవార్డుకు ఎంపికచేశారు. ఫిబ్రవరి 16న ముంబయ్‌లో జరిగే కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్‌రావు, లతామంగేష్కర్ చేతుల మీదుగా ఈ అవార్డును ఆశాభోంస్లే అందుకుంటారు. ఈ కార్యక్రమంలో అమితాబ్‌బచ్చన్, అమీర్‌ఖాన్, షారుఖ్‌ఖాన్, శ్రీదేవి, జయప్రద తదితరులు పాల్గొంటారు. ఇక 1933లో జన్మించిన ఆశాభోంస్లే పదేళ్ల ప్రాయంలోనే నేపథ్య గాయనిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. వేలాది గీతాలు ఆలపించిన ఆమె రెండుసార్లు ఉత్తమ గాయనిగా జాతీయ అవార్డును అందుకోవడంతో పాటు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ చోటు సంపాదించుకున్నారు.

ఇండస్ట్రీ గర్వించదగ్గ దర్శకుడు వి.వి. వినాయక్



నందమూరి బాలకృష్ణ, సాయిధరమ్‌తేజ్, వి.వి.వినాయక్, సి.కళ్యాణ్ తదితరులు

సాయిధరమ్ తేజ్ హీరోగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. పతాకంపై వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం టీజర్‌ను నందమూరి బాలకృష్ణ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సాయిధరమ్ తేజ్, వి.వి.వినాయక్, సి.కళ్యాణ్, రచయిత శివ ఆకుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ''సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మిస్తున్న నాలుగవ చిత్రమిది. వినాయక్ దర్శకత్వంలో ఇంతకుముందు 'చెన్నకేశవరెడ్డి' సినిమా చేశాను. మళ్లీ మన కాంబినేషన్‌లో సినిమా ఎప్పుడని ఆయనను అడుగుతుంటాను. ఇండస్ట్రీ గర్వించదగ్గ దర్శకుడు వి.వి.వినాయక్. ఆయన దర్శకత్వంలో మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన మరో నట వారసుడు సాయిధరమ్ తేజ్ హీరోగా రూపొందిన చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ సినిమా విషయానికొస్తే వినాయక్, శివ కాంబినేషన్‌లో ఎన్నో అద్భుతమైన సినిమాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చాలా బాగుంది. టీజర్ చూసిన తర్వాత సినిమా ఎప్పుడు చూడాలా అని అనిపిస్తుంది. టైటిల్ కూడా చాలా బాగుంది. ముఖ్యంగా యూత్‌కు ఈ సినిమా బాగా కనెక్ట్ అవుతుంది''అని అన్నారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ ''వినాయక్, నేను కలిసి ఓ సినిమా చేయాలని వినాయక్ నాన్నగారు కృష్ణకు ఓ కోరిక ఉండేది. ఇప్పుడు ఈ చిత్రంతో వినయ్ ఆ కోరికను తీర్చాడు. తేజు ఈ సినిమా ఎంతో కష్టపడి చేశాడు. 'ఇంటిలిజెంట్'తో మంచి హిట్ కొట్టబోతున్నాం''అని చెప్పారు. హీరో సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ ''కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడంలో బాలకృష్ణ ఎప్పుడు ముందు ఉంటారు. మా సినిమాకు ఆశీస్సులు అందించడానికి ఆయన రావడంతో అది మరోసారి నిరూపించబడింది''అని తెలిపారు. రచయిత శివ ఆకుల మాట్లాడుతూ ''భారతం, భాగవతాలను అవపోసన పట్టిన నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా ఈ టీజర్ రిలీజ్ కావడం ఆనందంగా ఉంది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమా కథను రూపొందించడం జరిగింది. సమస్యనైనా, సందేశాన్నయినా సరదాగా చెప్పాలని వినాయక్ ఎప్పుడూ అంటూ ఉంటారు. అలా వినోదాత్మకంగా సి.కళ్యాణ్ బ్యానర్‌లో ఈ సినిమాకు కథ, మాటలు అందించడం నాకు ఎతో సంతృప్తిని కలిగించింది. తప్పకుండా ఈ సినిమా విజయం సాధిస్తుంది''అని అన్నారు. ఇక ఫిబ్రవరి 4న 'ఇంటిలిజెంట్' ప్రీ రిలీజ్ వేడుకను రాజమండ్రిలోని గవర్న్‌మెంట్ ఆర్ట్స్ కాలేజీలో ఘనంగా నిర్వహించనున్నారు. సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి, నాజర్, బ్రహ్మానందం, పోసాని కృష్ణ మురళి, ఆకుల శివ, కాశీ విశ్వనాథ్, ఆశిష్ విద్యార్థి, షాయాజీ షిండే తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.వి.విశ్వేశ్వర్, సంగీతం: తమన్, ఎడిటింగ్: గౌతంరాజు, ఆర్ట్: బ్రహ్మ కడలి, ఫైట్స్: వెంకట్, డ్యాన్స్: శేఖర్, జాని.

ఫిబ్రవరి రెండవ వారంలోపే టీజర్



సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా టాప్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం '2.0'. ఈ చిత్రం టీజర్ గత ఏడాది నవంబర్‌లోనే విడుదలకావాల్సింది. కానీ జనవరి 25 నుంచి సినిమా విడుదల వాయిదా పడటంతో టీజర్ లాంచ్ కూడా ఆగిపోయింది. చిత్ర బృందం వేరే పనుల్లో పడిపోయింది. ఈమధ్య మలేషియాలో జరిగిన తమిళ నటుల స్టార్‌నైట్‌లో ఈ సినిమా టీజర్ లాంచ్ అన్నారు. కానీ అది జరుగలేదు. అయితే ఇప్పుడు టీజర్ విడుదలకు నిజంగానే ముహూర్తం దగ్గరపడింది. స్వయంగా దర్శకుడు శంకరే టీజర్ లాంచ్ గురించి హింట్ ఇచ్చాడు. ఇంకొన్ని రోజుల్లోనే టీజర్ విడుదల చేస్తామని శంకర్ ప్రకటించాడు. ప్రస్తుతం అమెరికాలో దీని కోసం వర్క్ జరుగుతోందని... అది పూర్తికాగానే టీజర్ విడుదలవుతుందని ఆయన చెప్పాడు. ఫిబ్రవరి రెండవ వారంలోపే ఈ కార్యక్రమం ఉంటుందని భావిస్తున్నారు. టీజర్ లాంచ్ హైదరాబాద్‌లోనే జరుగబోతుండటం విశేషం. ఈ కార్యక్రమంలో రజనీకాంత్‌తో పాటు మెగాస్టార్ చిరంజీవి, మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి, కొందరు బాలీవుడ్ తారలు పాల్గొంటారని సమాచారం. ఆడియో వేడుక తరహాలోనే ఈ కార్యక్రమాన్ని కూడా భారీ ఎత్తున నిర్వహిస్తారట. ఆపై మార్చిలో చెన్నై వేదికగా ట్రైలర్ విడుదల చేస్తారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 14న విడుదల చేయబోతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ రూ.450 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రంలో రజనీతో పాటు అక్షయ్ కుమార్, అమీ జాక్సన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నాడు.



అలివేలు, శ్యామలాదేవి, కృష్ణంరాజు, శ్రీకాంత్, కరణం బాబ్జీ, శివకృష్ణ

శ్రీకాంత్ మంచి నటుడే కాదు మంచి మనసున్న వ్యక్తి

శ్రీకాంత్, యజ్ఞశెట్టి హీరోహీరోయిన్లుగా అలివేలమ్మ ప్రొడక్షన్స్ పతాకంపై కరణం బాబ్జి దర్శకత్వంలో అలివేలు నిర్మిస్తున్న చిత్రం 'ఆపరేషన్ 2019'. 'బివేర్ ఆఫ్ పబ్లిక్' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రం టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రెబల్ స్టార్ కృష్ణంరాజు టీజర్ లాంచ్ చేసిన అనంతరం మాట్లాడుతూ ''శ్రీకాంత్ నాకు తమ్ముడిగా 'సింహగర్జన' సినిమాలో నటించాడు. ఆతర్వాత 'నాన్నకు పెళ్లి' చిత్రంలో నా కొడుకుగా చేశాడు. తను మంచి నటుడే కాదు మంచి మనసున్న వ్యక్తి కూడా. గతంలో చేసిన 'ఆపరేషన్ దుర్యోధన' చిత్రం తనకు మంచి పేరు తెచ్చింది. ఇప్పుడు చేస్తున్న 'ఆపరేషన్ 2019'టీజర్ కూడా చాలా బాగుంది. ఈ సినిమా టీజర్ చూస్తుంటే దర్శకుడు ఒక మంచి కాన్సెప్ట్‌తో సినిమా తీసినట్లు అనిపించింది. 'ఆపరేషన్ దుర్యోధన' చిత్రంలా శ్రీకాంత్‌కు ఈ సినిమా మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ''సింహ గర్జన, మా నాన్నకు పెళ్లి చిత్రాల్లో కృష్ణంరాజుతో కలిసి నటించిన దగ్గర నుంచి ఆయనతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. 'ఆపరేషన్ 2019' చిత్రం టీజర్ ఆయన చేతుల మీదుగా విడుదల కావడం సంతోషంగా ఉంది. గతంలో కరణం బాబ్జీ దర్శకత్వంలో 'మెంటల్ పోలీస్' చేశాను. కానీ టైటిల్ వివాదం, విడుదల సమస్యల వల్ల ఆ సినిమాకు అనుకున్నంత పేరు రాలేదు. ఈసారి వివాదం లేకుండా మంచి కంటెంట్‌తో సినిమా చేద్దామని కరణం బాబ్జీ ఈ కథ చెప్పాడు. సినిమా కంటెంట్ ఎంతో బావుంది. ఖచ్చితంగా అందరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంది''అని తెలిపారు. దర్శకుడు కరణం బాబ్జీ మాట్లాడుతూ ''శ్రీకాంత్‌తో నేను చేస్తున్న రెండవ చిత్రం 'ఆపరేషన్ 2019'. ఆయన అన్ని విధాలా నాకు సహకరిస్తున్నారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 6 వరకు చేయబోయే షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ఈ చిత్రంలో ఇద్దరు యంగ్ స్టర్స్ నటిస్తున్నారు. త్వరలో వారెవరన్నది ప్రకటిస్తాం''అని చెప్పారు. నిర్మాత అలివేలు మాట్లాడుతూ ''దర్శకుడు బాబ్జి మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీకాంత్ ఎంతో సహకరిస్తుండడంతో అనుకున్న విధంగా సినిమాను చేయగలుగుతున్నాం''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, శివకృష్ణ, నాగినీడు, దీక్షాపంత్, హరితేజ పాల్గొన్నారు.

ఘన విజయం దిశగా 'భాగమతి'



అనుష్క ప్రధాన పాత్రలో అశోక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భాగమతి'. యు.వి. క్రియేషన్స్ బ్యానర్‌లో రూపొందిన ఈ చిత్రం తాజాగా విడుదలై సక్సెస్‌ఫుల్‌గా థియేటర్లలో ఆడుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో చిత్ర దర్శకుడు అశోక్ మాట్లాడుతూ ''సినిమాకు మంచి ఓపెనింగ్స్ వస్తున్నాయి. హిట్ టాక్‌తో సినిమా థియేటర్లలో ఆడుతోంది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. అనుష్క అద్భుతంగా నటించిన ఈ సినిమాలో భాగమతి బంగ్లా హైలైట్‌గా నిలిచింది. సినిమా ఫస్టాఫ్ భయపెడుతూ సెకండాఫ్ థ్రిల్లింగ్‌గా అనిపించిందని ప్రేక్షకులు అంటున్నారు. ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ బంగ్లాను అద్భుతంగా డిజైన్ చేశాడు. కథను ఒకటికి నాలుగుసార్లు విని అతను బంగ్లాను డిజైన్ చేయడం జరిగింది. బిగ్ హిట్ దిశగా 'భాగమతి' దూసుకెళ్తోంది''అని అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ మాట్లాడుతూ ''ఇది వందశాతం టెక్నీషియన్ మూవీ. యువి క్రియేషన్స్ నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించారు. ఇందులో అనుష్క అద్భుతంగా నటించింది. దర్శకుడు అశోక్ చెప్పిన కథకు అనుగుణంగా బంగ్లాను భారీగా రూపొందించాను. పైరసీని ప్రోత్సహించకుండా ప్రేక్షకులు థియేటర్లలోనే సినిమాను చూడాలని కోరుతున్నాను''అని చెప్పారు.

వండర్‌ఫుల్ హీరో నాగశౌర్య



ఐరా క్రియేషన్స్ బ్యానర్‌లో నాగశౌర్య హీరోగా వెంకి కుడుముల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఛలో'. రష్మిక మండన్న హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని శంకర ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్నారు. మహతి స్వరసాగర్ సంగీతమందించిన ఈ చిత్రం పాటలు మ్యూజికల్ హిట్‌గా నిలిచాయి. ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు మహతి స్వర సాగర్ మాట్లాడుతూ '''ఛలో' సినిమాకు పనిచేసే వండర్‌ఫుల్ ఆఫర్‌ను ఇచ్చిన ఐరా క్రియేషన్స్ నిర్మాతలకు ధన్యవాదాలు. వండర్‌ఫుల్ హీరో నాగశౌర్య. సినిమాలో అతని పర్‌ఫార్మెన్స్ చాలా కొత్తగా,ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఈ సినిమాకు సంగీతమందించడంతో ఎంతో ఆనందంగా ఉంది. నాగశౌర్య వంటి హీరోను ఇంతవరకు చూడలేదు. అతను ఎంతో అద్భుతంగా ఈ సినిమాలో నటించాడు. దర్శకుడు వెంకి కుడుముల సినిమాను చక్కగా డైరెక్ట్ చేశాడు. సినిమా ఔట్‌పుట్ ఎంతో బాగా వచ్చింది. ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందన్న నమ్మకముంది. ఫిబ్రవరి 2న వస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది''అని అన్నారు.



స్టార్ డైరెక్టర్ సురేందర్ రెడ్డితో కె.ఎం.డి.రఫీ, రెడ్డం రాఘవేంద్ర రెడ్డి, కోటేంద్ర దుద్యాల తదితరులు

'బంగారి బాలరాజు' గ్లిట్టర్ విడుదల

నంది క్రియేషన్స్ బ్యానర్‌పై 'బంగారి బాలరాజు' చిత్రంతో కె.ఎం.డి.రఫీ, రెడ్డం రాఘవేంద్ర రెడ్డి నిర్మాతలుగా, కోటేంద్ర దుద్యాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా గ్లిట్టర్‌ను స్టార్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ''ఈ సినిమా టీజర్ చూశాను. చాలా బాగుంది. ఈ చిత్ర దర్శకుడు, నిర్మాతలకు మంచి సక్సెస్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను''అని చెప్పారు. నిర్మాతలు కె.ఎం.డి.రఫీ, రెడ్డం రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ''సురేందర్ రెడ్డి మా సినిమా టీజర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఆయన 'సైరా' సినిమాలో బిజీగా ఉన్నప్పటికీ మాకు సమయం కేటాయించి టీజర్ విడుదల చేశారు''అని అన్నారు. దర్శకుడు కోటేంద్ర దుద్యాల మాట్లాడుతూ ''మాలాంటి కొత్త దర్శకులకు సురేందర్ రెడ్డి ఆదర్శంగా ఉంటూ ప్రోత్సహిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను ఫిబ్రవరి 14న, సినిమాను మార్చిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాము''అని తెలిపారు. రాఘవ్, కరాణ్య కత్రీన్, మీనా కుమారి, దూకుడు శ్రవణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జి.ఎల్.బాబు, సంగీతం: చిన్నికృష్ణ, చిట్టిబాబు రెడ్డిపోగు, ఆర్ట్: కృష్ణ మాయ.

అన్ని రకాల భావోద్వేగాలతో...

సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై దర్శకుడు వి.జె.రెడ్డి రూపొందిస్తున్న చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. సి.హెచ్.రఘునాథ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో సతీష్ రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రభాస్ శ్రీను, అంబటి శీను, సమ్మెట గాంధీ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గురురాజ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ఫిలిం ఛాంబర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ దర్శకులు సాగర్, రేలంగి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరై ఆడియోను విడుదల చేశారు. అనంతరం దర్శకుడు వి.జె.రెడ్డి మాట్లాడుతూ ''పల్లె వాతావరణంలో ఆహ్లాదకరమైన కథా కథనాలతో 'నెల్లూరి పెద్దారెడ్డి' చిత్రం సాగుతుంటుంది. నెల్లూరు నుంచి ఖమ్మం జిల్లా సీతారాంపురం అనే గ్రామానికి వలస వచ్చిన పెద్దారెడ్డి అనే వ్యక్తి కథ ఇది. ఆ గ్రామంలోని వాళ్లంతా నెల్లూరి పెద్దారెడ్డిని గౌరవిస్తుంటారు. నలుగురికి మంచి చేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈ క్రమంలో అతనికి అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యవసానంగా కథ ఎలాంటి మలుపులు తిరిగింది అనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. అన్ని రకాల భావోద్వేగాలతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి కావస్తున్నాయి. రెండు, మూడు రోజుల్లో ఫస్ట్ కాపీ సిద్ధమవుతుంది. సెన్సార్ పూర్తిచేసి ఫిబ్రవరిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని ప్రయత్నాలు చేస్తున్నాం''అని అన్నారు. కథానాయకుడు సతీష్ రెడ్డి మాట్లాడుతూ ''ఈ చిత్రం ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతిని అందిస్తుంది. సినిమా షూటింగ్‌ను 28 రోజుల్లోనే పూర్తిచేశాం. నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా పూర్తవుతున్నాయి. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వస్తాం'' అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బాలసుబ్రమణ్యం, మాటలు: సంజీవ్ మేగోటి, ఎడిటింగ్: మేనగ శీను, సంగీతం: గురురాజ్, డ్యాన్స్: గోరా మాస్టర్.





'శీలవతి' ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమంలో షకీలా, గీతాంజలి, సాయిరాం దాసరి, రాఘవ ఎం.గణేష్, వీరు బాసింశెట్టి

'శీలవతి'గా షకీలా

జీ స్టూడియోస్ పతాకంపై షకీలా హీరోయిన్‌గా సాయిరాం దాసరి దర్శకత్వంలో రాఘవ ఎం.గణేష్, వీరు బాసింశెట్టిలు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'శీలవతి'. ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ఇటీవలే షూటింగ్ పూర్తిచేసుకుంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సాయిరాం దాసరి మాట్లాడుతూ ''మా హీరోయిన్ షకీలాకు ఇది 250వ చిత్రం. కేరళలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాము. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. సంగీతానికి ప్రాధాన్యమున్న చిత్రమిది. ప్రజ్వల్ క్రిష్ అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు. తప్పకుండా ఈ చిత్రం ప్రతి ఒక్కరిని ఆలోచింపచేస్తుంది''అని అన్నారు. నిర్మాతల్లో ఒకరైన రాఘవ ఎం.గణేష్ మాట్లాడుతూ ''ఊహించిన దానికంటే ఈ చిత్రం బాగా వచ్చింది. సినిమా పోస్ట్ ప్రొడక్షన్‌ను ప్రారంభిస్తున్నాము. ఏప్రిల్‌లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో షకీలా, నిర్మాత వీరు బాసింశెట్టి పాల్గొన్నారు. గీతాంజలి, లడ్డు, అశోక్‌బాబు తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: తరుణ్ కరమ్‌తోత్, డైలాగ్స్: యష్ యాదవ్.



దిగివస్తున్న బంగారం ధర

న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా పరుగులు పెడుతున్న బంగారం ధర దిగివచ్చింది. శనివారం 10 గ్రాముల పసిడి ధర రూ.250 తగ్గి రూ.31, 200కు చేరింది. పెళ్లిళ్ల సీజన్ దగ్గర పడుతుండటంతో బంగారం ధర రెండు రోజుల క్రితం 14 నెలల గరిష్ఠానికి చేరుకుంది. అయితే అంతర్జాతీయంగా ధర పెరిగినా.. స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ లేకపోవడంతో దేశీయ విపణిలో ధర పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో 0.15శాతం పెరిగి ఔన్సు ధర 1,349.30 డాలర్లుగా ఉంది. మరోవైపు వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. పారిశ్రామిక వర్గాల నుంచి కొనుగోళ్లు తగ్గడంతో కిలో వెండి ధర రూ.41వేల కిందకు పడిపోయింది. కిలో ధర రూ. 350 తగ్గడంతో రూ. 40,650గా ఉంది. మరోవైపు అంతర్జాతీయంగా 0.72శాతం పెరిగి ఔన్సు వెండి 17.38డాలర్లు పలికింది.

ఎయిర్‌టెల్ రూ.149 ప్లాన్

న్యూఢిల్లీ: జియోకు పోటీగా భారతీ ఎయిర్‌టెల్ ఏమాత్రం తగ్గకుండా ఆఫర్ల మీద ఆఫర్లు గుప్పిస్తోంది. ఎయిర్‌టెల్ మరోసారి రూ.149 ప్లాన్ సవరించింది. ఈ ప్లాన్ కింద అపరిమిత కాల్స్‌తో పాటు 1 జిబి డేటాను అందిస్తోంది. 28 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఈ ప్లాన్‌లో అందిస్తున్నారు. జియోలో కూడా రూ.149 ప్లాన్‌లో రోజుకు 1జిబి డేటాను గతంలో ఇవ్వగా ఇప్పుడు దాన్ని రోజుకు 1.5జిబి చేసింది.

పన్ను రేట్లలో మరింత హేతుబద్ధీకరణ



న్యూఢిల్లీ: జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను)తో పరిస్థితులు స్వల్ప కాలంలోనే నిలకడ స్థితికి చేరాయని, భవిష్యత్‌లో పన్ను రేట్లలో మరింత హేతుబద్ధీకరణకు ఇది దోహదం చేస్తుందని, అదే విధంగా పన్ను పరిధి విస్తృతం కానుందని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. దేశంలో పరోక్ష పన్ను వ్యవస్థలో జిఎస్‌టి సమూల మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో జిఎస్‌టితో అత్యంత తక్కువ సమయంలో పరిస్థితులు సర్దుకున్నాయని, వ్యవస్థలో హేతుబద్ధీకరణ కొనసాగుతుందని అన్నారు. ప్రస్తుతం జిఎస్‌టి నాలుగు రేట్లు 5, 12, 18, 28 శాతాలుగా ఉన్నాయి. అలాగే బడ్జెట్–2018లో భారీ పన్ను సంస్కరణలపై కేంద్ర ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. పన్ను సంస్కరణలను తీసుకురానున్నామని జైట్లీ శనివారం ప్రకటించారు. కొంతమంది ప్రజలకు ఎక్కువ మొత్తంలో పన్నులు విధిస్తున్నారని, ఈ ప్రక్రియను మార్చాల్సి ఉందని మంత్రి అన్నారు. ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పరోక్ష పన్నుల విధానాన్ని జిఎస్‌టి పూర్తిగా మార్చివేసిందన్నారు. జనవరి 29న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సోమవారం, జనవరి 29 మధ్యాహ్నం, ఈ ఏడాది ఆర్థిక సర్వే ఆఫ్ ఇండియా పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్నామని ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ట్విట్టర్‌లో వెల్లడించారు. కాగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్ సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆదివారం సమావేశం కానున్నారు. దేశాధ్యక్షుడు రామనాథ్ కోవింద్ తొలిసారి పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.



ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే కార్యక్రమంలో జైట్లీ

జిఎస్‌టి తగ్గించాలి : సేవల రంగం

జిఎస్‌టి భారాన్ని తగ్గించాలని సేవా రంగంలోకి పరిశ్రమలు ముక్తకంఠంతో కోరుతున్నాయి. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో పర్యాటకం, టెలికామ్, టెక్ రంగాలకు ప్రోత్సాహం అందించేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో సేవా రంగానిదే అత్యధిక వాటా.. జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)లో 54 శాతం వాటా కలిపి దేశంలోకి పెద్ద ఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షిస్తోంది.
ఇలా దేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్న సేవారంగ పరిశ్రమలో పర్యాటక రంగం ముఖ్యమైంది.. ఈ రంగంలో ఇప్పటికే 4 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. రానున్న దశాబ్దంలో మరో కోటి ఉద్యోగాల సృష్టికి అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భారత్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా విస్తృత చర్యలు చేపడుతోంది.

25న సామ్‌సంగ్ కొత్త ఫోన్లు!



న్యూఢిల్లీ: సరికొత్త సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్9, గెలాక్సీ ఎస్9 ప్లస్ ఫోన్లను ఫిబ్రవరి 25న లాంఛ్ చేయనున్నట్టు తెలుస్తోంది. బార్సిలోనలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు మొబైల్ వరల్డ్ కాంగ్రెస్(ఎండబ్ల్యుసి) జరగనుంది. దీనికి ముందే ఈ కొత్త ఫోన్లను విడుదల చేయనుందని సమాచారం.. ఈ ఫోన్ల విడుదలపై అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అయితే సామ్‌సంగ్ తన గెలాక్సీ అన్‌ప్యాక్డ్ 2018 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృష్ట్యా కచ్చితంగా ఎస్9 సిరీస్ ఫోన్లను అదే ఈవెంట్‌లో విడుదల చేయవచ్చని తెలుస్తోంది. ఈ ఫోన్లకు చెందిన స్పెసిఫికేషన్లు, ఇమేజ్‌లు నెట్‌లో లీకయ్యాయి. వాటి ప్రకారం ఆయా ఫోన్లలో లభ్యం కానున్న ఫీచర్ల వివరాలు ఇలా ఉన్నాయి. 5.8 ఇంచ్ క్వాడ్ హెచ్‌డి ప్లస్ సూపర్ అమోలెడ్ ఇన్ఫినిటీ డిస్‌ప్లే, ఆక్టాకోర్ స్నాప్ డ్రాగన్ 845 ప్రాసెసర్, 4 జిబి ర్యామ్, 64 జిబి స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో, హైబ్రిడ్ డ్యుయల్ సిమ్, 12 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా, 8 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఐపి 68 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్, బారోమీటర్, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, హార్ట్ రేట్ సెన్సార్, ఐరిస్ సెన్సార్, ప్రెషర్ సెన్సార్, 4జి వోల్ట్, డ్యుయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 5.0, ఎన్‌ఎఫ్‌సి, 3000 ఎంఎహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ చార్జింగ్, వైర్‌లెస్ చార్జింగ్ ఫీచర్లు శాంసంగ్ గెలాక్సీ ఎస్9 ఫోన్‌లో ఉండనున్నట్టు సమాచారం. ఈ వివరాలను సామ్‌సంగ్ త్వరలో అధికారికంగా ప్రకటించనుంది.



శనివారంనాడు న్యూఢిల్లీలో సిఎస్‌సి ఉమెన్ నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, తదితరులు


బడ్జెట్‌పైనే ఇన్వెస్టర్ల దృష్టి




ముంబై: వచ్చే వారం దేశీయ స్టాక్‌మార్కెట్లకు అత్యంత కీలకం.. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పైనే ఇన్వెస్టర్ల దృష్టి నెలకొంది. బడ్జెట్ అంశాలే స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించనున్నాయి. ఫిబ్రవరి 1న(గురువారం) ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రకటించనున్నారు. దీంతో బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు ప్రకటించనున్నారోనని ఇన్వెస్టర్లు ఎదురు చూస్తున్నారు. బిజెపి ప్రజారంజక బడ్జెట్‌కు తెరతీయవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. ప్రధాని మోడీ ఇటీవలే వృద్ధికి మాత్రమే ప్రాధాన్యమివ్వనున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మినీ బడ్జెట్‌గా భావించే ఆర్థిక సర్వే విడుదలకానుంది. సమావేశాలు జనవరి 29న ప్రారంభమై ఫిబ్రవరి 9న ముగియనున్నాయి. ఆదాయ పన్ను సహా ప్రత్యక్ష పన్నుల్లో చేపట్టనున్న మార్పులపై ప్రధానంగా ఇన్వెస్టర్లు దృష్టిని కేంద్రీకరించారు. ఇప్పటికే కార్పొరేట్ పన్ను తగ్గింపునకు డిమాండ్లు పెరిగాయి. ఐటీ, ఆటో, రియల్టీ తదితర పలు రంగాలు పన్ను రాయితీలను కోరుతున్నాయి. వచ్చే వారం పలు బ్లూచిప్ కంపెనీలు ఈ ఏడాది క్యూ3 ఫలితాలు విడుదల చేయనున్నాయి. పలు కంపెనీలు ఈ వారంలో మూడో త్రైమాసికం (అక్టోబర్–డిసెంబర్) పనితీరును ప్రకటించనున్నాయి. ఈనెల 29నహెచ్‌డిఎఫ్‌సి, టెక్‌మహీంద్రా, ఐడిఎఫ్‌సి.. అలాగే ఈనెల 30న ఐఒసి, ఈనెల 31న ఐసిఐసిఐ, ఎల్ అండ్ టి, వేదాంతా, ఎన్‌టిపిసి, ఫిబ్రవరి 2న బజాజ్ ఆటో, హిందాల్కో ఫలితాలు ఉన్నాయి. జనవరి నెలకు వాహన విక్రయ గణాంకాలు వెల్లడికానుండటంతో వచ్చే వారం ఆటో రంగ కౌంటర్లు వెలుగులో నిలిచే అవకాశముంది. వచ్చే మంగళ, బుధవారాల్లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమీక్ష ను చేపట్టనుంది. డిసెంబర్ పాలసీ సమీక్షలో ఫెడ్ వడ్డీ రేట్లను 0.25 శాతం పెంచిన సంగతి తెలిసిందే.

రికార్డులు ఇలాగే కొనసాగుతాయా?

ఈక్విటీ మార్కెట్‌లో ఏ క్షణాన ఏమి జరుగుతుందో చెప్పలేం.. ప్రస్తుత సూచీలు రికార్డు పరంపరం కొనసాగిస్తూ చరిత్ర సృష్టిస్తున్నాయి. స్టాక్‌లు ఎక్కువ రేటుతో స్టాక్‌లు ట్రేడవుతున్నాయి. ఈ రికార్డులు ఇలాగే కొనసాగుతాయా? అంటే చెప్పలేమని, ప్రతికూల పరిస్థితులు వస్తే మార్కెట్ ఢమాల్ అనడం ఖాయమని అంటున్నారు. ప్రస్తుతానికైతే సానుకూల పరిస్థితులు మెండుగా ఉండడంతో బుల్ ర్యాలీ కొనసాగుతోందని వారు అంటున్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం స్టాక్ మార్కెట్లకు సెలవు కావడంతో మార్కెట్లు పనిచేయలేదు. మరోవైపు డెరివేటివ్ సిరీస్ ఈనెల 25(గురువారం) ముగిసింది.
గత వారంలో దేశీ స్టాక్ మార్కెట్లు సరికొత్త గరిష్ఠాల రికార్డులను సాధించాయి. మార్కెట్ చరిత్రలో తొలిసారి సెన్సెక్స్ 36,000 పాయింట్ల మైలురాయిని అందుకోగా, నిఫ్టీ 11,000 పాయింట్ల మార్క్‌ను సులభంగా అధిగమించింది. గత వారం సెన్సెక్స్ 539 పాయింట్లు(1.5 శాతం) ఎగసి 36,050 వద్ద నిలిచింది. నిఫ్టీ 175 పాయింట్లు(1.6 శాతం) పెరిగి 11,070 వద్ద స్థిరపడింది. చిన్న షేర్లలో అమ్మకాల వైపు మొగ్గుచూపడంతో బిఎస్ఇలో మిడ్ క్యాప్ సూచీ కేవలం 0.4 శాతం లాభపడింది. స్మాల్ క్యాప్ 0.6 శాతం తిరోగమించింది. ఎన్ఎస్ఇ జనవరి డెరివేటివ్స్ గత 22 నెలల్లోనే అత్యధిక రిటర్నులు ఇచ్చిన సిరీస్‌గా నిలిచింది.
జనవరి సిరీస్‌లో నిఫ్టీ 579 పాయింట్లు(5.5 శాతం) లాభపడగా, బ్యాంక్ నిఫ్టీ 1950 పాయింట్లు(7.6 శాతం) జంప్ చేసింది. ముఖ్యంగా బ్యాంకుల రీకాపిటలైజేషన్ ప్రకటనతో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అమ్మకాల తీవ్రత నెలకొంది. కాగా అమెరికా డోజోన్స్ కొత్త రికార్డు స్థాయి వద్ద ముగిసినా, శుక్రవారం ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. మూడేళ్ల కనిష్ట ధరకు పతనమైన డాలర్ పుంజుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న చర్యల నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిసాయి. జపాన్ సూచి నికాయ్ స్వల్ప నష్టంతో ముగియగా, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ ఇండెక్స్ 500 పాయింట్ల భారీ ర్యాలీతో 33,000 పాయింట్ల స్థాయిని అధిగమించింది.



409 బిలియన్ డాలర్లకు పెరిగిన ఫారెక్స్ నిల్వలు



కోల్‌కతా: దేశీయ విదేశీ మారక నిల్వలు(ఫారెక్స్) సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. వరుసగా నాలుగో వారం జీవితకాల గరిష్ట స్థాయికి చేరాయి. ఆర్‌బిఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జనవరి 19తో ముగిసిన వారానికి ఫారెక్స్ నిల్వలు 959 బిలియన్ డాలర్ల పెరిగి 414.784 బిలియన్ డాలర్ల(రూ.26.47లక్షల కోట్లు)కు చేరాయి. గత వారం ఈ నిల్వలు 413.825 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. విదేశీ మారకపు నిల్వల్లో ప్రధానమైన విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సిఎ) వృద్ధి.. ఇందుకు కారణమని ఆర్‌బిఐ తెలిపింది. ఈ వారంలో ఎఫ్‌సిఎలు 934.6 మిలియన్ డాలర్లు పెరిగి 390.768 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని ఆర్‌బిఐ వెల్లడించింది. బంగారం నిల్వలు 20.421 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయంగా ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ విలువ 10.4 మిలియన్ డాలర్లు పెరిగి రూ.1.531 బిలియన్ డాలర్‌గా నమోదయ్యాయి.

ఉపాధిని సృష్టించే ఆర్థిక వృద్ధి కావాలి

ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రాజన్




న్యూఢిల్లీ : మౌలికసదుపాయాలు, నిర్మాణం వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉందని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ పేర్కొన్నారు. ఉపాధి కల్పన కోసం భారీ మౌలికసదుపాయ ప్రాజెక్టులను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఐఎంఎఫ్(అంతర్జాతీయ ద్రవ్య నిధి) ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి దేశంగా భారత్‌ను పేర్కొనడంపై రాజన్ స్పందిస్తూ.. ఆర్థిక వృద్ధి ఉపాధి కల్పన దిశగా బదిలీ కావాలని అన్నారు. యువత ఉపాధి అవకాశాలు సృష్టించే దిశగా వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత వృద్ధి ఉపాధి అవకాశాలు సృష్టిస్తుందా? అని ఆయన ప్రశ్నించారు. డీమానిటైజేషన్(నోట్ల రద్దు) కారణంగా భారత్ వృద్ధి రేటు మందగించిందని, అయితే భవిష్యత్‌లో 8 శాతం జిడిపిని సాధించే సత్తా భారత్‌కు ఉందని రాజన్ పేర్కొన్నారు. ఆధార్ డేటా గోప్యత రక్షణ కోసం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందా? అని ప్రశ్నించగా రాజన్ స్పందిస్తూ.. అలాంటిదేమీ లేదని, అంతా సురక్షితంగానే ఉందని, ఈ విషయాన్ని మనమంతా నమ్మాలని అన్నారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ అధికార యంత్రాంగం మరింతగా కేంద్రీకృతమైందని, ఉద్యోగిస్వామ్యాన్ని కేంద్రం పక్కనబెట్టడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కాగా దావోస్ డబ్ల్యుఇఎఫ్(వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్)లో పాల్గొన్న రాజన్ ఇంతకుముందు ఉర్జిత్ పటేల్ నేతృత్వంలోని ఆర్‌బిఐ పనితీరుపై అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని ఎంపిసి(ద్రవ్య విధాన కమిటీ)ని ఆయన ప్రశంసించారు. వడ్డీ రేట్లను గరిష్ఠ స్థాయిలోనే కొనసాగించ వల్ల ప్రభుత్వ సలహాదారుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న ఎంపిసి పట్ల విశ్వాసం వ్యక్తం చేశారు. ఆరుగురు సభ్యుల ఎంపిసి ఉత్తమ పనితీరును ప్రదర్శిస్తోందని, ద్రవ్యోల్బణం విషయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. అత్యధిక ద్రవ్యోల్బణ ఒత్తిడితో బాధపడుతున్న దేశాలకు ధరల లక్ష్యాలు వినియోగకరమని, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సాయం లేకుండా ముందుకెళ్లలేమన్న విషయాన్ని పాశ్చాత్య దేశాలు గుర్తించాలని రాజన్ అన్నారు. పాశ్చాత్య దేశాల ఉత్పత్తులకు అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచే డిమాండ్ ఎక్కువగా ఉంటుందని గమనించాలని, అభివృద్ధి చెందుతున్న దేశాల అండ లేకుండా పాశ్చాత్య దేశాలు ఎంతోకాలం మనుగడ సాధించలేని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు సాధించే ప్రయోజనాలను కూడా వర్ధమాన దేశాలతో పంచుకోవాలని, పాశ్చాత్య దేశాల దృక్ప థం వీలైనంత త్వరగా మంచిగా మారాలని, లేదంటే ఈ ముక్కలైన ప్రపంచంలో ఏర్పడే సమస్యలను ఎవరూ పరిష్కరించలేరని అన్నారు. ఆదాయ అసమానతల వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి సింగపూర్ లాంటి దేశాలు కొన్ని చర్యలు చేపడుతున్నాయని రాజన్ తెలిపారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్

బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	29220	31251.34	0%
ముంబై	29950	32032.09	0%
ఢిల్లీ	29600	31657.75	0%
కోల్‌కతా	30170	32267.38	0.03%
కేరళ	28150	30106.95	0%
బెంగళూరు	28650	30641.71	–0.35%
హైదరాబాద్	29270	31304.81	–0.17%
గల్ఫ్	1431.02	1530.50	–0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42000.00	42000.00	0.00
ముంబై	42000.00	42000.00	0.00
ఢిల్లీ	42000.00	42000.00	0.00
కోల్‌కతా	42000.00	42000.00	0.00
హైదరాబాద్	42000.00	42000.00	0.00

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	380	విశాఖపట్నం	402
వరంగల్	382	చిత్తూరు	388
విజయవాడ	397	చెన్నై	395
గోదావరి	397	బెంగళూరు	390

అవినీతితో యుద్ధం గెలవాలంటే ప్రజలు మారాలి: రాజ్‌నాథ్



న్యూఢిల్లీ: అవినీతిని రూపుమాపడానికి విధానపరమైన సంస్కరణలు చాలవని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం నాడు అన్నారు. ఈ బెడద నివారణకు ప్రజలు కూడా తమ అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. 'ఆన్ ది ట్రయిల్ ఆఫ్ ది బ్లాక్' అనే పుస్తకం ఆవిష్కరిస్తూ ఆయన ఈ విధంగా పేర్కొన్నారు. అవినీతిపై ప్రధాని నరేంద్ర మోడీ ఉద్దేశాలను శంకించలేమని, ఆయన దేశం నుంచి అవినీతిని తరిమేయడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.అవినీతిని తరిమివేయకుండా మనం పేదరికం, ఇతర సమస్యలతో ఎలా పోరాడగలమని ప్రైవేటు సంభాషణల్లో ప్రధాని మోడీ అనేవారని హోం మంత్రి చెప్పేవారు. నల్లధనాన్ని బయటకు తీయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు తన తొలి మంత్రివర్గ సమావేశంలో సుప్రీంకోర్టు ఆదేశించిన మేరకు నిర్ణయించారని రాజ్‌నాథ్ తెలిపారు. అవినీతి నిర్మూలన జరగనిదే అభివృద్ధి యజ్ఞం ఫలించడం జరగదనడం యదార్థమని చెప్పారు. ఆదాయాల్లో వ్యత్యాసాలు పెరిగినప్పుడు సామాజిక అశాంతి పెరగకతప్పదని మనందరం అంగీకరించాలని ఆయన అన్నారు. ఇది మనందరకు ఆందోళనకరమన్నారు. బినామి ఆస్తుల చట్టం ద్వారా అవినీతితో మోడీ పోరాడుతున్నారని రాజ్‌నాథ్ వివరించారు.

అన్ని పార్టీల సభా నాయకులతో నేడు లోక్‌సభ స్పీకర్ భేటీ

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశం జరగనున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పక్షాల సభా నాయకులతో ఆదివారం లోక్‌సభ స్పీకర్ సుమిత్ర మహాజన్ సమావేశం నిర్వహించనున్నారు. బడ్జెట్ సమావేశంలో ట్రిపుల్ తలాక్ సహా వివిధ అంశాలపై ప్రతిపక్షాలు, అధికార పక్షంతో తలపడనున్నాయి. ఇలాంటి సమావేశాన్నే ప్రభుత్వం కూడా ఆదివారం నిర్వహించబోతున్నది. అందులో ప్రధాని నరేంద్ర మోడీ, ప్రధాన ప్రతిపక్ష నేతలు వివిధ అంశాలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేయనున్నారని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల తొలి విడత జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరగనున్నది. ఇందులో ప్రభుత్వం జనవరి 29న ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నది. తర్వాత కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెడతారు. ఉభయసభ(లోక్‌సభ, రాజ్యసభ) సభ్యులనుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసగించాక సమావేశం ఆరంభం కానున్నది. తొలి విడత సమావేశం తర్వాత పార్లమెంటు మళ్లీ మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు తదుపరి సమావేశం అవుతుంది. బడ్జెట్ సమావేశంలో ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ బిల్లును, ఒబిసి కమిషన్‌కు రాజ్యాంగ హోదాను కోరే బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.

తత్కాల్‌లో పాస్‌పోర్టుకు నిబంధనలు సడలించిన ప్రభుత్వం



న్యూఢిల్లీ: తత్కాల్‌లో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసేందుకు ఉన్న నిబంధనల్లో కేంద్రం కొన్నింటిని సడలించింది. దరఖాస్తు సమయంలో ఉన్నతాధికారి సిఫార్సు తప్పనిసరి కాదంటూ కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తత్కాల్‌లో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరగనుందని, అత్యవసర సమయాల్లో దరఖాస్తు చేసుకునే వారికి తొందరగా పాస్‌పోర్టు లభించేలా సడలించిన నిబంధన మరింత ఉపయోగకరంగా ఉంటుందని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నిబంధన 2018 జనవరి 25 నుంచి అమల్లోకి వస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'భారత ప్రభుత్వం దేశ ప్రజలను పూర్తిగా విశ్వసిస్తోంది. ప్రజలకు అనుకూలంగా పాలసీలు ఉండాలనే నేపథ్యంలో మంత్రిత్వ శాఖ ఇలాంటి నిర్ణయం తీసుకుంది' అని విదేశీ వ్యవహారాలు, విదేశాల్లో భారత వ్యవహారాల కార్యదర్శి జెడి ధ్యానేశ్వర్ ములే పేర్కొన్నారు. దరఖాస్తుదారులు అన్ని సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే మరే ఇతర మధ్యవర్తుల సిఫార్సులు అవసరం ఉండదని, కేవలం మూడు రోజుల్లో పాస్‌పోర్టు జారీ చేస్తామన్నారు.

స్థానే రైల్వే పత్రాల్లో 'దివ్యాంగులు'

న్యూఢిల్లీ: వికలాంగులకు బదులు 'దివ్యాంగులు' అనే పదాన్ని ప్రధాని మోడీ సూచించిన రెండేళ్ల తర్వాత భారతీయ రైల్వేస్ అటువంటి వారికి ఇచ్చే రాయితీ పత్రాలలో ఆ మేరకు మార్పులు చేయాలని నిర్ణయించింది. 'వికలాంగులు' నుంచి 'దివ్యాంగులు' కు జాతీయ రైల్వే వ్యవస్థ రాయితీ పత్రాల్లో ప్రత్యేక అవసరాలు కావలసిన వారికి పేరు మార్చడం జరుగుతుంది. రైల్వే మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. కంటి చూపు లేని వారిని 'గుడ్డివారు' అనకుండా దివ్యాంగులు పదాన్ని వాడతారు. అలాగే 'మూగ, చెమిటి', ఇతరత్రా అంగవైకల్యం గల వారికి కూడా అదే పదం వాడతారు. ఫిబ్రవరి ఒకటి నుంచి కొత్త ఉత్తర్వు అమలులోకి వస్తుంది.

ఎస్‌బిఐకి కోర్టు మందలింపు

ముంబయి: ఎటిఎంలో విత్ డ్రా విఫలమైనప్పటికీ ఖాతా నుంచి ఆ డబ్బును డెబిట్ చేసిన ఘటనలో మహారాష్ట్రలోని విదర్భా ప్రాంతానికి చెందిన అకోలా జిల్లా వినియోగదారులు ఫోరమ్ మందలించడమే కాకుండా రూ. 3000 ఖాతాదారుడికి పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. అన్యాయంగా డెబిట్ చేసిన రూ. 5000 తిరిగి చెల్లించడమే కాక, వ్యాజ్యపు ఖర్చుల కింద రూ. 2000 కూడా చెల్లించాలని తీర్పు చెప్పింది. 2017 జనవరిలో తన ఖాతా నుంచి అన్యాయంగా రూ. 5000 డెబిట్ చేసినందుకు ప్రదీప్ షిత్రే వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించడంతో ఎస్.ఎం. ఉంత్వలే, భారతి కేత్కర్‌లతో కూడిన ఫోరమ్ ఈ తీర్పునిచ్చింది. ఎస్‌బిఐ తరఫున ఎవరూ హాజరు కాకపోవడంతో ఎక్స్‌పార్టీ తీర్పును వెలువరించింది. 51 ఏళ్లున్న షిత్రే ఎటిఎం నుంచి రూ. 5000 విత్‌డ్రా చేయాలనుకున్నప్పుడు క్యాష్ రాలేదు, సరికదా ఖాతా నుంచి రూ. 10,000 డెబిట్ అయినట్లు టెక్స్ట్ మెసేజి వచ్చింది. ఈ విషయాన్ని ఆయన బ్యాంకు వద్దకు తీసుకెళ్లాక ఆ డబ్బు రీఫండ్ చేస్తామనైతే హామీ ఇచ్చారేగాని అలాగేమి చేయకపోగా, ఆయన రెండు లావేదేవీలు విజయవంతం అయినట్లు ఆగస్టులో లేఖ రాసింది. దాంతో ఆయన చేసేదేమీ లేక వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించారు. బ్యాంకు తరఫున ఎవరూ హాజరుకాకపోవడం, సిసిటివి ఫుటేజీని సమర్పించకపోవడంతో ఫోరమ్ వినియోగదారుడికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

'పద్మావత్' థియేటర్‌పై బాంబు

చెన్నై: వివాదాస్పద బాలీవుడ్ చిత్రం పద్మావత్ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబు విసిరారు. స్థానిక కొత్త బస్టాండు సమీపంలో ఉన్న గ్రూపు థియేటర్లలో ఓ హాల్లో ఈ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో బైకులపై వచ్చిన నలుగురు వ్యక్తులు థియేటర్‌పై పెట్రోల్ బాంబు విసిరారు. వెంటనే అప్రమత్తమైన థియేటర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ వ్యవహారంపై స్థానిక పోలీసులకు థియేటర్ యాజమాన్యం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ దాడితో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

పదవికి బ్రార్ రాజీనామా

న్యూఢిల్లీ: ఫరీద్‌కోట్ మాజీ ఎంపి జగ్‌మీట్ సింగ్ బ్రార్ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టిఎంసి) పంజాబ్ రాష్ట్ర అధ్యక్ష పదవిని వీడారు. తన రాజీనామా లేఖను పార్టీ చీఫ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి కోల్‌కత్తాలోని ఆమె నివాసంలో శుక్రవారం అందజేశారు. గత ఏడాది పంజాబ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు బ్రార్ టిఎంసిలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడయ్యారు. కాగా, ఢిల్లీలోని, అదే విధంగా కోల్‌కత్తాలోను పార్టీ అధినేత్రిని కలిసేందుకు తన మద్దతుదారులతో కలిసి అనేక సార్లు ప్రయత్నించానని, ఫలితం లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురైనట్లు బ్రార్ రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మమతా బెనర్జీ పంజాబ్‌ను పట్టించుకోనందు వల్లే తాను రాష్ట్ర పార్టీ అధ్యక్షపదవికి రాజీనామా చేస్తున్నానని, తక్షణ ఆ పదవిని నుంచి తప్పుకుంటున్నానన్నారు. తన మిత్రులు, శ్రేయోభిలాషులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించనున్నట్లు ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, ఎన్నికలకు ముందు ప్రస్తుతం పంజాబ్ ముఖ్యమంత్రి అమరిందర్ సింగ్‌తో విభేదాలు రావడంతో బ్రార్ కాంగ్రెస్ పార్టీని కూడా వీడారు. బీంట్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బ్రార్ పంజాబ్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా పనిచేశారు.

• హస్తినను కమ్మేసిన కాలుష్యం!



దేశ రాజధాని ఢిల్లీలో శనివారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. అసలే కాలుష్యం..కనిష్ఠ ఉష్ణోగ్రతలు...ఆపై మంచు విపరీతంగా కురియడంతో పొద్దెక్కినా కూడా సూర్యుడు కనిపించలేదు. శనివారం ఢిల్లీలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. కనీస ఉష్ణోగ్రత 8.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఉదయం గాలిలో 97 డిగ్రీల తేమ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ప్రోటోకాల్ ప్రకారమే ఆరో వరుసలో రాహుల్

బిజెపి జాతీయ ప్రతినిధి వివిఎల్ నరసింహారావు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి రిపబ్లిక్ దినోత్సవం ఆరవ వరుసలో సీటు కేటాయించడంపై ఆ పార్టీ అభ్యంతరాలను బిజెపి నేడు తిప్పికొట్టింది. ఈ సందర్భంగా 'రాహుల్ గాంధీ తనకు తాను సూపర్ వివిఐపిగా ఊహించుకొని అందరికంటే ముందు ఉంచాలని భావిస్తారు' అని బిజెపి వ్యాఖ్యానించింది. ప్రోటోకాల్ ప్రకారం రాహుల్‌కు సీటు కేటాయించడంపై రాద్ధాంతం ఎందుకని బిజెపి జాతీయ ప్రతినిధి వివిఎల్ నరసింహారావు ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో బిజెపి నాయకులపట్ల అలాగే ప్రవర్తించినా తాము ఎటువంటి గొడవ చేయలేదని గుర్తుచేశారు. రాహుల్ గాంధీకి ఆరో వరుసలో సీటు కేటాయించినందుకు కాంగ్రెస్ మండిపడింది. బిజెపి ప్రభుత్వం సాంప్రదాయాలకు తిలోదకాలిచ్చి, 'చౌకబారు రాజకీయాల'కు దిగుతోందని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ విమర్శను జివిఎల్ తిరస్కరించారు.

యుపిలో ఆగని అల్లర్లు

• దుకాణాలకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు

కాస్‌గంజ్: ఉత్తర్‌ప్రదేశ్‌లో అల్లర్లు తీవ్ర రూపం దాల్చాయి. ఆందోళనకారులు కాస్‌గంజ్ ప్రాంతంలోని పలు దుకాణాలకు, బస్సులకు నిప్పు పెట్టారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసమయ్యాయి. శుక్రవారం తిరంగా యాత్రలో భాగంగా మథురబరేలీ మార్గంలో విహెచ్‌పి, ఎబివిపి కార్యకర్తలు మోటారు సైకిళ్ల ర్యాలీ చేపట్టగా.. వారిపై కొంతమంది రాళ్లు రువ్వడంతో ఘర్షణలు చెలరేగాయి. ఈ అల్లర్ల కారణంగా చందన్ గుప్తా అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో శుక్రవారం నుంచి కాస్‌గంజ్‌లో కర్ఫ్యూ విధించారు. శనివారం ఆందోళనకారులు మరింత రెచ్చిపోయారు. కాస్‌గంజ్ ప్రాంతంలోని పలు దుకాణాలకు, బస్సులకు నిప్పు పెట్టారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఆర్‌ఎఎఫ్, పిఎసి బలగాలు రంగంలోకి దిగాయి. ఘంటాఘర్, నద్రై గేటు సమీపంలో కొందరు ఆందోళనకారులు పెట్రోల్ బాటిల్స్‌తో దాడులకు దిగినట్లు పోలీసులు వెల్లడించారు. రంగంలోకి దిగిన భద్రతా సిబ్బంది పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. 26మందికి వ్యతిరేకంగా రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు కాస్‌గంజ్ పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఈ అల్లర్లలో చనిపోయిన చందన్‌గుప్తాకు భాజపా ఎంపి రాజ్‌వీర్‌సింగ్ నివాళులర్పించారు. అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు. యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మృతుడి కుటుంబానికి రూ.5లక్షలు పరిహారం ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



ముంబయిలో భారీ అగ్నిప్రమాదం

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గోరేగావ్ తూర్పు ప్రాంతంలోని ఓ ఫ్యాక్టరీలో శనివారం పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. 15 అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపు చేశారు. ఇప్పటివరకు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని తెలుస్తోంది. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయంపై స్పష్టత రాలేదు. గత నెల కమలా మిల్స్ భవన సముదాయంలోనూ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే.

1033

• హైవే ప్రమాదాలకు టోల్‌ఫ్రీ నంబరు? • వచ్చే నెల చివరికి అందుబాటులోకి తీసుకురానున్న ఎన్‌హెచ్‌ఎఐ



న్యూఢిల్లీ: అతివేగం, మద్యం, నిద్ర మత్తులో ప్రయాణాల వల్ల జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే ఈ ప్రమాదాల గురించి పోలీసులకు, అంబులెన్స్‌లకు చేరేలోపే చాలా ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇలాంటి వాటిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఓ ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను తీసుకురానుంది. హైవేలపై ప్రమాదాల గురించి చెప్పేందుకు జాతీయ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఎఐ) '1033' హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తోంది. ఫిబ్రవరి చివరి వారంతో దీన్ని అందుబాటులోకి తీసుకురానుంది. 'ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే అన్ని పనులు పూర్తయ్యాయి. హైవేలపై ప్రమాదానికి గురయ్యే బాధితులకు త్వరిత సాయం అందించేందుకు, వారిని త్వరగా సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఈ హెల్ప్‌లైన్‌ను తీసుకొస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నాం' అని ఎన్‌హెచ్‌ఎఐ చైర్మన్ దీపక్ కుమార్ తెలిపారు. అంతేగాక.. ఈ టోల్‌ఫ్రీ నంబర్ గురించి అందరికి తెలియజేసేలా విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రమాదాలే గాక.. రోడ్ల నిర్వహణ గురించి కూడా ఈ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

కాల్పులకు పాల్పడిన పాక్ రేంజర్లు

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ లోని రాజౌరి జిల్లాలోని సరిహద్దులో దాయాది పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. పాక్ రేంజర్లు నౌషెరా సెక్టార్ లో కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో ఒక పౌరుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. పాక్ బలగాలు సరిహద్దు భారత గ్రామాలను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇండ్ల గోడలు, పైకప్పులు కూలిపోయాయి. దీంతో అప్రమత్తమై భారత బలగాలు పాక్ కాల్పులను తిప్పికొడుతున్నాయి.

గోడ కూలి ముగ్గురు మృతి


రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో బియ్యం మిల్లు లోపలి గోడ కూలి ముగ్గురు కార్మికులు మృతి చెందారు, ఆరుగురు గాయపడ్డారు. విభజన గోడ వెంబడి బియ్యం, ఉనుక నింపిన సంచులను వేస్తుండగా ఒక్కసారిగా గోడ కుప్ప కూలడంతో కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారని పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కార్మికులను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. టాంగ్‌పాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం ఘటన చోటు చేసుకుంది. మృతులు పంక్ (25), ఫూల్‌చంద్ (35), సోమా (25) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. గాయపడ్డ మరో ఆరుగురిని జగదల్‌పూర్‌లోని మహారాణి ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నదిలో పడ్డ బస్సు, 13మంది మృతి

ముంబయి: పశ్చిమ మహారాష్ట్రలో ఘోర ప్రమాదం సంభవించింది. కోల్హాపూర్ వద్ద మిని బస్సు అదుపు తప్పి పంచగంగ నదిలో పడటంతో 13 మంది మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, తొమ్మిది నెలల చిన్నారి సహా ఏడుగురు పిల్లలు ఉన్నారు. శుక్రవారం రాత్రి ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. పుణెలోని బాలెవాడికి చెందిన మూడు కుటుంబాలు కొంకణ్ తీరప్రాంతంలోని గణపతిపులెను సందర్శించి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. పంచగంగ నదిపై ఉన్న శివాజీ వంతెన పైకి రాగానే వాహనంపై డ్రైవర్ అదుపు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. సహాయక సిబ్బంది వెలికి తీసిన 16 మందిలో 13 మంది మృతి చెందారు. ముగ్గురు వ్యక్తులను చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించినట్లు పోలీసులు తెలిపారు.

ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల్లో 'ఆధార్'

జైపూర్: 2017 సంవత్సరపు హిందీ పదంగా 'ఆధార్'ను ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల్లో చేర్చారు. ఆధార్ కార్డు కారణంగా ఆధార్ అన్న పదమం జనాదరణ పొందింది. దానిని 2017 హిందీ పదంగా స్వీకరించినట్లు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల సమావేశంలో ప్రకటించారు. ఆక్స్‌ఫర్డ్ పరిశీలించిన ఇతరపదాల్లో మిత్రో, నోట్‌బందీ, గోరక్షక్ వంటివి ఉన్నాయి. అయితే 'ఆధార్' పై సంవత్సరమంతా విసృతస్థాయిలో చర్చ జరిగినందున దానినే 'సంవత్సరపు పదం' ఎంచుకోవడం జరిగిందని చర్చల సందర్భంగా పాత్రికేయుడు సౌరభ్ ద్వివేది చెప్పారు. అలాగే 'స్లీపవస్థ'(ప్రభుత్వం నిద్రావస్థ), మౌకాతరియన్(అవకాశవాది) వంటి భావోద్వేగాలకు సంబంధించిన పదాలను కూడా పరిశీలించారు. 'భాషపై సరైన అవగాహనలేని వ్యక్తి చెప్పే మాటను స్వీకరించరాదని' రచయిత్రి చిత్రా ముద్గల్ ఆక్షేపణ తెలిపారు. 'రాజకీయవేత్తలు ఉపయోగించే 'మిత్రో' పదం వ్యాకారణరీత్యా సరైనది కాదు' అని కవి, రచయిత అశోక్ వాజ్‌పేయి అభిప్రాయపడ్డారు. ప్రజలు బాగా ఉపయోగించే(జనబాహుల్య) పదాలనే స్వీకరించాలని కూడ ఆయన చెప్పారు. మీడియా ఉపయోగించే భాషపై పాత్రికేయుడు వినోద్ దువా మాట్లాడుతూ 'చదువరులకు, ప్రేక్షకులకు అర్థమయ్యే సులభ భాషలో వార్తలను అందించడమే మీడియా పనని, కొత్త సాహిత్యాన్ని సృష్టించడం కాదు' అని అన్నారు.




పోలీసులపై దాడి, మహిళలపై కేసు

థానే: మహారాష్ట్రలో పోలీసులపై దాడి చేశారనే ఆరోపణలతో ఆరుగురు మహిళలపై అధికారులు కేసులు నమోదు చేశారు. భివాండిలోని పిరనిపదలో ఓ నిందితుడిని అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులపై పలువురు మహిళలు దాడికి పాల్పడ్డారు. మోసం, వంచన కేసులో నిందితుడు కమర్ అలీ జాఫ్రీ పిరనిపదలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. జాఫ్రీని తమ కస్టడీకి తీసుకున్న పోలీసులపై మహిళలు రాళ్లతో దాడి చేశారు. నిందితుడిని రక్షించేందుకు పోలీసులపై చేయి చేసుకోవడంతో పాటు యూనిఫాంలను చించేశారని థానే పోలీసు అధికార ప్రతినిధి సుఖద నార్కర్ తెలిపారు. నిందితులైన మహిళలపై శాంతినగర్ పిఎస్‌లో ఎఫ్ఐఆర్ నమోదయింది. ప్రభుత్వ అధికారులు విధులు నిర్వహించకుండా అడ్డుకుని, వారిపై దాడికి పాల్పడినందుకు ఇండియన్ పీనల్ కోడ్ 353, 332 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎఐఎడిఎంకె నుంచి 140మంది కార్యకర్తల ఉద్వాసన

చెన్నై: ఎఐఎడిఎంకె నాయకులు ఒ.పన్నీర్ సెల్వం, కె.పళనిస్వామి ఆదివారం మరోసారి కొరడా ఝుళిపించారు. పార్టీకి కళంకం తెస్తున్నారన్న ఆరోపణపై ఈసారి ఏకంగా టుటికోరిన్ జిల్లాకు చెందిన 140మంది పార్టీ కార్యకర్తలపై వేటు వేశారు. టుటికోరిన్ జిల్లాకు చెందిన ఎఐఎడిఎంకెకు చెందిన వివిధ విభాగాలకు చెందిన 144మంది కార్యకర్తలను పార్టీ నుంచి బహిష్కరించనట్లు ఆ ఇద్దరు నాయకులు తమ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేసి వారు పార్టీకి కళంకం తీసుకొచ్చారని ఎఐడిఎంకె కోఆర్డినేటర్ పన్నీర్‌సెల్వం, కోకోఆర్డినేటర్ పళనిస్వామి తమ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పార్టీ నుంచి బహిష్కరించిన వారితో ఎలాంటి సంబంధాలు పెట్టుకోకూడదని వారు ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు సూచించారు. పళనిస్వామి, పన్నీర్‌సెల్వం తమతమ వర్గాలను 2017 ఆగస్టులో విలీనం చేశారన్నది తెలిసన విషయమే. వారు ఇంతకు ముందు కూడా అనేక మంది పార్టీ కార్యకర్తలను పార్టీ నుంచి బహిష్కరించారు. ఆర్.కె.నగర్ ఉప ఎన్నికల్లో టిటివి. దినకరన్ గెలుపొందాక పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా పనిచేస్తే చర్య తీసుకుంటామని వారిద్దరూ గత నెలే హెచ్చరించారు. శనివారం వారు కాంచీపురం సెంట్రల్ యూనిట్‌కు చెందిన 53మందిని, అన్నా తొళిర్‌సంఘ పెరవై (కార్మిక సంఘం)కు చెందిన ఇతరులను కూడా బహిష్కరించారు.

బస్సు చార్జీల పెంపుపై నిరవధిక ఆందోళన: స్టాలిన్



చెన్నై: తమిళనాడులో పెంచిన బస్సు చార్జీల కు వ్యతిరేకంగా శనివారం ప్రతిపక్ష డిఎంకె రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించింది. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ముఖ్యమంత్రి కె పళనిస్వామి పెంచిన బస్సు చా ర్జీలను ఉపసంహరించుకోవాలి లేదా తన పదవికి రాజీనామా చేయాలని డిఎంకె కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ డిమాండ్ చేశారు. తమ అభ్యర్థనపై చర్యలు తీసుకునేందుకు రెండు, మూడు రోజులు వేచి చూస్తామని, ఆ తర్వాత ప్రభుత్వ అనుమతి లేకుండానే నిరసనలు తెలుపుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యంలో మీడియానే ప్రధానం

ముంబయి: ప్రజాస్వామ్యంలో మీడియా ప్రధానమైన మూలస్తంభమని, న్యాయవ్యవస్థ కూడా దానిని సంప్రదించాల్సి వచ్చిందని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే పేర్కొన్నారు. శనివారం మహారాష్ట్ర న్యూస్ వెండర్స్ అసోసియేషన్, ముంబయి న్యూస్ పేపర్స్ అసోసియేషన్స్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శివసేన సిద్ధాంత పత్రిక సామ్నాకు ఎడిటర్‌గా పని చేస్తున్న ఆయన సుప్రీం కోర్టుకు చెందిన నలుగురు న్యాయమూర్తులు ఇటీవల మీడియా సమావేశంలో తమ ఆందోళనను తెలియజేశారన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియాకు అంతటి ప్రాధాన్యం ఉందని ఆయన పేర్కొన్నారు. తాను న్యూస్ పేపర్ వెండర్లకు రుణపడి ఉన్నానని తెలిపారు. శివసేన వ్యవస్థాపకుడు బాల్‌థాకరే నడిపిన 'మార్మిక్' వార పత్రికను ప్రతి ఇంటికి చేరవేయడంలో వెండర్లు కీలకపాత్ర పోషించారన్నారు.

నేడు కొయంబత్తూరులో జల్లికట్టు

కొయంబత్తూరు: జల్లికట్టును సోమవారం తొలిసారిగా నిర్వహించేందుకు కొయంబత్తూరులో ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు 750 ఎద్దు, వాటిని లొంగదీసుకునే క్రీడాకారులుగా 500మంది పేర్లు నమోదు చేసుకున్నారు. జల్లికట్టు జరిగే 25 ఎకరాల బరిని జిల్లా కలెక్టరు టి.ఎన్.హరిహరన్ పరిశీలించారు. ఈ జల్లికట్టు క్రీడను సిటీ కార్పొరేషన్, ఓంకార్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించబోతున్నాయి. పురపాలక మంత్రి ఎస్.పి.వేలుమణి జెండా ఊపి ఈ క్రీడలను ప్రారంభించనున్నారు. జనవరి మూడో వారంలో, పలమేడు సహా మరికొన్ని ప్రాంతాల్లో ఫిబ్రవరి మొదటివారం ఈ జల్లికట్టును నిర్వహిస్తారని సమాచారం.



2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తి లేదు

వాషింగ్టన్ : 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తి లేదని ప్రముఖ అమెరికన్ టెలివిజన్ హోస్ట్ ఓప్రా విన్‌ఫ్రే తెలిపారు. ఇటీవల అమెరికాలో జరిగిన 'గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్' కార్యక్రమంలో ఓప్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అమెరికాలో ప్రస్తుత పాలనా వ్యవస్థ సరిగ్గా లేదని, వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని పరోక్షంగా వెల్లడించారు. ఇటీవల ఇన్‌స్టైల్ మ్యాగజైన్ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఓప్రా మాట్లాడుతూ 2020 ఎన్నికల గురించి ప్రస్తావించారు. 'నేను ఏం చేయగలను, ఏం చేయలేను అన్న విషయాల్లో నాకు పూర్తి స్పష్టత ఉంది. నేను ఆత్మవిశ్వాసంతో ఉంటేనే ఏ పనైనా చేస్తా. అధ్యక్ష పదవిపై నాకు అంత ఆసక్తి లేదు. ఆ డిఎన్ఏ నాలో లేదు' అని తెలిపారు. ఓప్రా పోటీ చేయడంపై అప్పట్లో అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ స్పందించారు. ఓప్రా తనకు మంచి స్నేహితురాలని, తనకు వ్యతిరేకంగా పోటీ చేయదని తెలిపారు. ఒకవేళ ఆమె పోటీకి దిగితే చాలా సరదాగా ఉంటుందని పేర్కొన్నారు.

ఆత్మాహుతి దాడి : 95 మంది మృతి





అంబులెన్స్‌లో బాంబులు పెట్టి పేల్చుకున్న ఉగ్రవాదులు

బాధ్యత తమదేనన్న తాలిబన్

కాబూల్: ఇక్కడ రద్దీ ప్రాంతంలో పేలుడు పదార్థాలతో నిండిన అంబులెన్స్‌లో పేలిన దారుణ ఘటనలో 95 మంది మరణించారు, 158 మంది గాయపడ్డారు. ఆ దాడి తమ పనేఅని తాలిబన్ ప్రకటించింది. మే 31 తర్వాత అతి పెద్ద పేలుడు ఇదే. అప్పుడు కాబూల్ దౌత్య భవనాల ప్రాంతంలో ట్రక్కు బాంబు పేలి బీభత్సం సృష్టించింది. అనేక మంది మరణించారు. తాజా పేలుడుతో మృతుల సంఖ్యను ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు ప్రకటించారు. పేలుడు ప్రభావంతో రెండు కి.మీ ప్రాంతంలో భవనాల కిటికీలు దెబ్బతిన్నాయి. పేలుడు ప్రాంతంలో కొన్ని భవనాలు కూలి పోయాయి. ఇది ఆత్మాహుతి బాంబర్ దాడి అని అధికార్లు వివరించారు. చెక్ పాయింట్ల గుండా దూసుకు రావడానికి ఆంబులెన్స్‌ను బాంబర్ ఎంచుకున్నాడు. రోగిని ఆసుపత్రికి తీసుకు వెళుతున్నానని చెబుతూ మొదటి చెక్ పాయింట్ దాటిన బాంబర్ ఆ తర్వాత భద్రతా సిబ్బంది దృష్టికి దొరికిపోవడంతో వెంటనే అంబులెన్స్‌తోపాటు తనను తాను పేల్చుకున్నాడు. ఇటీవల ఆఫ్గానిస్థాన్‌లో తాలిబన్, ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదుల దాడులు విరివిగా జరుగుతున్నాయి. తాజా పేలుడులో తీవ్రంగా గాయపడ్డ అనేక మంది పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మృతుల సంఖ్య పెరగవచ్చు. ఈ దాడి మానవాళిపై జరిగిన పాశవిక దాడిగా అధ్యక్ష కార్యాలయం ఖండించింది.

మృత్యువును జయించాడు!

పుర్రెలో ఆరు అంగుళాల మేకు దిగినా బతికిన బాలుడు

అమెరికా: ఆరు అంగుల మేకు తల పుర్రెలో దిగినా ఓ బాలుడు మృత్యువును జయించాడు. ఈ ఘటన అమెరికాలోని మేరీలాండ్‌లో జరిగింది. డారియస్ అనే ఫోర్‌మెన్ చెట్టుపై ఇళ్లు నిర్మించేందుకు పైకి ఎక్కి కొమ్మలను కొడుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారీ కింద ఉన్న భారీ కప్ బోర్డుపై పడ్డాడు. దీంతో కప్ బోర్డుకున్న 6 అంగులాల మేకు డారియస్ తలపుర్రెలోకి దిగింది. బలంగా మేకు దిగడంతో కప్ బోర్డు తలకు అంటుకుపోయింది. 7గంటల పాటు కప్ బోర్డును తలపై మోస్తూ బాలుడు అలానే ఉండిపోయాడు. విషయం తెలుసుకున్న అంబులెన్స్ సిబ్బంది డారియస్‌ని అంబులెన్స్‌లోకి ఎక్కించేందుకు తీవ్ర కష్టాలు పడ్డారు. కప్ బోర్డును రెండు ముక్కలుగా కోసి అంబులెన్స్‌లోకి ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు తొలుత పుర్రెకు బయట ఉన్న మేకును కట్ చేసి... ఆ తర్వాత శస్త్ర చికిత్స ద్వారా లోపలి మేకును తొలగించారు. డారియస్ అదృష్టవంతుడని, మిల్లీ మీటర్ దూరంలో చావు నుంచి తప్పించుకున్నాడని వైద్యులు తెలిపారు. ఈ ఘటన గత శనివారం జరగగా.. ఆ తర్వాతి రోజు ఆపరేషన్ చేశారు. గురువారం రోజు డారియస్ డిశ్చార్జ్ అయ్యాడని చెప్పారు.

పొరపాటుగా అమెరికా వైమానిక దాడి

బాగ్దాద్: ఇరాక్‌లో అమెరికా దళాలు పొరపాటుగా చేసిన వైమానిక దాడిలో ఎనిమిది మంది మరణించారు. వారిలో ఎక్కువ మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. పశ్చిమ ఇరాక్‌లోని అల్‌బాగ్దాది నగరంలో అమెరికా దళాలు పొరపాటుగా ఈ దాడులు చేశారని ప్రావిన్స్ అధికారి ఒకరు వెల్లడించారు. మరణించిన వారిలో సీనియర్ ఇంటెలిజన్స్ అధికారి, అయిదుగురు పోలీసులు, ఓ మహిళ ఉన్నట్లు తెలిపారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థకు వ్యతిరేకంగా చేపడుతున్న ఆపరేషన్‌కు సహకరించడానికి వెళ్తున్న కాన్వాయ్‌పై ఈ దాడి జరిగింది. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. నగర పోలీస్ చీఫ్ సహా 20 మంది గాయాలపాలయ్యారు. పోలీస్ చీఫ్ పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు.

గ్వాటెమాలా సుప్రీంకోర్టు మాజీ ప్రెసిడెంట్ దారుణ హత్య

గాటెమాలా సిటీ : నగర శివారుల్లో నడి రోడ్డుపై దారుణం జరిగింది. గాటెమాలన్ సుప్రీంకోర్టు మాజీ ప్రెసిడెంట్ జ్స్ అర్టురో సియెర్రా (72) ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఆయన రోడ్డు మార్గంలో ప్రయాణిస్తుండగా ఆయనపై దుండగులు కాల్పులు జరిపారు. ఆయనను ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది.ఆయనకుచికిత్స అందజేస్తూ ఉండగా తుది శ్వాస విడిచారు. 2013 నుంచి 2014మధ్య కాలంలో జోస్ గ్వాటెమాలన్ సుప్రీంకోర్టు ప్రెసిడెంట్‌గా సేవలందించారు. మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షి తెలిపారు. గాటెమాలా అధికారులు ఈ వివరాలను ట్విటర్ ద్వారా వెల్లడించారు.


భద్రతా మండలిలో రిపబ్లిక్ డే ఉత్సవం

వాషింగ్టన్: భారత దేశం వెలుపల అతిపెద్ద గణతంత్ర దినోత్సవం ఐక్య రాజ్య సమితి భద్రతా మండలిలో అనేక మంది దౌత్యవేత్తల సమక్షంలో జరిగింది. రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాల సమితి శాశ్వత ప్రతినిధులు ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో, అమెరికా అంతటా ఈ ఉత్సవాలు జరిగాయి. అమెరికా సమితి ప్రతినిధి నిక్కీ హేలీ ఒక్కరే సంపన్న దేశాల నుంచి హాజరు కాని దౌత్యవేత్త. సమితిలో భారత శాశ్వత దౌత్య యంత్రాంగం, న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ కలిసి ఇచ్చిన విందులో అనేక మంది దౌత్యవేత్తలు పాల్గొన్నారు. అయితే హేలీ న్యూయార్క్‌లో లేనందువల్ల హాజరు కాలేకపోయారు. సమితి సర్వప్రతినిధి సభ అధ్యక్షులు నిరోస్ లావ్ లెజ్‌కాక్,ఉప ప్రధాన కార్యదర్శి అమీనా జె మొహమ్మద్ హాజరయిన ప్రముఖులలో ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు చిరుతలు మృతి

ఆంధ్రప్రదేశ్: వైఎస్ఆర్ కడప జిల్లా కాశినాయన మండలం వరికుంట్ల గ్రామంలో రెండు చిరుత పులులు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందిన ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణ అనే రైతు తన పొంట పొలాన్ని పందుల బారీ నుంచి కాపాడుకోవడానికి విద్యుత్ తీగలతో కంచె ఏర్పాటు చేశాడు. చిరుతలు ఆ విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాతపడ్డాయి. దీంతో రైతు ఎవరికి అనుమానం రాకుండా చిరుతలను తన పొలంలో పాతి పెట్టాడు. గ్రామస్థుల ద్వారా సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని చిరుతల మృతదేహాలను వెలికితీసి పంచనామా నిర్వహించి రైతుపై కేసు నమోదు చేశారు.

డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దు : అకున్ సబర్వాల్



మన తెలంగాణ / అమీర్‌పేట : క్షణిక ఆనందంకోసం మత్తు పదార్థాలను తీసుకొని బంగారం లాంటి జీవితాలను చీకట్లోకి వెళుతున్న యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ అకున్ సబర్వాల్ సూచించారు. శనివారం సనత్‌నగర్ ఇఎస్ఐ మెడికల్ కళాశాలలో నిర్వహించిన సిఎంఇ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత అలవాటు పడితే తమకెందుకులే అని తప్పించుకోకుండా వారి తల్లిదండ్రులు కళాశాల అధికారుల దృష్టికి తెచ్చి మాన్పించే విధంగా చూసే బాధ్యత వారిపై ఉండాలన్నారు. యువత దీనికే అలవాటు పడితే డ్రగ్స్‌ను కొనుగోలు చేసేందుకు ఇంట్లోని వస్తువులను విక్రయించడం, దొంగతనాలకు పాల్పడడంతో పాటు చివరకు హత్యలు చేసిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయన్నారు. డ్రగ్స్ వాడడంవల్ల కలిగే అనార్థాలను వివరించడమే కాకుండా బానిసలైన వారికి అందుబాటులో ఉన్న చికిత్సల గురించి విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. మెడికల్ కళాశాల, పిజి, ఇంటర్, స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు కలిగిన అనుమానాలను అడిగి తెలుసుకొని ఆయన నివృత్తి చేసారు. ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల మెడికల్ ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించి సదస్సులో డీన్ శ్రీనివాస్, విద్యార్థులు, వైద్యనిపుణులు రాజశేఖర్, గుణశీల, నరేష్ రాథోడ్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల తవ్వకాలపై విచారణ

మన తెలంగాణ/ హైదరాబాద్: కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం చెన్నంపల్లి కోటలో గుప్త నిధుల పేరుతో యధేచ్ఛగా తవ్వకాలు జరపడంపై పత్రికల్లో వచ్చిన వార్తలను ఉదహరిస్తూ అందిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. చారిత్రక కోటను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని దూపాడు గ్రామానికి చెందిన వైద్యుడు బ్రహ్మారెడ్డి హైకోర్టుకు లేఖ రాశారు. పిల్ కమిటీ దానిని పిల్‌గా పరిగణించి విచారణ చేయాలని నిర్ణయించింది. రెవిన్యూ, పురావస్తు శాఖల కార్యదర్శులు, పరావస్తు శాఖ డైరెక్టర్, కర్నూలు జిల్లా కలెక్టర్ ఇతరులను ప్రతివాదులుగా చేశారు.

ట్రంప్‌తో 'అఫైర్' వదంతికి హేలీ ఖండన



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో తనకు 'అఫైర్' ఉన్నట్లు వచ్చిన వదంతులను ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి, ఇండియన్ అమెరికన్ నిక్కీ హేలీ తీవ్రంగా ఖండించారు. ఆ వదంతులు చాలా హేయమైనవని, తీవ్రంగా ఖండించాల్సినవని ఆమె అన్నారు. అది ఎంతమాత్రం నిజం కాదని శుక్రవారం నాడు స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్ష పదవిలోని ఎవ్వరూ ఇండియన్ అమెరికన్ కేబినెట్ హోదాతో అధికారిగా ఇంతవరకు నియమించలేదు. తొలిసారి ఆ గౌరవం దక్కినది హేలీకే. 'పోలిటికో' కు ఇచ్చి న ఇంటర్వ్యూలో ఆమె వదంతులను ఖండించారు. ట్రంప్‌తో కలిసి ఎయిర్ ఫోర్స్ వన్‌లో ఒకేసారి ప్రయాణించానని, ఒవల్ ఆఫీసులో తన రాజకీయ భవిష్యత్తు గురించి ట్రంప్‌తో చాలా సార్లు మాట్లాడానన్న వదంతి అబద్ధమని హేలీ త్రోసిపుచ్చారు.

ఉత్తర కొరియా అథ్లెట్లకు కిమ్ బంపర్ ఆఫర్!

గెలిచిన వారికి ఉద్యోగాలు, ఇళ్లు



ప్యాంగ్యాంగ్ : ఉత్తర కొరియా అథ్లెట్లకు ఆ దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఫిబ్రవరి 9 నుంచి దక్షిణ కొరియాలో శీతాకాల ఒలింపిక్స్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఒలింపిక్స్ నేపథ్యంలో రెండేళ్లలో తొలిసారిగా ఉ.కొరియా,ద.కొరియా మధ్య స్నేహపూర్వక చర్చలు కూడా జరిగాయి. అయితే ఈ ఒలింపిక్స్‌లో గెలిచిన ఉత్తర కొరియా అథ్లెట్లకు ఇళ్లు, మెర్సిడెస్ బెంజ్ కార్లు, ఉద్యోగాలు బహుమతిగా ఇస్తామని కిమ్ తాజాగా ప్రకటించారు. బంగారు పతకం గెలిస్తే బెంజ్ కారు, ఓ ఫ్లాట్ బహుమతిగా ఇస్తానన్నారు. సాధారణ పతకాలు గెలిచిన వారికి జ్ఞాపికలతో పాటు క్రీడల నుంచి రిటైర్ అయ్యాక ఉద్యోగాలు ఇప్పిస్తానని ప్రకటించారు. ఏటా ఒలింపిక్స్‌లో పాల్గొనే సామర్థ్యం ఉన్న నలుగురు చిన్నారులను ఎంపిక చేసి వారికి కఠిన శిక్షణ ఇప్పించి ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌కు పంపిస్తారు. వారికి 20 ఏళ్లు వచ్చే వరకు పెళ్లి చేసుకునేందుకు అనుమతి కూడా ఇవ్వరు. కానీ వారికి జీతం, భోజన సదుపాయం అన్నీ కల్పిస్తారని మాజీ అథ్లెట్ లీజి యంగ్ తెలిపారు. కిమ్ జోంగ్ ఉన్ పాలనలో అథ్లెట్ల జీవన శైలిమెరుగుపడుతోందనిపేర్కొన్నారు. కిమ్‌కు స్కీయింగ్, బాస్కెట్ బాల్ అంటే చాలా ఇష్టమని అందుకే క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తుంటారని చెప్పారు. ఒలింపిక్స్‌లో ఉ.కొరియా అథ్లెట్లు పతకాలు గెలిస్తే వారి జీవితమే మారిపోతుంది. అథ్లెట్లు,వారి కుటుంబసభ్యులుఎలాంటిఆర్థిక ఇబ్బందులు పడకుండా కిమ్ చర్యలు తీసుకుంటారు.సమ్మర్ ఒలింపిక్స్‌లో ఉ.కొరియాకి చెందిన అథ్లెట్లు 16స్వర్ణపతకాలతో కలిపి56పతకాలు సాధించారు. ఫిబ్రవరి 9 నుంచి 25 వరకు శీతాకాల ఒలింపిక్స్ జరగనున్నాయి.


రైతుకు వెన్నుదన్నుగా ఉండే పార్టీలకే నా మద్దతు : పవన్



అనంతపురం : 2019లో ఎన్నికల్లో ఎవరైతే రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తారో ఆ పార్టీలకే అండగా నిలుస్తానని పవన్ స్పష్టం చేశారు. ప్రభుత్వాలతో గొడవలు పెట్టుకొనే ఉద్దేశం తనకు లేదని పునరుద్ఘాటించారు. అనంతపురంలో శనివారం రైతులు, ఇంజినీర్లు, నీటిపారుదల రంగం నిపుణులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో వ్యవసాయరంగం, కరవు పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. పలువురు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవన్ మాట్లాడుతూ.. 'అనంతపురం జిల్లాలో తాగు, సాగునీరు లేక రైతన్న కన్నీరు పెడుతున్నాడు. వారి కన్నీటిని తుడవడమే నా లక్ష్యం. రైతే రాజు కావాలి..బానిస కారాదు. నేను రైతును.. వారి కష్టాలు నాకు బాగా తెలుసు. రైతులు ఆనందంగా ఉంటేనే సమాజానికి మేలు జరుగుతుంది. అనంతపురాన్ని అభివృద్ధి చేసేందుకు సత్యసాయిబాబా ఎంతో చేశారు. అలాంటప్పుడు మనమంతా ఒక్కటైతే కరవును సులభంగా తరిమికొట్టడం సాధ్యమే' అని అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో బాధ్యతతో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుంటాయమని, రాష్ట్రంలో ప్రతిదానికీ ఓ విభాగం ఉన్నా సమర్థంగా పనిచేయడంలేదని అన్నారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుదాం. సీమ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా. రైతులకు జనసేన అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.'అనంతపురం నుంచి ఒక లక్షమంది సైన్యం నాకు కావాలి. మీరు యుద్ధాలు చేయొద్దు. రోడ్లపైకి రానక్కర్లేదు. రాష్ట్రం, కేంద్రంపై ఒత్తిడి తేవాలి. మీ అండదండలు ఉంటేనే నేను మాట్లాడేందుకు అవకాశం ఉంటుంది. 2019లో వచ్చే ఎన్నికలు ఎంతో కీలకం. అనంతపురం కరవును తరిమికొట్టాల్సిన సమయం వచ్చింది. ఓట్లు అడిగేందుకు రాజకీయ నాయకులు వచ్చినప్పుడు మీకెందుకు ఓటేయాలి? మాకేం చేశారో చెప్పండి అని నిలదీయండి' అని అన్నారు.

కర్కశంగా చంపేసి.. కుక్కర్‌లో ఉడికించి..

మాజీ భార్యను దారుణంగా హతమార్చిన భర్త





మెక్సికో: కర్కశత్వంతో తన మాజీ భార్యను అత్యంత దారుణంగా హత మార్చి,ఆమె శరీరా న్ని ముక్కలు ముక్కలుగా చేసి.. సగ భాగాన్ని కుక్కర్‌లో ఉడికించాడు. మిగిలిన భాగాలను ఫ్రిజ్‌లో పెట్టి.. అక్కడి నుంచి పరారయ్యాడు. ఒళ్లు గగుర్పొడిచేలా, భయంకరంగా ఉన్న ఈ ఘటన మెక్సికోలో జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మెగ్డలీనా(28), సెసర్ లోపేజ్ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఇద్దరి మధ్య సఖ్యత లేకపోవడంతో కొంతకాలం క్రితం విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి వేర్వేరుగానే ఉంటున్నారు. పిల్లలు అప్పుడప్పుడు తండ్రివద్దకు వెళ్లి వస్తుంటారు. ఎప్పటిలాగే కొద్దిరోజుల కిందట పిల్లలు తమ తండ్రి వద్దకు వెళ్లారు. దీంతో వారిని తీసుకువచ్చేందుకు జనవరి 13న మెగ్డలీనా తన ఇంటినుంచి మాజీ భర్త సెసర్ లోపేజ్ నివాసానికి వెళ్లింది. అలా వెళ్లిన మెగ్డలీనా తిరిగి ఇంటికి రాలేదు.దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పోలీసులుకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు లోపేజ్ ఇంటికి వెళ్లి పరిశీలించారు. అక్కడ వారికి భయానక దృశ్యం కనిపించింది. మెగ్డలీనా శరీరం ముక్కలు ముక్కలుగా చేయబడివుంది. కొంత భాగం.. ఫ్రిజ్‌లో పెట్టగా.. మరికొంత ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న ఆమె మాజీ భర్త లోపేజ్ కోసం గాలిస్తున్నారు.

75 శాతం మొక్కలు బతకకపోతే సర్పంచ్‌ను తీసేస్తాం

- **వ్యవసాయ శాఖ పంటల సాగు విస్తీర్ణం లెక్కలు తప్పు**
- **త్వరలోనే 851 మంది కొత్త ఎఇఒలు : మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి**




మన తెలంగాణ/హైదరాబాద్ : హరితహారంలో భాగంగా నాటే మొక్కల్లో 75 శాతం మొక్కలు బతకకపోతే సర్పంచ్‌ను పదవి నుంచి తొలగిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు నూతన పంచాయతీరాజ్ చట్టం రూపుదిద్దుకుంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను సర్పంచ్‌లు సమర్థవంతంగా అమలు చేయాలని, అలా కట్టుబడి ఉండాలనుకునే వారే సర్పంచ్ ఎన్నికలలో నామినేషన్ వేయాలని లేదంటే ఎన్నికల దారిదాపుల్లోకి రావొద్దన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సాగైన పంటల విస్తీర్ణాన్ని తప్పుగా చూపెడుతున్నారన్నారు. డిఎఒలు మరోమారు క్షేత్రస్థాయి అధికారులను పురమాయించి వాస్తవ సాగు వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ రైతుకున్న మొత్తం విస్తీర్ణంలో సాగుకు యోగ్యం కాని భూముల వివరాలు పక్కాగా సేకరించాలన్నారు. సాగుకు యోగ్యమైన భూమికే పంటకు పెట్టుబడి అందిస్తామన్నారు. త్వరలోనే మరో851 మంది ఎఇఒలు నియామకం కానున్నరాని, మొత్తంగా 2638 మంది ఎఇఒలతో జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి వారికి తగిన దిశానిర్దేశం చేస్తామని అన్నారు. రైతు వేదికల నిర్మాణానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేయనున్నట్లు తెలిపారు. రైతు సమన్వయ సమితులతో కూడా సమావేశాలు నిర్వహించి, వారికి దిశానిర్దేశం చేసే ఆలోచనలో సిఎం కె. చంద్రశేఖర్‌రావు ఉన్నారన్నారు. పచ్చిరొట్ట వేసుకునేలా రైతును ప్రోత్సహించాలని దీనివల్ల పురుగు మందుల వాడకం తగ్గుతుందని తద్వారా రైతాంగ ఆరోగ్యంతో పాటు అందరి ఆరోగ్యాలు బాగుపడతాయని అన్నారు. పంటల బీమా పథకం గడువు తేదీల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణపై మాట్లాడుతూ కేజ్ వీల్స్ వలన రోడ్లు పాడౌతున్నాయని, వాటికి బదులు రోటావేటర్స్ ప్రోత్సహించాలని సూచించారు. యాసంగి పంటలు మార్చిలో కోతకొస్తాయని ఆలోపు పంటకోత యంత్రాలను అందజేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 17వ తేదీన ఒకే రోజు ఖమ్మం, కొత్తగూడెంలలో 1000 ట్రాక్టర్ల పంపిణీ చేయబోతున్నట్లు చెప్పారు. అదే తరహాలో మిగతా జిల్లాల్లోను ట్రాక్టర్ మేళాలు నిర్వహించాలని ఆదేశించారు.

ఎస్ఆర్‌క్యు కోటా నాది... మీకు సంబంధం లేదు !

వ్యవసాయ యాంత్రీకరణలో స్టేట్ రిజర్వ్ కోటా (ఎస్ఆర్‌క్యూ) వ్యవసాయ మంత్రిగా తన పరిధిలో ఉంటుందని,కాబట్టి ఎంఎల్ఎలు,మంత్రులు సూచించిన వారికి ట్రాక్టర్లు ఇచ్చుకుంటానని పోచా రం అధికారులకు స్పష్టం చేశారు. డిఎఒలకు ఎస్ ఆర్ క్యూ కోటాతో సంబంధం లేదని, వారికి స్టేట్ ప్లాన్ లో,ఆర్‌కెవివై పథకం కింద నిధులు కేటాయించినట్లు తెలిపారు. అధికారులు ఎవరు మంత్రి దగ్గరికి వెళ్లి ఎస్ఆర్‌క్యూ కోటా తీసుకోవాలని రైతులకు చెప్పవద్దని, పంచాయతీ చెయొద్దని కోరారు.

శిశు విక్రయాలను అడ్డుకోవాలని పిల్



మన తెలంగాణ/ హైదరా బాద్: తెలంగాణలో శిశు విక్రయాల్ని అడ్డుకోవాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. సర్కార్ ఆధీనంలోని శిశు నివాసాల్లో మృతుల సంఖ్య ఎక్కువ ఉందని కూడా ఆ పిల్‌లో పేర్కొన్నారు. దీనిని బాలల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి.అచ్యుతరావు దాఖలు చేశారు. నల్లగొండ జిల్లాలోనే ఏడాది కాలంలో 32 మంది చిన్నారులు మరణించారని, శిశు నివాసాల్లో సరైన ఆహారం లేకపోవడం ప్రధాన కారణమని రిట్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంలో కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శులు, రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ సంచాలకులు, నల్గొండ జిల్లా కలెక్టర్ ఇతరులను ప్రతివాదులు చేశారు.

ఇండోనేసియా మాస్టర్స్ ఫైనల్లో సైనా నెహ్వాల్

జకర్తా: ప్రతిష్ఠాత్మకమైన ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్, తెలుగు తేజం సైనా నెహ్వాల్ టైటిల్ పోరుకు చేరుకుంది. నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన సైనా ఈ టోర్నమెంట్‌లో అసాధారణ రీతిలో చెలరేగి పోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్, సహచర క్రీడాకారిణి పి.వి.సింధును ఓడించిన సైనా పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తోంది. కాగా, శనివారం జరిగిన సెమీఫైనల్లో సైనా 21–19, 21–19 తేడాతో థాయిలాండ్ స్టార్, ఇంతనోన్ రచనోక్‌ను ఓడించింది. చివరి వరకు నరాలు తెగే ఉత్కంఠత మధ్య సాగిన పోరులో సైనా చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ప్రారంభం నుంచే సైనా కుదురుగా ఆడింది. అయితే అగ్రశ్రేణి క్రీడాకారిణి రచనోక్ కూడా పట్టు విడవకుండా విజయం కోసం తీవ్రంగా పోరాడింది. దీంతో ప్రతి పాయింట్ కోసం ఇద్దరు సర్వం ఒడ్డారు. వీరి సమరం యుద్ధాన్ని తలపించింది. అయితే కీలక దశలో రచనోక్ ఒత్తిడిని తట్టుకోవడంలో విఫలమైంది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న సైనా మ్యాచ్‌పై పట్టు సాధించింది. చివరి వరకు దీన్ని కాపాడుకుంటూ టైటిల్ వేటకు దూసుకెళ్లింది. ఆదివారం జరిగే ఫైనల్లో సైనా తైవాన్ క్రీడాకారిణి జు ఇంగ్ తైతో తలపడుతుంది.



క్రికెటర్లపై కనక వర్షం

- స్టోక్స్‌కు రూ.12.5 కోట్లు, మనీష్, రాహుల్‌కు రూ.11 కోట్లు,
- గేల్, రూట్‌లకు నిరాశ, ఆసక్తికరంగా ఐపిఎల్ వేలం పాట

బెంగళూరు: ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2018 సీజన్ కోసం శనివారం నిర్వహించిన వేలం పాటలో భారత క్రికెటర్ల పంట పండింది. విదేశి క్రికెటర్లతో పోటీ పడి భారత క్రికెటర్లు భారీ ధర పలికారు. ఈ వేలం పాటలో ఊహించినట్టుగానే ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ అత్యధిక ధర పలికాడు. అతన్ని రాజస్థాన్ రాయల్స్ 12.5 కోట్ల రూపాయలు వెచ్చించి సొంతం చేసుకుంది. భారత క్రికెటర్లు మనీష్ పాండేను రూ.11 కోట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్, లోకేష్ రాహుల్‌ను అంతే మొత్తానికి కింగ్స్ లెవన్ పంజాబ్ కొనుగోలు చేసింది. అఫ్గాన్ యువ సంచలనం రషేద్ ఖాన్‌ను రికార్డు స్థాయిలో తొమ్మిది కోట్ల రూపాయలను వెచ్చించి సన్‌రైజర్స్ సొంతం చేసుకుంది. భారత క్రికెటర్లు దినేష్ కార్తీక్, అశ్విన్, కేదార్ జాదవ్, నవ్‌దీప్ సైనీ తదితరులు కూడా వేలం పాటలో కళ్లు చెదిరే ధరను దక్కించుకున్నారు. కాగా, టి–20లో ఎదురులేని శక్తిగా పేరున్న క్రిస్ గేల్, గుప్టిల్, ఆమ్లా, పార్థివ్, జోరూట్ తదితరులకు నిరాశే మిగిలింది.



స్టోక్స్‌దే పైచేయి..

అందరు ఊహించినట్టే ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ కోసం ఫ్రాంచైజీలు విపరీత పోటీ పడ్డాయి. అతన్ని దక్కించుకునేందుకు చాలా జట్లు పోటీ ధరను పెంచాయి. రాజస్థాన్ రాయల్స్, కింగ్స్ లెవన్ పంజాబ్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్లు స్టోక్స్‌ను దక్కించుకునేందుకు చివరి వరకు తీవ్రంగా పోరాడాయి. అయితే రాజస్థాన్ రాయల్స్ రికార్డు స్థాయిలో రూ. 12.5 కోట్లు చెల్లించి స్టోక్స్‌ను సొంతం చేసుకుంది.

రాహుల్, మనీష్‌ల పంట పండింది

మరోవైపు భారత స్టార్లు మనీష్ పాండే, లోకేష్ రాహుల్, కేదార్ జాదవ్, దినేష్ కార్తీక్, రాబిన్ ఉతప్ప, కరుణ్ నాయర్‌లూ ఐపిఎల్‌లో రికార్డు ధరను దక్కించుకున్నారు. వన్డేల్లో మెరుగైన ఆటగాడిగా పేరు తెచ్చుకు న్న మనీష్ పాండేను 11 కోట్ల రూపాయలను వెచ్చించి సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతం చేసుకుంది. రాహుల్ అంతే ధరకు కింగ్స్ లెవన్ పంజాబ్ దక్కించుకుంది. ఇక, ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు క్రిస్ లిన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ 9.6 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. మాక్స్‌వెల్ (రూ.9 కోట్లు)ను ఢిల్లీ డేర్‌డెవిల్స్ దక్కించుకుంది. టి–20లో మెరుగైన రికార్డు కలిగిన సంజు శాంసన్ కూడా ఐపిఎల్ వేలం పాటలో కళ్లు చెదిరే ధర ను పలికాడు. అతన్ని రాజస్థాన్ 8 కోట్ల రూపాయలకు సొంతం చేసుకుంది. దినేష్ కార్తీక్‌కు కోల్‌కతా నైట్‌రైడర్స్ 7.4 కోట్ల రూపాయల రికార్డు ధరను చెల్లించి కొనుగోలు చేసింది. శిఖర్ ధావన్ 5.2 కోట్లకు సన్‌రైజర్స్ అంటి పెట్టుకుంది. కిరన్ పొలార్డ్‌ను ముంబయి 5.2 కోట్లకు దక్కించుకుంది. వృద్ధిమాన్ సాహా కూడా అనూహ్యంగా ఐదు కోట్ల రూపాయల ధరను పలికాడు. అతన్ని సన్‌రైజర్స్ తీసుకుంది. తమ పాట ఆటగాడు డ్వేన్ బ్రావోను చెన్నై 6.4 కోట్ల రూపాయలకు సొంతం చేసుకుంది. గౌతం గంభీర్‌ను 2.8 కోట్లకు ఢిల్లీ, హర్భజన్‌ను రెండు కోట్ల రూపాయలకు చెన్నై, యూసుఫ్ పఠాన్‌ను 1.9 కోట్లకు సన్‌రైజర్స్, యువరాజ్‌ను రెండు కోట్లకు పంజాబ్, సాకిబ్‌ను రెండు కోట్లకు సన్‌రైజర్స్ జట్లు సొంతం చేసుకున్నాయి. ఇక, స్టార్ స్పిన్నర్ అశ్విన్‌ను పంజాబ్ 7.6 కోట్లు వెచ్చించి పంజాబ్ సొంతం చేసుకుంది. ఉతప్పను కోల్‌కతా భారీ మొత్తం చెల్లించి దక్కించుకుంది. ఒక, అఫ్గాన్ సంచలనం రషేద్ ఖాన్‌ను రూ.9 కోట్లు చెల్లించి హైదరాబాద్ కాపాడుకుంది. అతని కోసం పంజాబ్, రాజస్థాన్ రాయల్స్ జట్లు కూడా తీవ్రంగా పోటీ పడ్డాయి.





గేల్‌కు నిరాశ

ఇక, ఐపిఎల్‌లోనే అత్యంత విధ్వంసక క్రికెటర్‌గా పేరు తెచ్చుకున్న క్రిస్‌గేల్‌కు వేలం పాటలో ఊహించని షాక్ తగిలింది. గేల్‌కు కనీస ధర రెండు కోట్ల రూపాయలను కేటాయించారు. అయితే అతన్ని సొంతం చేసుకునేందుకు ఏ ఫ్రాంచైజీ కూడా పెద్దగా ఆసక్తి కనబరచలేదు. దీంతో వేలం పాట తొలి రోజు అమ్ముడు పోలేదు. సొంత ఫ్రాంచైజీ బెంగళూరు కూడా గేల్‌ను పట్టించుకోలేదు. అదే విధంగా ఇంగ్లాండ్ స్టార్లు రూట్, బెయిర్‌స్టోలకు నిరాశే మిగిలింది. హాషిం ఆమ్లా, మురళీ విజయ్, పార్థివ్, గుప్టిల్, ఫాల్కనర్ వంటి స్టార్ క్రికెటర్లకు కూడా వేలం పాటలో నిరాశే మిగిలింది. వీరిని ఎవరు సొంతం చేసుకోలేదు. దీంతో వీరు ఐపిఎల్‌లో ఆడడం ఇక అసాధ్యమేనని చెప్పాలి. మరోవైపు భారత యువ క్రికెటర్లు పృథ్వీ షా, నాగకోటి, శుభ్‌మన్ గిల్ తదితరులు కోట్లాది రూపాయల ధరను పలికారు. వీరిని కొనుగోలు చేసేందుకు ఆయా ఫ్రాంచైజీలు ఎంతో ఆసక్తి కనబరిచాయి. దీంతో చాలా మంది యువ క్రికెటర్లు కళ్లు చెదిరే ప్యాకేజీలను సొంతం చేసుకున్నారు.

అత్యధిక ధర పలికిన టాప్–20 క్రికెటర్లు

ఆటగాడి పేరు	ఫ్రాంఛైజీ పేరు	ధర రూ. కోట్లలో
బెన్ స్టోక్స్	రాజస్థాన్ రాయల్స్	12.5
మనీశ్‌పాండే	సన్‌రైజర్స్ హైదరాబాద్	11
కెఎల్ రాహుల్	కింగ్స్ ఎలెవన్ పంజాబ్	11
క్రిస్‌లీన్	కోల్‌కతా నైట్‌రైడర్స్	9.6
మిచెల్ స్టార్క్	కోల్‌కతా నైట్ రైడర్స్	9.4
మ్యాక్స్‌వెల్	ఢిల్లీ డేర్‌డెవిల్స్	9
సంజూశామ్సన్	రాజస్థాన్ రాయల్స్	8
క్రిస్‌వోక్స్	చాలెంజర్స్ బెంగళూరు	7.4
దినేశ్‌కార్తీక్	కోల్‌కతా నైట్‌రైడర్స్	7.4
రవిచంద్రన్ అశ్విన్	కింగ్స్ ఎలెవన్ పంజాబ్	7.6
డ్వైన్ బ్రావో	చెన్నై సూపర్ కింగ్స్	6.4
రాబిన్ ఊతప్ప	కోల్‌కతా నైట్‌రైడర్స్	6.4
అరోన్ ఫించ్	కింగ్స్ ఎలెవన్ పంజాబ్	6.2
మార్కస్ స్టోయినిస్	కింగ్స్ ఎలెవన్ పంజాబ్	6.2
కరుణ్‌నాయర్	కింగ్స్ ఎలెవన్ పంజాబ్	5.6
కిరోన్ పొలార్డ్	ముంబయి ఇండియన్స్	5.4
శిఖర్ ధావన్	సన్‌రైజర్స్ హైదరాబాద్	5.2
అజింక్య రహానె	రాజస్థాన్ రాయల్స్	4
కెన్ విలియమ్సన్	సన్‌రైజర్స్ హైదరాబాద్	3
గౌతం గంభీర్	ఢిల్లీ డేర్‌డెవిల్స్	2.8
హర్భజన్ సింగ్	చెన్నై సూపర్ కింగ్స్	2



చాంపియన్ వోజ్నియాకి

ఫైనల్లో హలెప్‌కు షాక్, నేడు పురుషుల ఫైనల్, ఆస్ట్రేలియా ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను రెండో సీడ్, డెన్మార్క్ స్టార్ కరోలైన్ వోజ్నియాకి కైవసం చేసుకుంది. శనివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో వోజ్నియాకి 7–6, 3–6, 6–4 తేడాతో టాప్ సీడ్ సిమోనా హలెప్ (రుమేనియా)ను ఓడించి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం చేసుకుంది. మరోవైపు తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడాలని భావించిన హలెప్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ప్రారంభం నుంచే పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. తొలి సెట్‌లో ఇద్దరు సర్వం ఒడ్డి పోరాడారు. దీంతో సెట్ టైబ్రేకర్ వరకు వెళ్లక తప్పలేదు. అయితే చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో సఫలమైన వోజ్నియాకి సెట్‌ను సొంతం చేసుకుంది. కానీ, రెండో సెట్‌లో మళ్లీ సీన్ రివర్స్ అయ్యింది. ఈసారి హలెప్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. చూడచక్కని షాట్లతో చెలరేగిన హలెప్ సునాయాసంగా సెట్‌ను సొంతం చేసుకుంది. కాగా, ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లో కూడా పోరు ఉత్కంఠభరితంగా సాగింది. హలెప్, వోజ్నియాకి గెలుపు కోసం తీవ్రంగా పోరాడారు. అయితే కీలక సమయంలో హలెప్ ఒత్తిడికి గురైంది. దీన్ని వోజ్నియాకి తనకు అనుకూలంగా మార్చుకుంది. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకుంటూ 6–4తో సెట్‌ను సొంతం చేసుకొని తన ఖాతాలో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను జమ చేసుకుంది. అంతేగాక ఫైనల్‌కు చేరిన తొలి క్రమంలోనే ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ సాధించిన తొలి క్రీడాకారిణిగా కొత్త రికార్డు నెలకొల్పింది.



మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో ఏడో సీడ్ ఒలివర్ మరాచ్ (ఆస్ట్రియా), మాట్ పావిక్ (క్రొయేసియా) జంట టైటిల్‌ను గెలుచుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో ఒలివర్ జోడీ 6–4, 6–4 తేడాతో పదకొండో సీడ్, కొలంబియాకు చెందిన సెబాస్టియన్, రాబర్ట్ జంటను ఓడించింది.

నేడు సిలిచ్‌తో ఫెదరర్ పోరు...

మరోవైపు పురుషుల సింగిల్స్ తుది సమరం ఆదివారం జరుగనుంది. డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) ఫైనల్లో క్రొయేసియా స్టార్, ఆరో సీడ్ మారిన్ సిలిక్‌తో తలపడుతున్నాడు. ఇద్దరు కూడా అసాధారణ ఆటతో ఫైనల్‌కు దూసుకెళ్లారు. ఊహించినట్టే ఫెదరర్ టైటిల్ పోరుకు దూసుకొచ్చాడు. మరోవైపు సిలిక్ కూడా సంచలన విజయాలతో ఫైనల్‌కు చేరాడు. ఈ మ్యాచ్‌లో ఫెదరర్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. అయితే సంచలన విజయాలతో మరో పేరుగా చెప్పకునే సిలిక్‌ను కూడా తక్కువ అంచనా వేయలేం.

భారత్ ఘన విజయం

షమి మ్యాజిక్, రాణించిన ఇషాంత్, బుమ్రా, చివరి టెస్టులో దక్షిణాఫ్రికా చిత్తు

జొహనెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా సిరీస్‌లో భారత్ ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. సౌతాఫ్రికాతో జరిగిన చివరి టెస్టులో కోహ్లి సేన 63 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. ఒక దశలో 123/1తో పటిష్టస్థితితో నిలిచి గెలుపు దిశగా సాగుతున్న సౌతాఫ్రికాను భారత బౌలర్లు అసాధారణ ప్రతిభతో 177 పరుగులకే కుప్పకూల్చారు. స్పీడ్‌స్టర్ మహ్మద్ షమి ఆకాశమే హద్దుగా చెలరేగి పోయాడు. చిరస్మరణీయ బౌలింగ్‌ను కనబరిచిన షమి 28 పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. సౌతాఫ్రికా జట్టులో డీన్ ఎల్గర్ 86 (నాటౌట్), ఆమ్లా (61) అసాధారణ పోరాట పటిమను కనబరిచినా ఫలితం లేకుండా పోయింది. భారత బౌలర్లు సమష్టి ప్రతిభతో జట్టును గెలిపించారు. కాగా, ఆల్‌రౌండ్ ప్రతిభతో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన భువనేశ్వర్ కుమార్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. సిరీస్‌లో నిలకడగా రాణించిన దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ ఫిలాండర్‌కు ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు దక్కింది. ఈ మ్యాచ్‌లో ఓడినా సౌతాఫ్రికా 2–1 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది.



ఎల్గర్, ఆమ్లా పోరాటం...

అంతకుముందు 17/1 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం నాలుగో రోజు బ్యాటింగ్ చేపట్టిన సౌతాఫ్రికాను ఎల్గర్, హాషిం ఆమ్లా ఆదుకున్నారు. వీరద్దరూ సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. ఒకవైపు జాగ్రత్తగా ఆడుతూనే అప్పుడప్పుడూ ఫోర్లు కొడుతూ ముందుకు సాగారు. ఈ జంటను విడగొట్టేందుకు భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో భారత అభిమానులు విజయంపై ఆశలు వదులుకున్నారు. లక్ష్యం మరి పెద్దది కాక పోవడం, ఆమ్లా, ఎల్గర్‌లు నిలదొక్కుకోవడంతో సౌతాఫ్రికా విజయం ఖాయమనిపించింది. లంచ్ విరామ సమయానికి సౌతాఫ్రికా వికెట్ నష్టానికి 69 పరుగులు చేసింది. తర్వాత సౌతాఫ్రికా మరింత కుదురుగా ఆడింది. ఇదే క్రమంలో ఆమ్లా, ఎల్గర్‌లు అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు.

మలుపు తిప్పిన ఆమ్లా ఔట్

లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్న దక్షిణాఫ్రికా జోరుకు ఇషాంత్ బ్రేక్ వేశాడు. కుదురుగా ఆడుతున్న ఆమ్లాను అతను వెనక్కి పంపాడు. తర్వాత వచ్చిన డివిలియర్స్ కూడా నిరాశ పరిచాడు. ఆరు పరుగులు మాత్రమే చేసి బుమ్రా బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ఆ వెంటనే కెప్టెన్ డుప్లెసిస్ కూడా ఔటయ్యాడు. ఈ వికెట్ ఇషాంత్ ఖాతాలోకి వెళ్లింది. మరోవైపు బుమ్రా అద్భుత బంతితో వికెట్ కీపర్ డికాక్(0)ను పెవిలియన్ పంపించడంతో సౌతాఫ్రికా 31 పరుగుల తేడాతో కీలకమైన నాలుగు వికెట్లు కోల్పోయింది.

షమి జోరు..

ఆ తర్వాత స్పీడ్‌స్టర్ మహ్మద్ షమి జోరు ప్రారంభమైంది. షమి నిప్పులు చెరిగే బంతులతో దక్షిణాఫ్రికా లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తించాడు. అతని ధాటికి ఫిలాండర్ (10), ఫెహ్లూక్‌వాయో (0), మోర్కెల్ (0) పెవిలియన్ చేరారు. మరోవైపు భువనేశ్వర్ బౌలింగ్‌లో రబడా (0) కూడా ఔటయ్యాడు. ఇక, ఎన్‌గిడి (4) షమి వెనక్కి పంపడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 177 పరుగుల వద్ద ముగిసింది. ఒక దశలో 123/1తో పటిష్ట స్థితిలో ఉన్న సౌతాఫ్రికా 53 పరుగుల తేడాతో చివరి తొమ్మిది వికెట్లను కోల్పోవడం విశేషం.

స్కోరుబోర్డు:

భారత్ మొదటి ఇన్నింగ్స్: 187

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: 194

భారత్ రెండో ఇన్నింగ్స్: మురళీ విజయ్ (బి) రబడా 25, పార్థివ్ పటేల్ (సి) మార్‌క్రామ్ (బి) ఫిలాండర్ 16, లోకేష్ రాహుల్ (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 16, చటేశ్వర్ పుజారా (సి) డుప్లెసిస్ (బి) మోర్కెల్ 1, విరాట్ కోహ్లి (బి) రబడా 41, అజింక్య రహానె (సి) డికాక్ (బి) మోర్కెల్ 48, హార్దిక్ పాండ్య (సి) అండ్ (బి) రబడా 4, భువనేశ్వర్ కుమార్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 33, షమి (సి) డివిలియర్స్ (బి) ఎన్‌గిడి 27, ఇషాంత్ శర్మ నాటౌట్ 7, బుమ్రా (సి) రబడా (బి) ఫిలాండర్ 0, ఎక్స్‌ట్రాలు 29, మొత్తం 80.1 ఓవర్లలో 247 ఆలౌట్.

బౌలింగ్: ఫిలాండర్ 21.1–5–61–3, రబడా 23–6–69–3, మోర్కెల్ 21–6–47–3, ఎన్‌గిడి 12–2–38–1, ఫెహ్లూక్‌వాయో 3–0–15–0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రామ్ (సి) పార్థివ్ (బి) షమి 4, ఎల్గర్ (నాటౌట్) 86, ఆమ్లా (సి) హార్దిక్ (బి) ఇషాంత్ 52, డివిలియర్స్ (సి) రహానె (బి) బుమ్రా 6, డుప్లెసిస్ (బి) ఇషాంత్ 2, డికాక్ ఎల్బీ (బి) బుమ్రా 0, ఫిలాండర్ (బి) షమి 10, ఫెహ్లూక్‌వాయో (బి) షమి 0, రబడా (సి) పుజారా (బి) భువనేశ్వర్ కుమార్ 0, మోర్కెల్ (బి) షమి 0, ఎన్‌గిడి (సి) కార్తీక్ (బి) షమి 4, ఎక్స్‌ట్రాలు 13, మొత్తం 73.3 ఓవర్లలో 177 ఆలౌట్.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 18–4–39–1, షమి 12.3–2–28–5, బుమ్రా 21–3–57–2, ఇషాంత్ శర్మ 18–3–31–2, హార్దిక్ పాండ్య 6–1–15–0.

ముక్కోణపు టోర్నీ విజేత శ్రీలంక



ఢాకా: బంగ్లాదేశ్ వేదికగా జరిగిన ముక్కోణపు వన్డే టోర్నమెంట్‌లో శ్రీలంక జట్టు ట్రోఫీని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో లంక 79 పరుగుల తేడాతో ఆతిథ్య బంగ్లాదేశ్ జట్టును ఓడించి విజేతగా నిలిచింది. తొలి రెండు మ్యాచుల్లో అనూహ్య ఓటములను చవిచూసిన లంక అసాధారణ పోరాట పటిమతో విజేతగా నిలువడం విశేషం. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 220 పరుగులకే ఆలౌటైంది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాను 142 పరుగులకే ఆలౌట్ చేసి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. సులువైన లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాకు ప్రారంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్ (3), మహ్మద్ మిథున్ (10), వన్‌డౌన్‌లో వచ్చిన షబ్బీర్ రహెమాన్ (2) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. మరోవైపు జట్టులో మహ్మదుల్లా ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. లంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న మహ్మదుల్లా ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 76 పరుగులు చేశారు. అయితే మిగతా వారు విఫలం కావడంతో లంకకు ఓటమి తప్పలేదు. లంక బౌలర్లలో మధుశంక మూడు, చమీరా, అకిల ధనంజయలు రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన లంకను ఉపుల్ తరంగ (56), తిసారా పెరీరా (48) ఆదుకున్నారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.